

ఈ సంచికతోపాటు 12 పేజీల
లైఫ్ సప్లిమెంట్ అందుకోండి

V6 NEWS
ప్రతి దృశ్యం... ప్రజల పక్షం...


ప్రభాత
వెలుగు
03.01.2019
www.v6velugu.com
గురువారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 318 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL

గులాబీ తోటలో కొత్త జోష్ కనిపిస్తోంది. అది కొత్త ఏడాది కంటే 15 రోజుల ముందే మొదలైంది. తెలంగాణ భవన్‌కు అటూ ఇటూ రోడ్ల మీద రద్దీ ఎక్కువైంది. గతంలో ఎప్పుడో ఒకసారి కనిపించే సందడి ఇప్పుడు రోజూ కనిపిస్తోంది. ఎప్పుడూ రానంత మంది నాయకులు, కార్యకర్తలు, జనం ఒకేసారి వస్తున్నారు. భవన్ నిండిపోయి రోజూ పండుగే అవుతున్నది. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ వచ్చాక స్పష్టంగా కనిపిస్తున్న మార్పు ఇది. రకరకాల ఆశలు, ఆకాంక్షలు, వినతులు, ఆలోచనలతో వచ్చేవాళ్లందరితో ఆయన మాట్లాడుతున్నారు. ఒక్కసారి కలిసి షేక్‌హ్యాండ్ ఇచ్చిపోవాలనుకునేవాళ్లకు లెక్కే లేదు. ఈ మార్పు పార్టీ ఆఫీసు దగ్గర సందడితోనే ఆగిపోలేదు. భవన్ లోపల గ్రీవెన్స్ సెల్ నుంచి జిల్లాల్లో పార్టీ ఆఫీసుల నిర్మాణం వరకు కనిపిస్తోంది. నేతల మధ్య విభేదాల పరిష్కారం నుంచి కిందిస్థాయిలో పార్టీ నిర్మాణం వరకు చేరుతోంది. మూడు వారాల్లోపే పడిన 'రామ్' ముద్ర ఇది.

ప్రెసిడెంట్ వర్కింగ్

గులాబీ పార్టీలో కేటీఆర్ జోష్

- కొత్త బాధ్యతలతో వర్కింగ్ ప్రెసిడెంట్ బిజిబిజీ
- పార్టీ–ప్రభుత్వం మధ్య వారధిగా చురుకైన పాత్ర
- నేతలు, కార్యకర్తలతో వరుస సమావేశాలు
- పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం
- వేగం పుంజుకున్న పార్టీ ఆఫీసుల నిర్మాణం
- కళకళలాడుతున్న తెలంగాణ భవన్



డిసెంబర్ 14
కేటీఆర్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్టు కేసీఆర్ ప్రకటన
డిసెంబర్ 15
పార్టీ కార్యవర్గ సమావేశం
డిసెంబర్ 17
వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతల స్వీకరణ
డిసెంబర్ 18
పార్టీ ప్రధాన కార్యదర్శులతో భేటీ
డిసెంబర్ 19
సొంత నియోజకవర్గం సిరిసిల్లలో పర్యటన
డిసెంబర్ 20
వరంగల్ జిల్లాలో పర్యటన
డిసెంబర్ 27, 28, 29
పార్టీ ఆఫీసులో నేతలు, జనంతో భేటీలు
డిసెంబర్ 30
కూకట్‌పల్లి, సికింద్రాబాద్ నియోజవర్గాల్లో కార్యకర్తలతో సమావేశం
జనవరి 1
తెలంగాణ భవన్‌లో పార్టీ కార్యకర్తలకు అందుబాటులో
జనవరి 2
సనత్‌నగర్ నియోజవర్గంలో కార్యకర్తలు, జనంతో భేటీ

02



పొలిటికల్
కొత్తగా 2 జిల్లాలు
ములుగు, నారాయణపేట్ జిల్లాలను ఏర్పాటు చేస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం.
03



పొలిటికల్
'విస్తరణ'కు కోడ్ బ్రేక్
మంగళవారం నుంచి పంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మంత్రివర్గ విస్తరణ మరింత ఆలస్యం కానుంది.
03



ప్లే
అదుగో చరిత్ర.. అందుకుంటారా!
నేటి నుంచి సిడ్నీ టెస్ట్ .. సిరీస్‌పై టీమిండియా గురి.. సమం చేయాలని ఆసీస్ ఆరాటం.
11



బిజినెస్
ఈపీఎఫ్ రేటు పెరిగే చాన్స్
వచ్చే నెలలో కొత్త రేట్ల ప్రకటన.. ఎన్నికల ఏడాది కాబట్టి రేట్ల పెంపునకు అవకాశం.
10



బుధవారం కన్నెపల్లి వద్ద గ్రావిటీ కెనాల్ పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్

03

ఇట్లైతే నడువదు.. స్పీడ్ పెంచాలె

- కాళేశ్వరం పనులు వేగంగా పూర్తి చేయాలి
- అధికారులు, కాంట్రాక్టర్లకు కేసీఆర్ ఆదేశం
- మార్చి నెలాఖరులోగా పనులన్నీ పూర్తి చేయాలి
- కార్మికుల సంఖ్య పెంచి, మూడు షిఫ్టులు కొనసాగించండి
- సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, పంపుహౌస్‌లు, గ్రావిటీ కెనాల్ పరిశీలన
- సరిపోని టైం.. రాంపూర్ పంపుహౌస్ చూడకుండానే వెనక్కి



శబరిమలలో మహిళల అడుగు

ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు కేరళ మహిళలు

- బందోబస్తు మధ్య బుధవారం తెల్లవారుజామున దర్శనం
- ధ్రువీకరించిన కేరళ సీఎం విజయన్
- ఆలయం మూసి సంప్రోక్షణ చేసిన పూజారులు
- నేడు కేరళ బంద్‌కు బీజేపీ పిలుపు

05

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
92.00	92.00	92.00
కరీంనగర్	నిజామాబాద్	ఖమ్మం
92.00	92.00	92.00

రాఫెల్‌పై మళ్లీ రచ్చ

విమానాల కొనుగోలు ఒప్పందంపై రాహుల్ ఫైర్

- పారికర్ దగ్గర అన్ని ఫైళ్లు ఉన్నట్టు ఆడియో టేప్ ఉంది
- దానిని సభలో వినిపించేందుకు అనుమతివ్వాలన్న కాంగ్రెస్ చీఫ్
- అది బూటకపు ఆడియో టేప్ అన్న జైట్లీ
- లోక్‌సభలో కాగితపు విమానాలు విసిరిన కాంగ్రెస్ సభ్యులు

రాఫెల్ డీల్‌పై జేపీసీతో విచారణ జరిపించాలి. రాఫెల్ విచారణ వ్యవహారం తమ పరిధిలోకి రాదని సుప్రీంకోర్టు పేర్కొందే కానీ జేపీసీ ఏర్పాటు చేయకూడదని ఎక్కడా అనలేదు. రక్షణ శాఖ 126 విమానాలు కావాలంటే వాటి సంఖ్య 36కు ఎందుకు కుదించారు. యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన అన్ని ఫైళ్లు మాజీ రక్షణ మంత్రి మనోహర్ పారికర్ దగ్గర ఉన్నట్లు వచ్చిన ఆడియో టేపును పార్లమెంటులో వినిపించడానికి అనుమతి ఇవ్వాలి.

– కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ

అది బూటకపు ఆడియో టేప్. బీజేపీ సర్కార్‌ను అప్రతిష్టపాలు చేయడానికి కాంగ్రెస్ కావాలని కట్టుకథలు అల్లుతోంది. ఆ ఆడియో టేపు నిజమైనదే అని రాహుల్ చెప్పగలరా? దీనికి బాధ్యత వహిస్తారా? ఆ క్లిప్ అబద్ధమని తేలితే హక్కుల తీర్మానం కింద సభ నుంచి బహిష్కారం ఎదుర్కోవడానికి సిద్ధమేనా? డబ్బుకు సంబంధించిన అంశాలను బాగా అర్థం చేసుకునే కొంతమంది, జాతీయ భద్రతకు సంబంధించిన విషయాలను అర్థం చేసుకోలేరు.

– కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

05



దమ్ముంటే నాతో చర్చకు రండి

రాఫెల్ డీల్‌పై ప్రధాని నరేంద్ర మోడీ ముఖాముఖి చర్చకు వస్తే 20 నిమిషాల్లో తేల్చేస్తా. నిజానిజాలు బయటకు రప్పిస్తా. రాఫెల్ డీల్‌పై ఎన్నెన్నో అనుమానాలున్నాయి. దానిపై ప్రధాని వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. సమాధానాలివ్వలేక అరుణ్ జైట్లీ లాంటి వ్యక్తులతో మాట్లాడిస్తున్నారు. జెట్ ఫైటర్లకు సంబంధించిన ఏ విషయంపైనైనా నేను మాట్లాడతా. దమ్ముంటే ముందుకు రండి

- ప్రధాని నరేంద్ర మోడీకి రాహుల్ సవాల్

‘రైతుబంధు’, వడ్డీ లేని రుణాలు!

త్వరలో ప్రకటించనున్న కేంద్రం?

హైదరాబాద్, వెలుగు: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అంతా ఊహిస్తున్నట్టుగానే రైతులకు లబ్ధి చేకూర్చే పథకాలను త్వరలో కేంద్రం ప్రకటించనున్నట్టు సమాచారం. కేసీఆర్ రైతుబంధు తరహాలోనే రైతులకు ఒక్కో సీజన్‌కు ఎకరాకు రూ.4 వేల చొప్పున నేరుగా నగదు బదిలీ చేయాలని ప్రతిపాదిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతోపాటు రూ.లక్ష దాకా రైతులకు వడ్డీలేని రుణాలివ్వాలని కూడా నిర్ణయానికి వచ్చినట్టు అత్యున్నత స్థాయి ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ ‘బిజినెస్ టుడే’ పేర్కొంది. అయితే రైతుబంధు మాదిరిగా సీజన్‌కు ముందుగా కాకుండా పంట అమ్మే సమయంలో నేరుగా నగదు బదిలీ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. పైగా ఈ పథకాల భారంలో 30 శాతాన్ని రాష్ట్రాలు భరించాలనే ప్రతిపాదన కూడా ఉండటంతో రాష్ట్రాలు దీనికి ఎంతమేరకు అంగకరిస్తారోనన్న ఆలోచనా ఉంది. పంట సాయానికి రూ.2 లక్షల కోట్లు, వడ్డీ మాఫీకి రూ.30 వేల కోట్ల దాకా అవుతుందని అంచనా. కేంద్రం ఇప్పటికే ఎరువుల రాయితీపై ఏటా రూ.70 వేల కోట్లు భరిస్తోంది. దీన్ని కొత్త పథకంలో కలిపేయడం ద్వారా భారాన్ని తగ్గించుకునే యోచనలో ఉందంటున్నారు. ప్రతిపాదనలపై మంత్రులు, అధికారులతో చర్చలు జరుగుతున్నాయి. మార్పుచేర్పుల అనంతరం వారంలోగా పథకాలను ప్రకటించనున్నారని బిజినెస్ టుడే పేర్కొంది. రైతుల కోసం మోడీ సర్కారు వారంలో పథకాలు ప్రకటించనుం దని ‘వెలుగు’ ఇటీవలే కథనం ప్రచురించడం తెలిసిందే.

తొలగని చలి దుప్పటి

హైదరాబాద్, వెలుగు:

- ఈశాన్య గాలులతో వణుకుతున్న జనం
- నేడూ చలిగాలులు.. పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

ఈశాన్య గాలులతో ప్రజలు వణికిపోతున్నారు. ఉదయం 8 దాటినా సూర్యుడు కనిపించట్లేదు. పలు ప్రాంతాల్లో మంచు దట్టంగా కురుస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో చలి మరింత తీవ్రంగా ఉంది. రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. బుధవారం (మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు) ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 8 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. మెదక్‌లో 6.3 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 6.4, రామగుండంలో 9.4, హైదరాబాద్‌లో 9.8, హన్మకొండలో 11.5, నిజామాబాద్‌లో 11.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం ఆరులోపే చలి పెరుగుతుండటంతో జనం బయటకు వచ్చేందుకు వెనకడుగేస్తున్నారు. చలి తీవ్రతకు కొన్ని జిల్లాల్లో వృద్ధులు చనిపోతున్నారు. చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం, కామారెడ్డి, పెద్దపల్లి, మెదక్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గురువారం చలిగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

ఉష్ణోగ్రత వివరాలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
మెదక్	29.8	6.3
ఆదిలాబాద్	28.8	6.4
రామగుండం	28.6	9.4
హైదరాబాద్	28.8	9.8
హన్మకొండ	28.5	11.5
నిజామాబాద్	29.8	11.7
ఖమ్మం	29.4	12.2
భద్రాచలం	29.0	12.5
మహబూబ్‌నగర్	32.2	13.5
హాకీంపేట	27.9	13.9



మన హైకోర్ట్ పని షురూ

హైదరాబాద్, వెలుగు:

- మొదలైన కేసుల విచారణ.. జడ్జిలతో సీజే సమావేశం
- 1.87 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడి
- నాణేనికి చెరో వైపులా కాదు.. రథానికి రెండు చక్రాల్లా ఉండండి
- బెంచ్ అండ్ బార్‌కు సీజే జస్టిస్ రాధాకృష్ణన్ సూచన
- మూడు ద్విసభ్య ధర్మాసనాల ఏర్పాటు

కొత్త సంవత్సరంలో కొత్త జడ్జిలతో కొత్త హైకోర్టు కొలువుదీరింది. మంగళవారం జడ్జిల ప్రమాణ స్వీకారంతో హైకోర్టు ఏర్పడితే, బుధవారం నుంచి కేసుల విచారణ మొదలైంది. ఈ సందర్భంగా మొదటి కోర్టు హాల్లో ప్రధానన్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ అధ్యక్షతన న్యాయమూర్తులతో ఫుల్ కోర్టు సమావేశమైంది. తెలంగాణ అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.87 లక్షల పెండింగ్ కేసులతో హైకోర్టు ఏర్పడిందని, వీటి పరిష్కారం కోసం న్యాయవాదులు, న్యాయమూర్తులు (బెంచ్ అండ్ బార్) సమష్టిగా పనిచేయాలని సీజే జస్టిస్ రాధాకృష్ణన్ అన్నారు. నాణేనికి చెరో వైపు కాకుండా రథానికి రెండు చక్రాల్లా ఉంటూ న్యాయాన్ని ముందుకు నడిపించాలన్నారు. ప్రమాణాలతో కూడిన న్యాయం సకాలంలో అందించేందుకు పాటుపడాలని జడ్జిలు, లాయర్లకు సూచించారు. గుణాత్మకంగా, శాస్త్రీయంగా, సకాలంలో న్యాయం అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పెండింగ్ కేసులను తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. చారిత్రక మార్పును నిన్నటిదాకా చూశామని, కొత్త ఏడాదికి స్వాగతం చెబుతూ హైకోర్టు ఏర్పడిందని అన్నారు. సమర్థంగా పనిచేస్తామంటూ బార్ అండ్ బెంచ్ వాళ్లంతా ప్రమాణం చేశారని, దానికి అనుగుణంగా చేతిలో చెయ్యేసి మరోసారి ప్రమాణం చేయాలని కోరారు. హైకోర్టు ఏర్పాటుకు న్యాయవాదులు, ప్రభుత్వం, సిబ్బంది, న్యాయాధికారులు శ్రమించడం వల్లే అవరోధాల్లేకుండా తెలంగాణ హైకోర్టు ఏర్పడిందన్నారు.

మూడు ధర్మాసనాలు

హైకోర్టు కొలువుదీరిన సందర్భంగా మూడు ద్విసభ్య ధర్మాసనాలను ఏర్పాటు చేశారు. మొదటి ధర్మాసనంలో సీజే జస్టిస్ రాధాకృష్ణన్, జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డిలతో ఏర్పాటు అయ్యింది. రెండో డివిజన్ బెంచ్‌లో జస్టిస్ రాఘవేంద్ర ఎస్ చౌహాన్, జస్టిస్ టీ అమర్‌నాథ్‌గౌడ్, మూడో డివిజన్ బెంచ్‌లో జస్టిస్ వీ రామసుబ్రమణియన్, జస్టిస్ పీ కేశవరావులు ఉన్నారు. మొదటి ధర్మాసనం ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్), రిట్ అప్పీళ్లు, ధిక్కరణ అప్పీళ్లు, క్రిమినల్ ధిక్కరణ అప్పీళ్లు, హెబియస్ కార్పస్ కేసులు, సుమోటో రిట్ పిటిషన్లు, హైకోర్టు, జ్యుడీషియల్ సర్వీసెస్, జిల్లా కోర్టులకు సంబంధించిన కేసులు విచారిస్తుంది. రెండో ధర్మాసనం క్రిమినల్ అప్పీళ్లు, భూసేకరణ, సిటీ సివిల్ కోర్టు అప్పీళ్లు, సివిల్ రివిజన్ పిటిషన్లు తదితర అంశాలను విచారిస్తుంది. మూడో ధర్మాసనం ఆదాయం పన్ను ట్రిబ్యునల్ అప్పీళ్లు, సెంట్రల్ ఎక్సైజ్, ఆదాయపు పన్ను, మనీలాండరింగ్ అప్పీళ్లు తదితర కేసుల్ని విచారిస్తుంది.

బీజేపీలోకి మౌసమీ ఛటర్జీ

బెంగాల్ నుంచి లోక్ సభ కు పోటీ ?

న్యూఢిల్లీ : అలనాటి హిందీ నటి మౌసమీ ఛటర్జీ బుధవారం బీజేపీలో చేరారు. పార్టీ సీనియర్ నేతలు కైలాశ్ విజయ్ వర్గీయ, ముకుల్ రాయ్ సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు.70ల్లో అనేక హిందీ, బెంగాలీ చిత్రాల్లో ఆమె నటించారు. 2004లోక్ సభ ఎన్నికల్లో ఆమె కాంగ్రెస్ టికెట్ పై ఈశాన్య కోల్‌కతా నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.తర్వాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. లోక్ సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండడంతో సెలబ్రిటీలను పార్టీలోకి తీసుకోవాలని బీజేపీ నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే మౌసమీ ఛటర్జీ బీజేపీలో చేరినట్లు తెలిసింది. మౌసమీ చేరికతో బీజేపీకి తప్పకుండా లాభం కలుగుతుందని విజయ్ వర్గీయ చెప్పారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్లో పార్టీ బలోపేతం అవుతుందన్నారు.పార్టీలో చేరిన మౌసమీ ఛటర్జీకి బీజేపీ ప్రెసిడెంట్ అమిత్ షా వెల్ కం చెప్పారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బెంగాల్ నుంచి ఆమె పోటీ చేస్తారని ఢిల్లీ వర్గాల సమాచారం.

తక్కువ టైంలోనే కేటీపీఎస్ 7వ దశ

ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు

హైదరాబాద్, వెలుగు: పాల్వంచ కేటీపీఎస్ 7వ దశను అతి తక్కువ కాలంలోనే పూర్తి చేశామని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు అన్నారు. 42 నెలల్లోనే 800 మెగావాట్ల ప్లాంట్‌ను పూర్తి చేశామని, రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి చేస్తున్నామన్నారు. బుధవారం ఆయన్ను తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. దేశంలో తక్కువ కాలంలో పూర్తయిన విద్యుత్ ప్లాంట్ కేటీపీఎస్ 7వ దశేనని ప్రభాకర్ రావు అన్నారు.

సీఎం ఓఎస్డీగా ప్రియాంక వర్గీస్ కొనసాగింపు

హైదరాబాద్, వెలుగు: ఐఎఫ్ఎస్ ఆఫీసర్ ప్రియాంక వర్గీస్‌ను సీఎం ఓఎస్డీ(హరితహారం)గా కొనసాగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘తెలంగాణకు హరితహారం’ కార్యక్రమం కోసం ఆమెను గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్‌కు ఓఎస్డీగా నియమించారు. ఆర్ అండ్ టీ సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్‌గా పనిచేస్తున్న ప్రియాంక సేవలను మరోసారి వినియోగించుకోవాలని సీఎంవోలోకి తీసుకున్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 17,869

- ముసాయిదా జాబితా ప్రకటన
- ఈ నెల 31 వరకు అభ్యంతరాల స్వీకరణ, కొత్త ఓటర్ల నమోదు
- ఫిబ్రవరి 20న తుది జాబితా

నల్లగొండ, వెలుగు: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాను నల్లగొండ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి బుధవారం ప్రకటించారు. మూడు జిల్లాల్లో మొత్తం ఓటర్లు 17,869 మంది ఉన్నారు. దీంట్లో పురుషులు 11 ,642, మహిళలు 6,224, ఇతరులు ముగ్గురు ఉన్నారు. ఈ జాబితాపై ఈనెల 31లోపు అభ్యంతరాలు స్వీకరిస్తూ కొత్త ఓటరు నమోదుకు అవకాశమిచ్చారు. అభ్యంతరాలను ఫిబ్రవరి 15 నాటికి పరిష్కరిస్తారు. అనంతరం తుది జాబితాను ఫిబ్రవరి 20న ప్రకటిస్తారు. మూడు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 181 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. మండలానికో పోలింగ్ కేంద్రం ఉంటుంది.

ఈ సారి తగ్గిన ఓటర్లు..

మూడు జిల్లాల్లో 18,536 మంది ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు చేసుకున్నారు. వీరిలోంచి అర్హులైన 17,869 మందితో ఓటరు ముసాయిదా జాబితా రూపొందించారు. గతంతో పోలిస్తే ఉపాధ్యాయ ఓటర్లు తగ్గారు. గత ఎన్నికల్లో మూడు జిల్లాల్లో 20,441 మంది ఉపాధ్యాయులు ఓటరు నమోదు చేసుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎవరనే చర్చ జరుగుతోంది. పీఆర్టీయూ తరఫున ప్రస్తుత ఎమ్మెల్సీ పూల రవీందర్‌కే రెండో దఫా అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. యూటీఎఫ్ తరఫున రాష్ట్ర నాయకులు నర్సిరెడ్డి పేరు పరిశీలనలో ఉంది.

GENERAL NEWS జనరల్

ప్రెసిడెంట్ వర్కింగ్

గులాబీ పార్టీలో కేటీఆర్ జోష్ • కొత్త బాధ్యతలతో వర్కింగ్ ప్రెసిడెంట్ బిజీబిజీ

హైదరాబాద్, వెలుగు:

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ పగ్గాలు చేపట్టిన తర్వాత తెలంగాణ భవన్ పరిసరాలు సందడిగా మారాయి. పార్టీ శ్రేణుల్లోనూ కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. టీఆర్ఎస్ భవన్‌కు నిత్యం వేలాదిగా కార్యకర్తలు వస్తున్నారు. వచ్చిన వారందరినీ కేటీఆర్ పలకరిస్తున్నారు. వారు చెప్పే మాటల్ని వింటున్నారు. అప్లికేషన్లను తీసుకొని ప్రత్యేక వ్యవస్థ ద్వారా ఫైలింగ్ చేయిస్తున్నారు. పార్టీ శ్రేణులే కాకుండా సామాన్య జనం, వివిధ రంగాలవారు కూడా కేటీఆర్‌ను కలిసేందుకు వస్తున్నారు.

తెల్లారి నుంచే రంగంలోకి..

పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ డిసెంబర్ 14న కేటీఆర్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించారు. ఆ మరుసటి రోజే ఆయన రంగంలోకి దిగి పార్టీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శులతో భేటీ అయ్యారు. సమావేశాల్లో ప్రధానంగా పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని నేతలకు చెప్పారు. ప్రతి నియోజక వర్గంలో తక్షణం భేటీ నిర్వహించాలని ఆదేశించారు. దీంతో డిసెంబర్ 22 నుంచి 25 తేదీల్లో వందకు పైగా నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర నేతలు కలిసి కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. 21 నుంచి 26 వరకు ఫారిన్ టూర్‌కు వెళ్లిన కేటీఆర్ 27న పార్టీ ఆఫీసుకు వచ్చారు. మొత్తంగా విదేశీ పర్యటన మినహా మిగతా అన్ని రోజుల్లో కేటీఆర్ పార్టీ కార్యకలాపాల్లో బిజీబిజీగా గడిపారు.

వేగంగా పార్టీ ఆఫీసుల పనులు

ప్రతి జిల్లాల్లో తక్షణం పార్టీ ఆఫీసులు ఏర్పాటు చేయాలని కేటీఆర్ నేతలకు చెప్పారు. ఇప్పటికే నాలుగైదు జిల్లాల్లో భూమి పూజలు పూర్తయ్యాయి. 20 జిల్లాల్లో స్థల సేకరణ పూర్తయింది. మిగిలిన జిల్లాల్లో భూమి కొనుగోలుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

సందడే సందడి

ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఆఫీసు సందడిగా కనిపించేది. అధికారంలోకి వచ్చాక ఆ వేదిక ప్రగతి భవన్‌కు మారింది. అడపాదడపా పార్టీ కార్యాలయంలో సందడి నెలకొన్నా కేటీఆర్ పగ్గాలు చేపట్టిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గ్రేటర్ ఎన్నికలు, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ తన ప్రచార శైలి, వ్యూహాలతో అనూహ్యమైన ఫలితాలు సాధించారు. ఇతర ఎన్నికల్లోనూ ఆయన తనకు అప్పజెప్పిన బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించారు. ఈ 15 రోజుల్లో ఆయన యాక్టివిటీని చూసి సీనియర్ నేతలే ఆశ్చర్యపోతున్నారు. కేటీఆర్ స్వయంగా చెప్పుకున్నట్లు ఆయనకు కేసీఆర్ వారసుడిగా కాకుండా పనితీరు వల్లే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం లభించిందని వారు చెబుతున్నారు. కలుపుగోలుతనం, విషయాలపై స్పష్టమైన అవగాహన, అభిప్రాయాన్ని సూటిగా చెప్పే సామర్థ్యం, అందరినీ కలుపుకుపోయే తత్వం కారణంగా ఆయనకు తక్కువ కాలంలోనే మంచి నాయకుడిగా పేరొచ్చిందని అంటున్నారు. పార్టీ వేదికలపై ఆయన చేస్తున్న ప్రసంగాలు కూడా పరిణతితో కూడి ఉంటున్నాయని, అందరూ సమానమేనని, పార్టీకి దూరమైనవారిని సైతం కలుపుకుపోవాలన్న ఆయన వైఖరిని నాయకులు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. అందుకే రాజకీయాలతో సంబంధం లేనివారు కూడా కేటీఆర్‌ను కలిసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నిత్యం సినీ, పారిశ్రామిక రంగాలతోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్దఎత్తున పార్టీ ఆఫీస్‌కు తరలి వస్తున్నారు. నిత్యం పార్టీ నేతలు కాకుండా రెండు, మూడు వందల మంది సామాన్యులతో ఆయన భేటీ అవుతున్నారు.



తెలంగాణ భవన్‌లో వినతులు స్వీకరిస్తున్న కేటీఆర్

పోటెత్తుతున్న ఆశావహులు

ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా స్థాయి నేతలు, ఆశావహులు అనేక మంది వచ్చి కేటీఆర్‌ను కలుస్తున్నారు. తమ ఆలోచనలు, ఆకాంక్షలను ఆయనకు చెప్పుకుంటున్నారు. మంత్రి పదవులు, ఎమ్మెల్సీ స్థానాలు, ఎంపీ టికెట్లు, నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవులను ఆశిస్తున్న వారు సైతం కలుస్తున్నారు. కార్యకర్తలు సైతం యువనేతతో ఒక్కసారి కరచాలనం చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు.

పార్టీ నిర్మాణంపై దృష్టి

ఉద్యమ సమయంలో కేసీఆర్ సహా నేతలు పార్టీ నిర్మాణంపై తగినంత దృష్టి పెట్టలేకపోయారు. గత ఎన్నికల్లో విజయం తర్వాత కూడా అస్తవ్యస్తంగా ఉన్న పాలనను గాడిలో పెట్టాల్సి వచ్చింది. ప్రధానంగా పాలన, విభజన సమస్యలపైనే ఫోకస్ పెట్టారు. పార్టీ నిర్మాణం ఉన్నప్పటికీ పకడ్బందీ వ్యవస్థ లేదు. దాంతో సీఎం కేసీఆర్ ఆ బాధ్యతను కేటీఆర్‌పై పెట్టారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కేటీఆర్ కూడా పార్టీ బలోపేతం, సభ్యత్వాల నమోదు, పార్టీ ఆఫీసుల నిర్మాణం, బూత్ నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీల బలోపేతం వంటి కార్యాచరణను మొదలుపెట్టారు.

నేతల మధ్య సయోధ్య

పార్టీలో ఏవైనా విబేధాలు ఉంటే కేటీఆర్ అన్ని పక్షాలతో చర్చించి, అందరినీ ఒప్పించి చాకచక్యంగా సమస్యలను పరిష్కరిస్తున్నారు. అందరూ పార్టీ కోసం పని చేసేలా దిశానిర్దేశనం చేస్తున్నారు. ఎవ్వరినీ నొప్పించకుండానే అందరి మెప్పు పొందుతున్నారు. పాలనలో సీఎం కేసీఆర్ బిజీగా ఉంటున్నందున కేటీఆర్ పార్టీకి, ప్రభుత్వానికి వారధిగా ఉంటున్నారు. రెండింటికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయన్ను కలిసేవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది.

భవన్‌కే కళ వచ్చింది

నేను 2006 నుంచి తెలంగాణ భవన్‌లో పనిచేస్తున్న. కేసీఆర్ సార్ వచ్చినప్పుడు ఎంత కళ ఉండెనో ఇప్పుడు అట్లనే అనిపిస్తుంది. కేటీఆర్ సార్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత ప్రజలు పెద్ద సంఖ్యలో భవన్‌కు వస్తున్నరు. వారందరితో భవన్‌కే కళ వచ్చింది. మాకు పని ఎక్కువైనా ఆశతో వస్తున్న ప్రజలను చూస్తుంటే ఆనందం కలుగుతుంది.

-రాము, ఆఫీస్‌బాయ్, తెలంగాణ భవన్

నిర్మాణానికే ఫుల్ టైమ్

సీఎం కేసీఆర్ పాలనపై దృష్టి పెట్టడంతో పార్టీ నిర్మాణం కోసం కేటీఆర్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పజెప్పారు. ఆయన ఇప్పుడు పార్టీ పనిపైనే ఫుల్ టైం పెడుతున్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలను ఆయన కలవడం కేడర్‌కు బూస్టింగ్ ఇస్తోంది. పార్టీ పూర్తిస్థాయి నిర్మాణంతో పాటు జిల్లా ఆఫీసులతో మాకు కూడా గుర్తింపు దొరుకుతుంది.

– తంగెడ మహేందర్, పార్టీ నాయకుడు, వరంగల్ అర్బన్ జిల్లా

ఇప్పుడు రోజూ రెండు వందలు

నాలుగు నెల్ల కాన్నుంచి తెలంగాణ భవన్ కాడ్నే పల్లీలు, బఠాణీలు అమ్ముతున్న. వారానికి ఒకటిరెండ్రోజులు తప్ప ఇక్కడికే వత్తున్న. రోజుకు రెండు వందలు మిగులుతున్నయి. ఇక్కడేమీ లేకపోతే నెక్లెస్ రోడ్డుకు పోయి అమ్ముత. అక్కడ ఎక్కువ దూరం తిరగాలే. ఇక్కడైతే ఒక్కకాడ్నే అమ్ముడుపోతున్నయి.

- స్వామి, చిరు వ్యాపారి

తెలంగాణ భవన్‌లో కోలాహలం

కేటీఆర్‌కు విషెస్, వినతులు

హైదరాబాద్, వెలుగు : తెలంగాణ భవన్‌కు బుధవారం జనం భారీగా తరలివచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 300 మంది టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి వినతులు సమర్పించారు. నగరంలో పార్టీ కార్యక్రమాలు ముగించుకొని సాయంత్రం తెలంగాణ భవన్‌కు వచ్చిన కేటీఆర్.. తొలుత పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులతో భేటీ అనంతరం ప్రజలతో మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన నేషనల్ షూటింగ్ చాంపియన్ ఇషాసింగ్ కూడా కేటీఆర్‌ను కలిశారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు తేవాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సాయం చేస్తామన్నారు. ఎంపీ సీతారాం నాయక్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, జీవన్‌రెడ్డి, కేపీ వివేకానంద, గువ్వల బాలరాజు, రవీంద్రకుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, పురాణం సతీశ్, శంభీపూర్ రాజు, భూపాల్‌రెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, వెలుగు: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టీజీవో) టీఎస్‌పీఎస్సీ యూనిట్ క్యాలెండర్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ గంటా చక్రపాణి, కమిషన్ సెక్రటరీ వాణిప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. ఉద్యోగులు మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీజీవో యూనిట్ ప్రెసిడెంట్ సమియొద్దీన్, కార్యదర్శి మల్లికార్జున్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ న్యూ ఇయర్ సార్



గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న కేటీఆర్

హైదరాబాద్, వెలుగు:

గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను బుధవారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కేటీఆర్‌ను గవర్నర్ ఈ సందర్భంగా అభినందించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఉన్నారు.

జస్టిస్ రాధాకృష్ణన్‌జీ.. వెల్‌కమ్

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆవిర్భావంపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ట్విట్ చేశారు. సీఎం కేసీఆర్, ఎంపీల కృషితోనే ఇది సాధ్యమైందని ట్విటర్‌లో పేర్కొన్నారు. ‘హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ రాధాకృష్ణన్ జీ వెల్‌కమ్’ అంటూ స్వాగతం పలికారు. న్యాయవాదులు, జ్యుడీషియరీ స్టాఫ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ‘హైకోర్ట్ ఫర్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ’ బోర్డుతోపాటు, సీఎం కేసీఆర్ సీజేకు శుభాకాంక్షలు తెలుపుతున్న, న్యాయవాదులు మిఠాయిలు పంచుకుంటున్న, హైకోర్టు ఫొటోలను ట్యాగ్ చేశారు.

కేటీఆర్‌ను కలిసిన గంటా చక్రపాణి

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టీఎస్‌పీఎస్సీ చైర్మన్ గంటా చక్రపాణి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


కేటీఆర్‌తో ప్రకాశ్‌రాజ్ భేటీ

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సినీ నటుడు ప్రకాశ్ రాజ్ కలిశారు. బుధవారం బేగంపేట క్యాంప్ కార్యాలయంలో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు చర్చించారు. జాతీయ రాజకీయాలు, ఫెడరల్ ఫ్రంట్ సన్నాహాలు ఇతర అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపైనా కేటీఆర్‌ను సలహాలు, సూచనలు అడిగినట్టు సమాచారం. భేటీ తర్వాత కేటీఆర్‌కు ట్విట్టర్‌లో ప్రకాశ్‌రాజ్ కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ జీవితం ప్రారంభానికి స్ఫూర్తిమంతమైన సహకారం ఇచ్చారని పేర్కొన్నారు. ఏ ఒక్కరికో వ్యతిరేకంగా తన రాజకీయ పయనాన్ని ప్రారంభించలేదని, సామాన్యుడి స్వరంగా సమాజం కోసం తొలి అడుగు వేస్తున్నానని పేర్కొన్నారు.

గవర్నర్‌కు కేటీఆర్ గ్రీటింగ్స్

బీఎస్ రాములు సాహితీ కృషి అమూల్యం: కేటీఆర్

రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో బీఎస్ రాములు చేసిన సాహితీ కృషి ఎంతో గొప్పదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బేగంపేట క్యాంప్ కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు రచించిన ‘దేశానికి దిక్సూచి తెలంగాణ’ పుస్తకాన్ని కేటీఆర్ బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఈ పుస్తకంలో గొప్పగా వివరించారని, ఇది భావితరాలకు దిక్సూచిగా పనిచేస్తుందని కొనియాడారు. తెలంగాణ భావజాలంతో ఆయన ఎన్నో పుస్తకాలు రచించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, డాక్టర్ ఆంజనేయగౌడ్ పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, కేటీఆర్, గంటా చక్రపాణి

గురువారం | హైదరాబాద్
03.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

జిల్లాలుగా ములుగు, నారాయణపేట్

ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చిన సర్కారు ○ అభ్యంతరాలకు నెల రోజులు గడువు

హైదరాబాద్, వెలుగు: అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ములుగు, నారాయణపేట కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రిలిమినరీ నోటిఫికేషన్లు జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 9 మండలాలను విభజిస్తూ ములుగు జిల్లాగా ఏర్పాటు చేయనున్నారు. ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వెంకటాపురం, వాజేడు మండలాలు కొత్త జిల్లా కిందికి రానున్నాయి. నారాయణపేట జిల్లాను 12 మండలాలతో ఏర్పాటు చేయనున్నారు. రెండింటిలోనూ ఒకే రెవెన్యూ డివిజన్లు ఉండనున్నాయి.

కొత్త మండలాలు కూడా..

ఇక నిజామాబాద్ జిల్లాలో వర్ని మండలం నుంచి మోస్రా, చందూరు మండలాలను, సిద్దిపేటరూరల్ మండలం నుంచి నారాయణ్‌రావుపేట మండలాన్ని, మేడ్చల్ జిల్లాలో కొత్తగా చిన్న మతంపల్లి మండలాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనగామ జిల్లా నుంచి గుండాల మండలాన్ని యాదాద్రి జిల్లాకు మార్చుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాజేశ్వర్ తివారీ పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటుకు సంబంధించి నెల రోజులపాటు అభ్యంతరాలు, సూచనలను స్వీకరిస్తారు.



బుధవారం అన్నారం బ్యారేజీ పనులను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి

‘విస్తరణ’కు కోడ్ బ్రేక్!

హైదరాబాద్, వెలుగు:

- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా
- బతుకమ్మ చీరలు, అన్ని రకాల చెక్కుల పంపిణీ నిలిపివేత

పంచాయతీ ఎన్నికల కోడ్ మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ మరింత ఆలస్యమయ్యే అవకాశముంది. అయితే ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించేందుకు అసెంబ్లీని సమావేశపరిచే అవకాశం ఉంది. దీనికి రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి.

ఆగిన చెక్కుల పంపిణీ

బతుకమ్మ చీరలు, రైతు బంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వాన్ని ఆదేశించింది. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కూడా తాత్కాలికంగా నిలిపివేయాలని, అత్యవసరం అయితే అనుమతి తీసుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది. ఐఏఎస్, ఐపీఎస్, ఏఎఫ్ఎస్ అధికారుల బదిలీలు చేపట్టొద్దని, తప్పనిసరైతే అనుమతి కోరాలంది. పాలక మండళ్లు మనుగడలో ఉన్నచోట్ల జిల్లా, మండల, మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసుకోవచ్చు.

చెక్ పోస్టుల ఏర్పాట్లు

జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ, పోలీస్ శాఖలకు ఆదేశాలు జారీచేసింది. అవసరమైతే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులకు అదనంగా మరికొన్ని ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. ఒక వ్యక్తి రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని స్పష్టం చేసింది. అంతకంటే ఎక్కువ నగదు కలిగిఉంటే ఆధారాలు చూపించాలి. ఇక ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదుల కోసం ఒక సెల్‌ను ఏర్పాటు చేయనున్నారు.

అన్నీ కోడ్ కిందకే వస్తాయి

అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ అమలులోకి వచ్చాక ప్రభుత్వం సాధారణ పరిపాలనకే పరిమితం. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందుకు అది ముగిసే వరకు అసెంబ్లీ సమావేశం, మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఉండదు. తప్పని పరిస్థితి వస్తే అనుమతి తీసుకోవాలి.

- ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ రమాకాంత్‌రెడ్డి

మధ్య వేలుకు సిరా చుక్క

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఎడమ చేతి చూపుడు వేలుకు సిరాచుక్క పెట్టారు. అదింకా చెదిరిపోకపోవడంతో పంచాయతీ ఎన్నికల్లో ఎడమచేతి మధ్య వేలుకు సిరాచుక్క పెట్టనున్నారు.

రేపు అబ్జర్వర్లతో భేటీ

ఎన్నికల సంఘం అబ్జర్వర్లుగా ఎంపిక చేసిన 26 మంది ఐఏఎస్ అధికారులతో కమిషనర్ వీ.నాగిరెడ్డి శుక్రవారం సమావేశం కానున్నారు.

ఇట్లైతే నడువదు.. స్పీడ్ పెంచాలె

కాళేశ్వరం పనులు వేగంగా పూర్తి చేయాలి • అధికారులు, కాంట్రాక్టర్లకు కేసీఆర్ ఆదేశం

హైదరాబాద్/జయశంకర్ భూపాలపల్లి/ పెద్దపల్లి/మంథని, వెలుగు:

- మార్చి నెలాఖరులోగా పనులన్నీ పూర్తి చేయాలి
- కార్మికుల సంఖ్య పెంచి, మూడు షిప్టులు కొనసాగించండి
- సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, పంపుహౌస్‌లు, గ్రావిటీ కెనాల్ పరిశీలన
- సరిపోని టైం.. రాంపూర్ పంపుహౌస్ చూడకుండానే వెనక్కి

‘కోటి ఎకరాలకు నీళ్లివ్వాలన్నది ప్రభుత్వ సంకల్పం. ప్రజల ఆశ కూడా అదే. మీరు ఇట్లా పనిచేస్తే వాళ్ల పొలాలకు నీళ్లు ఎప్పుడు అందుతాయి. స్పీడ్ నాలుగింతలు పెంచాలె. జూన్ నాటికి మిడ్ మానేరుకు నీటిని ఎత్తిపోయాలె. అంటే మార్చి నెలాఖరుకు పనులన్నీ పూర్తి చెయ్యాలె. లక్ష్యం చేరుకోవడానికి ఏం చేస్తారో చెయ్యండి..’ అని నీటి పారుదలశాఖ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను సీఎం కేసీఆర్ ఆదేశించారు. అలసత్వాన్ని ఏ మాత్రం సహించబోమన్నారు. అన్నారం బ్యారేజీ పనులు బాగా జరుగుతున్నాయని అభినందించారు. ప్రాజెక్టుల పర్యటనలో ఉన్న సీఎం కేసీఆర్ బుధవారం భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల పరిధిలో బ్యారేజీలు, కాల్వలు, పంపుహౌజ్‌ల పనులను పరిశీలించారు.

వేగం పెంచండి

మంగళవారం రాత్రి కరీంనగర్‌లో బస చేసిన కేసీఆర్.. బుధవారం ఉదయం హెలికాప్టర్ ద్వారా భూపాలపల్లి జిల్లా కన్నెపల్లికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో కలసి ప్రత్యేక వాహనంలో బయలుదేరారు. 13.2 కిలోమీటర్ల మేర గ్రావిటీ కెనాల్ పనులను పరిశీలించారు. నాలుగు చోట్ల ఆగి పనులను చూశారు. అయితే గ్రావిటీ కెనాల్ పనులు మెల్లగా జరుగుతుండటంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువ తవ్వి గట్టున పోసిన మట్టి వర్షాలకు మళ్లీ కాలువలోకే జారుతుందని.. అలా కాకుండా మట్టిని తీసేయాలని, కాంక్రీట్‌తో లైనింగ్ పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. కార్మికుల సంఖ్యను పెంచి మూడు షిఫ్టులతో పనులు కొనసాగించాలని ఆదేశించారు. తర్వాత అన్నారం బ్యారేజీ వద్దకు వెళ్లి పరిశీలించారు. నిర్మాణ పనులు దాదాపుగా పూర్తికావడంపై ఇంజనీర్లు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఈ బ్యారేజీ కింద ముంపుకు గురైన దామెరకుంట రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

సమాంతరంగా పనులు..

అన్నారం బ్యారేజీ తర్వాత పెద్దపల్లి జిల్లాకు వెళ్లిన సీఎం కేసీఆర్ సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంపుహౌజ్, గ్రావిటీ కెనాల్, గోలివాడ పంపుహౌజ్‌ల పనులను పరిశీలించారు. తొలుత హెలికాప్టర్ ద్వారా ఈ పనులన్నింటినీ ఏరియల్ సర్వే చేశారు. తర్వాత సుందిళ్ల బ్యారేజీ సమీపంలో ఏర్పాటు చేసిన వ్యూపాయింట్ వద్ద ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా అధికారులు సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంపు హౌజ్‌ల పనుల పురోగతిని సీఎంకు వివరించారు. సుందిళ్ల బ్యారేజీకి 74 గేట్లు అమర్చడం జరిగిందని, 17 కిలోమీటర్ల మేర ఫ్లడ్ బ్యాంక్ పనులు వేగంగా జరుగుతున్నాయని, పనులన్నీ జనవరి చివరి నాటికి పూర్తవుతాయని తెలిపారు. అయితే సుందిళ్ల బ్యారేజీ పనులు ఇలాగే కొనసాగిస్తే ఇప్పట్లో పూర్తి చేయడం కష్టమేనని కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్యారేజీ, కరకట్టలు, రివిట్‌మెంట్ పనులను వేగిరం చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ తొలివారం నాటికి వెట్ రన్‌కు సిద్ధం చేయాలన్నారు. మార్చి 31నాటికి అన్ని రకాల పనులు పూర్తికావాలని ఆదేశించారు. తర్వాత కేసీఆర్ గోలివాడ పంపుహౌజ్‌ను పరిశీలించారు.

ఎస్సారెస్పీ పనులనూ..

ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకంలో భాగంగా జగిత్యాల జిల్లా రాజేశ్వర్‌రావుపేటలో నిర్మిస్తున్న మొదటి, రెండు పంపుహౌస్ పనులను కేసీఆర్ పరిశీలించారు. మోటార్ల బిగింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. మూడో పంపుహౌస్ పనులను ఆపేసి, అక్కడ వినియోగిస్తున్న మిషనరీ, కార్మికులను మొదటి పంపుహౌస్ వద్దకు తరలించాలని సూచించారు. తర్వాత సీఎం కేసీఆర్ మల్యాల మండలం రాంపూర్‌లో నిర్మిస్తున్న పంపుహౌస్ పనులను కూడా సందర్శించాల్సి ఉంది. కానీ సమయం సరిపోకపోవడంతో హైదరాబాద్‌కు బయలుదేరారు. మరో విడతలో ఆ పనులను పరిశీలిస్తామన్నారు. ఈ పర్యటనలో సీఎం కేసీఆర్ వెంట రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జి.వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్‌రావు, దాసరి మనోహర్‌రెడ్డి, సీఎస్ ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, సీఎంవో సెక్రటరీ స్మితా సబర్వాల్, నీటి పారుదల, విద్యుత్ శాఖల అధికారులు, ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరం టూరిజం హబ్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం టూరిజం హబ్‌గా రూపొందుతుందని సీఎం కేసీఆర్ చెప్పారు. కాళేశ్వర ముక్తీశ్వరాలయం, దట్టమైన అటవీ ప్రాంతానికి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తారన్నారు. తద్వారా ఈ ప్రాంత ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ఇక్కడ పర్యాటకుల కోసం టూరిజం శాఖ ఆధ్వర్యంలో 5 నుంచి 10 ఎకరాల్లో హోటళ్లు నిర్మించేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ ప్రాంతానికి రోడ్లు, ప్రాజెక్టు జలాశయాల్లో ఎలక్ట్రిక్ బోటింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు.

ఈ నెల 31నుంచి ఎంసీపీఐ రాష్ట్ర మహాసభలు

హైదరాబాద్, వెలుగు: కామారెడ్డి జిల్లా కేంద్రంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఎంసీపీఐ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్ తెలిపారు. ఈ నెల 6 నుంచి 8 వరకు జరగాల్సిన సభలు పంచాయతీ ఎన్నికల కారణంగా వాయిదా వేసినట్లు చెప్పారు.

25న పోలింగ్ వాయిదా వేయండి

- ఎన్నికల కమిషనర్‌కు ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

హైదరాబాద్, వెలుగు: జనవరి 25న జరగనున్న పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్‌ను వాయిదా వేయాలని ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశాయి. ఈమేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డికి.. టీటీయూ, పీఆర్‌టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లేఖను అందజేశారు. పోలింగ్ మరుసటి రోజు జనవరి 26న గణతంత్ర దినోత్సవం ఉన్నందున ఎన్నికల విధుల్లో పాల్గొన్న టీచర్లు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని లేఖలో పేర్కొన్నారు.

ప్రజల కోసమే భరిస్తున్నా: చంద్రబాబు

- ప్రధాని మోడీ వ్యాఖ్యలపైనా ఫైర్

కుప్పం, వెలుగు: తెలంగాణ సీఎం కేసీఆర్ తన గురించి ఇష్టం వచ్చినట్టు అసభ్యంగా మాట్లాడారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. బుధవారం ఏపీలోని చిత్తూరు జిల్లా కుప్పంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తన వద్ద మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇష్టానుసారంగా మాట్లాడినా తాను ప్రజల కోసమే భరిస్తున్నానని కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. తెలంగాణలో కూటమి ఓడిపోవడంతో తాను ఆక్రోశంతో ఉన్నానని, దేశంలో పెట్టే కూటమి కూడా సక్సెస్ కాదని మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు ఫైర్ అయ్యారు. ఏపీపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరుపట్ల తనకు కోపం, ఆవేశం, బాధ ఉన్నది నిజమేనని.. తన కోపానికి ప్రధాన కారణం మోదీ ప్రభుత్వం ఏపీ ప్రజలను నమ్మించి మోసం చేయడమేనన్నారు.

ఊళ్లలో ఎలక్షన్ ఫీవర్

- పంచాయతీ ఎన్నికల్లో పోటీపై గ్రామాల్లో మొదలైన చర్చలు
- కుల సంఘాలు, పెద్దలతో చర్చలు జరుపుతున్న సర్పంచ్ ఆశావాహులు
- ప్రచారం షురూ.. నామినేషన్లకు ఏర్పాట్లు
- పలుచోట్ల ఏకగ్రీవాలు ప్రారంభం
- వేలంపాటలపై ఎన్నికల సంఘం నజర్

హైదరాబాద్, వెలుగు: పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో గ్రామాల్లో కోలాహలం మొదలైంది. సర్పంచు, వార్డు సభ్యులుగా ఎవరు పోటీ చేస్తున్నారన్నదానిపై చర్చలు గరం గరంగా నడుస్తున్నాయి. నామినేషన్ల ప్రారంభానికి మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉండటంతో.. తొలిదశ ఎన్నికలు జరిగే పంచాయతీలు మరింత వేడెక్కాయి. చాలా మంది సర్పంచు, వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. తమ స్నేహితులను, తెలిసినవారిని కలుస్తున్నారు. కుల సంఘాల పెద్దలను కలిసి మద్దతు కోరుతున్నారు. సోషల్ మీడియాలోనూ ప్రచారం కూడా మొదలుపెట్టారు. ప్రతి గ్రామంలో ఆ ఊరి పేరుతో ఉన్న వాట్సాప్ ఖాతాలు, ఫేస్‌బుక్ పేజీల్లో పోస్టులు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,732 పంచాయతీలు ఉండగా.. మూడు దశల్లో ఈనెల 21, 25, 30వ తేదీల్లో పోలింగ్ జరగనుంది. మొదటి దశ నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 7 నుంచి మొదలవుతోంది.

ఏకగ్రీవాలు షురూ..

రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల కిందే 4,430 కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. 500 లోపు జనాభా ఉన్న తండాలు కూడా పంచాయతీలుగా మారాయి. అలాంటి వాటిలో కొన్ని చోట్ల 300 మందికంటే తక్కువగా ఓటర్లు ఉన్నారు. ఇలాంటివాటితోపాటు చిన్న పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏకగ్రీవమైన పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ప్రోత్సాహకంగా అందిస్తుండటంతో.. గ్రామంలో రోడ్లు, నీటి వసతి, ఇతర సమస్యల పరిష్కారానికి పనికొస్తాయని భావిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజే నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలం సల్పబండ తండాలో సర్పంచ్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారు. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన ధరావత్ సర్మన్ నాయక్‌ను సర్పంచ్‌గా, వడ్డెర కాలనీకి చెందిన వ్యక్తిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుందామని తీర్మానం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ రిటర్నింగ్ ఆఫీసర్‌ను కలిసి ఆ తీర్మానాన్ని అందజేయనున్నారు. ఈ పంచాయతీలో మొత్తం 644 మంది జనాభా ఉండగా 298 మంది ఓటర్లు ఉన్నారు.

ఏకగ్రీవాలపై టీఆర్ఎస్ నేతల దృష్టి!

కొత్త గ్రామ పంచాయతీలతోపాటు పాత వాటిలోనూ ఏకగ్రీవంగా సర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకునేలా ప్రోత్సహించేందుకు అధికార టీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. రాష్ట్ర అభివృద్ధికి సీఎం కేసీఆర్ చేస్తున్న కృషిని వివరిస్తూ.. గ్రామస్తుల మద్దతు కూడగట్టాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పంచాయతీల్లో ఓటర్లు 200 నుంచి 500 లోపే ఉండటంతో ఏకగ్రీవాలు సులువవుతాయని భావిస్తున్నారు.

డబ్బుల ప్రభావంపై ఎన్నికల సంఘం నిఘా

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా పెద్దఎత్తున వేలం పాటలు జరిగినట్టు ఆరోపణలున్నాయి. సర్పంచ్ ఆశావహుల మధ్య వేలం నిర్వహించి, వారు పాడిన సొమ్ము మొత్తాన్ని గ్రామాభివృద్ధికి ఖర్చు చేద్దామనే ఒప్పందాలు జరిగాయి. ఈసారి అలాంటి వేలం పాటలు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి స్పష్టం చేశారు. అలా జరిగే ఏకగ్రీవాలను రద్దు చేస్తామని హెచ్చరించారు.

లక్ష్మీపూర్ పంచాయతీ ఏకగ్రీవం

సర్పంచ్‌గా లకావత్ మంజుల ఎన్నిక



సర్పంచ్, ఉపసర్పంచ్‌లుగా ఎన్నికైన మంజుల, రమేశ్‌లతో గ్రామస్తులు

రాజన్న సిరిసిల్ల, వెలుగు: పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత రోజే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఓ గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. గంభీరావుపేట మండలంలోని లక్ష్మీపూర్ తండా పంచాయతీ కొత్త పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కొత్తగా ఏర్పడిన ఈ పంచాయతీ సర్పంచ్ పదవిని ఎస్టీ మహిళకు రిజర్వు చేశారు. దీంతో బుధవారం గ్రామస్తులు సమావేశమై లకావత్ మంజులను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఉప సర్పంచ్‌గా భూక్యా రమేశ్, వార్డు సభ్యులుగా బానోత్ సరిత, తెజావత్ వనిత, లకావత్ రాజ్యానాయక్, భూక్యా లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ మేరకు గ్రామస్తులంతా తీర్మానం చేశారు. పంచాయతీని ఏకగ్రీవంగా ప్రకటించి పారితోషికం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో తొలి ఏకగ్రీవ పంచాయతీగా లక్ష్మీపూర్ రికార్డు సాధించబోతోంది.



జేవీ కార్టూన్‌‌కు ఇంటర్నేషనల్ ప్రైజ్

బీజింగ్: క్యారికేచర్ ఆఫ్ లూజిన్‌‌యు ఎగ్జిబిషన్ పేరుతో చైనా నిర్వహించిన క్యారికేచర్ పోటీలో వెలుగు ఆర్టిస్ట్ జక్కుల వెంకటేశ్ (జేవీ)కు ఎక్సలెంట్ కేటగిరీలో బహుమతి దక్కింది. మూడు కేటగిరీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో అంతర్జాతీయ కార్టూనిస్టులు, ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఎక్సలెంట్ ప్రైజ్, ఆర్ట్ ప్రైజ్, సెలక్టెడ్ ప్రైజ్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా జేవీకి టాప్ కేటగిరీలో 'ఎక్సలెంట్ ప్రైజ్' లభించింది.

టెన్త్ స్టూడెంట్స్‌‌కు స్నాక్స్ ఇవ్వండి

హైదరాబాద్, వెలుగు: పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్, పాలు ఇవ్వాలని తెలంగాణ తల్లిదండ్రుల సంఘం(టీపీఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్‌‌కుమార్‌‌ను సంఘం ప్రతినిధులు బుధవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఇటీవల 'వెలుగు'లో ప్రచురితమైన 'సార్ ఆకలైతాంది'కథనాన్ని కూడా అందులో పొందుపర్చారు. టీపీఏ అధ్యక్ష, కార్యదర్శులు నాగటి నారాయణ, పగడాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో రెండు లక్షల మందికిపైగా టెన్త్ విద్యార్థులు చదువుతున్నారని, ఉదయం 8 గంటలకు ప్రత్యేక తరగతులు ఉండటంతో గంట ముందే ఇంటి నుంచి బయలుదేరుతున్నారని, సాయంత్రం గంట ఆలస్యంగా ఇంటికి వెళ్తున్నారని, ఆకలితో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారని వివరించారు. వారికి ఉదయం, సాయంత్రం స్నాక్స్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

అన్నాడీఎంకే ఎంపీల సస్పెన్షన్

న్యూఢిల్లీ: లోక్‌‌సభలో గందరగోళం సృష్టించిన అన్నాడీఎంకే ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. సభలో బుధవారం రాఫెల్‌‌పై చర్చ జరుగుతున్నపుడు అన్నాడీఎంకే సభ్యులు స్పీకర్ పోడియంలోకి దూసుకెళ్లి ఆందోళన చేశారు. కావేరీ జలాలపై న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో 24 మంది ఎంపీలను 5 రోజులు స్పీకర్ సస్పెండ్ చేశారు.

'కామన్ చట్టం' కష్టమే!

- వర్సిటీల మధ్య చాలా తేడాలు
- సర్కారుకు నివేదిక ఇచ్చిన టీఎస్‌‌సీహెచ్‌‌ఈ
- 3 కేటగిరీలుగా వర్సిటీల విభజన
- వేర్వేరు చట్టాలు చేయాలని సూచన

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో కామన్ యూనివర్సిటీ చట్టం కష్టంగా మారింది. అనేక అంశాల్లో యూనివర్సిటీ మధ్య తేడాలుండడంతో ఆ ఆలోచనకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. ఒకవేళ తప్పనిసరై తీసుకొస్తే మూడు వేర్వేరు చట్టాలు తేవాల్సిన పరిస్థితి. ఇప్పటికే ప్రైవేటు యూనివర్సిటీ చట్టం తీసుకొచ్చిన నేపథ్యంలో, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న వర్సిటీలకూ ఒక ప్రత్యేక చట్టం తీసుకురావాలని సర్కారు యోచిస్తోంది. ప్రభుత్వ నిర్వహణలో 15 యూనివర్సిటీలున్నాయి. వీటిలో పరీక్షల విధానం, సిలబస్, ఫీజులు, ప్రొఫెసర్ల నియామకం, వేతనాలు.. ఇలా అన్నీ వేర్వేరుగానే జరుగుతున్నాయి. ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించే పీజీ సెట్ రాస్తే, ఓయూతోపాటు తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ వర్సిటీల్లో ప్రవేశాలకు అర్హులవుతారు. కాకతీయ యూనివర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్‌‌కు కేయూతోపాటు శాతవాహన యూనివర్సిటీలో ప్రవేశాలు పొందొచ్చు. ఇలా అన్ని అంశాలు వేర్వేరుగా ఉండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని వర్సిటీలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు సర్కారు ప్రయత్నాలు ప్రారంభించింది. తద్వారా ఒకే పరీక్ష, ఒకే సిలబస్ తీసుకురావొచ్చని భావించింది. దీనిపై ఉన్నత విద్యామండలి (టీఎస్‌‌సీహెచ్‌‌ఈ) నుంచి నివేదిక కోరింది. అయితే దీనిపై అధ్యయనం చేసిన టీఎస్‌‌సీహెచ్‌‌ఈ.. వర్సిటీలను మూడు భాగాలు విభజించి సర్కారుకు నివేదిక ఇచ్చింది. ఇన్‌‌డైరెక్ట్‌‌గా కామన్ యూనివర్సిటీల చట్టం సాధ్యం కాదని తేల్చిచెప్పింది.

మూడు కేటగిరీలుగా వర్సిటీలు

వర్సిటీలను 3 కేటగిరీలుగా టీఎస్‌‌సీహెచ్‌‌ఈ విభజించింది. మొదటి కేటగిరిలో ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహనలతోపాటు తెలుగు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలున్నాయి. రెండో కేటగిరిలో అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్ వర్సిటీలతోపాటు కాళోజీ హెల్త్ వర్సిటీ ఉంది. మూడో కేటగిరిలో జేఎన్‌‌టీయూహెచ్, ఫైన్‌‌ఆర్ట్స్, ఆర్‌‌జీయూకేటీ (బాసర) యూనివర్సిటీలను పొందుపర్చారు. ఒక్కో వర్సిటీకి ఒక్కో విధానం ఉండటంతో కామన్ వర్సిటీ చట్టం కష్టమని, తప్పనిసరై తీసుకొస్తే మూడు చట్టాలను వేర్వేరుగా చేయాలని నివేదికలో పొందుపరిచినట్టు తెలుస్తోంది. అయితే దీనిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. విద్యాశాఖ మంత్రి నిర్ణయమయ్యాక దీనిపై తుది నిర్ణయం తీసుకునే వీలుంది.

వర్సిటీల పరిశీలనకు కమిటీ

యూనివర్సిటీ వైస్‌‌చాన్స్‌‌లర్ల సమావేశంలో గవర్నర్ ఆదేశాల అమలు తీరును పరిశీలించేందుకు ఉన్నత విద్యామండలి (టీఎస్‌‌సీహెచ్‌‌ఈ) ప్రత్యేకంగా కమిటీ వేసింది. టీఎస్‌‌సీహెచ్‌‌ఈ వైస్ చైర్మన్లు లింబాద్రి, వెంకటరమణతోపాటు కౌన్సిల్ సభ్యులు శ్యామల,శివరాజు, నర్సింహారెడ్డిలతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసింది. 2018 ఆగస్టు 8న వీసీలతో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహాన్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో వర్సిటీల పనితీరుపై సమీక్షించి, పది అంశాల్లో మార్పులు రావాలని ఆదేశించారు. యూనివర్సిటీల్లో ఫిర్యాదుల విభాగం, మహిళా హాస్టళ్లలో సమస్యల పరిష్కారం, సోషల్ సర్వీస్ ప్రోగ్రామ్స్, కొత్త కోర్సులు, పీహెచ్‌‌డీ అడ్మిషన్లు, బయోమెట్రిక్, సీసీకెమెరాలు, ఫాక్యల్టీ రీసెర్చ్, పబ్లికేషన్స్, ఇన్నోవేషన్స్‌‌పై ప్రత్యేకంగా యూనివర్సిటీలు దృష్టిసారించాలని సూచించారు. మెడికల్ సీట్లలో అక్రమాలను నియంత్రించాలన్నారు. ఆయా అంశాల్లో వర్సిటీల పనితీరుపై ఉన్నత విద్యామండలి యూనివర్సిటీ వారీగా సమీక్షలు నిర్వహించనున్నది. సంక్రాంతి తర్వాత ఐదుగురు సభ్యులతో కూడిన బృందం యూనివర్సిటీలను సందర్శించనుంది.

ఇప్పుడు జోక్యం చేసుకోలేం

ఉమ్మడి హైకోర్టు విభజనపై సుప్రీంకోర్టు



- రెండు హైకోర్టుల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి
- ఇప్పుడు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, వెలుగు: ఉమ్మడి హైకోర్టు విభజన ప్రక్రియను వాయిదా వేయాలంటూ ఏపీ న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ విషయంలో ఇప్పుడు జోక్యం చేసుకోలేమంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. ఏపీ హైకోర్టులో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేనందున ఉమ్మడి హైకోర్టు విభజనకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ అమలు ప్రక్రియను వాయిదా వేయాలంటూ ఏపీ న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు సీతారాం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ అబ్దుల్ నజీర్‌‌తో కూడిన ధర్మాసనం బుధవారం దీనిని విచారించింది. పిటిషనర్ల తరుపున సీనియర్ న్యాయవాది ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. ఏపీ హైకోర్టు భవనాలు, వసతుల కల్పన డిసెంబర్ 15 నాటికి పూర్తి చేస్తామంటూ ఏపీ ప్రభుత్వం కోర్టులో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసిందని, ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించలేదని చెప్పారు. జస్టిస్ ఏకే సిక్రి జోక్యం చేసుకుని.. ఉమ్మడి హైకోర్టు విభజన అంశం చాలా కాలంగా పెండింగ్‌‌లో ఉందని, ఇప్పటికే రెండు రాష్ట్రాల హైకోర్టుల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, ఈ సమయంలో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. ఆరంభంలో చిన్న చిన్న సమస్యలు సాధారణంగానే ఉంటాయన్న న్యాయమూర్తి కేసును విచారించేందుకు తిరస్కరించారు. దీంతో పిటిషన్‌‌ను ఉపసంహరించుకుంటామని పిటిషనర్లు కోరగా న్యాయస్థానం దానికి అనుమతించింది.



బుధవారం హైదరాబాద్ జలవిహార్‌‌లో జరిగిన సనత్‌‌నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్, తలసాని తదితరులు

కేసీఆర్ ఏది చేసినా కొత్త చరిత్రే

కార్యకర్తల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- 16 ఎంపీ స్థానాల గెలుపే లక్ష్యం
- ఎక్కువ ఎంపీలుంటే కేంద్రం మెడలు వంచొచ్చు
- ఓట్ల గల్లంతుతో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మెజారిటీ తగ్గింది
- పార్టీ బలోపేతమే లక్ష్యమని వెల్లడి

హైదరాబాద్, వెలుగు: లోక్‌‌సభ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పునరావృతం అయ్యేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 16 లోక్‌‌సభ సీట్లను టీఆర్ఎస్ గెలుచుకుంటే.. కేంద్రాన్ని శాసించే స్థితికి చేరుకుంటామని చెప్పారు. కేంద్రం మెడలు వంచడానికి ఇదే చక్కటి అవకాశమన్నారు. బుధవారం హైదరాబాద్‌‌లోని జలవిహార్‌‌లో సనత్‌‌నగర్ నియోజకవర్గ టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అందులో కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ కథ ముగిసిందని, బీజేపీ వంద సీట్లలో డిపాజిట్లు కోల్పోగా, కాంగ్రెస్ మళ్లీ విశ్వాసం పొందే పరిస్థితి లేకుండా పోయిందని చెప్పారు. ఓట్ల గల్లంతుతో చాలా చోట్ల టీఆర్ఎస్‌‌కు మెజారిటీ తగ్గిందని, సనత్‌‌నగర్ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాసయాదవ్‌‌కు 75 వేల ఓట్ల మెజారిటీ రావాల్సి ఉండగా, ఓట్ల గల్లంతుతో ఆ సంఖ్య తగ్గిందని పేర్కొన్నారు.

మనమే ఆదర్శం

ఈ రోజు తెలంగాణ ఏది ఆలోచిస్తే రేపు దేశం అది ఆలోచించే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. ఇటీవలే మూడు రాష్ట్రాలు రైతు బంధు పథకాన్ని ప్రారంభించాయని.. ప్రధాని మోడీ కూడా ఏదో పేరుతో రైతు బంధు తరహా కార్యక్రమాన్ని అమలు చేస్తారంటూ వార్తలు వస్తున్నాయని చెప్పారు. దీనిపై సంతోషిస్తున్నామన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడమే ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు.

అరుదైన నాయకుడు కేసీఆర్

గతంలో ముందస్తు ఎన్నికలకు పోయిన వారికి చేదు అనుభవాలు ఎదురయ్యాయని, ప్రజల్లో ఉన్న ఆలోచనలను పసిగట్టలేకపోవడం వల్లే అలాంటి ఫలితాలు వచ్చాయని కేటీఆర్ అన్నారు. కానీ కేసీఆర్ ఏదీ చేసినా కొత్త చరిత్రేనని చెప్పారు. అసెంబ్లీ రద్దు, కొన్ని గంటల వ్యవధిలోనే 105 మంది అభ్యర్థులను ప్రకటించి సంచలనం సృష్టించారని పేర్కొన్నారు. పార్టీ పెట్టి రాష్ట్రాన్ని సాధించిన అరుదైన నాయకుడు కేసీఆర్ అని, రెండోసారి టీఆర్ఎస్ సాధించిన విజయం దేశంలోనే ఓ రికార్డుగా నమోదైందని తెలిపారు. చంద్రబాబు సహా అగ్రనేతలంతా కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఫలితం లేకపోయిందని గుర్తు చేశారు. గతం కంటే టీఆర్ఎస్‌‌కు 14 శాతం ఓట్లు పెరిగాయని, అసెంబ్లీలో 75 శాతం సీట్లు సాధించామని వివరించారు. ఇంత పెద్ద విజయం సాధించామన్న అహంకారం పనికి రాదని కేసీఆర్ ముందే సూచించారని, ఆ మాటను తాము జవదాటబోమని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్‌‌లో మొత్తం 29 అసెంబ్లీ సీట్లుంటే మజ్లిస్‌‌తో కలిపి 25 సీట్లు గెలిచామని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల లాంటి ఫలితాలు అసెంబ్లీ ఎన్నికల్లో పునరావృతం అయ్యాయన్నారు. ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా పనిచేస్తామని తెలిపారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. మొన్నటి ఎన్నికల్లో పార్టీకి దూరమైన వారిని మళ్లీ దగ్గరికి తెచ్చుకుందామన్నారు. సమావేశంలో టీఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌‌సభ ఇన్‌‌చార్జి బండి రమేశ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే బాల్క సుమన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలగించిన ఓట్లపై ఏం చేస్తున్నరు?

వివరణ ఇవ్వాలని ఈసీకి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, వెలుగు: తొలగించిన ఓట్లను జాబితాలో చేర్చేందుకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అభ్యంతరాలు తీసుకోకుండా తీసేసిన ఓట్ల విషయంలో ఏం చేయబోతున్నారని ప్రశ్నించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ కేశవరావుల డివిజన్ బెంచ్ ఈసీకి నోటీసులిచ్చింది. సమాచారం ఇవ్వకుండా తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చాలని కోరేలా ఓటర్లు అవకాశమివ్వాలని, ఇందుకు ప్రత్యేక దరఖాస్తులుండేలా ఈసీకి ఆదేశాలివ్వాలని కోరుతూ హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ప్రతీ అగర్వాల్ సహా 26 మంది దాఖలు చేసిన వ్యాజ్యాన్ని కోర్టు బుధవారం విచారించింది. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా నుంచి ఎంతో మంది పేర్లు తొలగించారని, ఈసీ నిర్ణయం వల్ల పిటిషనర్ల ఓట్లూ జాబితాలో లేకుండా పోయాయని వారి తరపు లాయర్ వాదించారు. తదుపరి విచారణను కోర్టు 22కు వాయిదా వేసింది.




బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న బీసీ సంఘాల నేతలు

బీసీ రిజర్వేషన్లను అన్యాయంగా కుదించారు

- 34% కోటా కొనసాగించాలి.. వర్గీకరణ చేపట్టాలి
- జనగణనపై కోర్టు తీర్పు ఎందుకు అమలు చేయడం లేదు
- ఇందిరా పార్కు వద్ద నిరాహార దీక్షలో బీసీ సంఘాల నేతలు

హైదరాబాద్, వెలుగు: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మూడు దశాబ్దాలుగా 34 శాతం అమలవుతున్న బీసీ రిజర్వేషన్లను సీఎం కేసీఆర్ అన్యాయంగా 23 శాతానికి కుదించారని బీసీ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి, ఎంబీసీ సంఘం, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌‌రావు మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ రంగాల్లో దేశవ్యాప్తంగా బీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమలవుతుండగా ప్రభుత్వం స్థానిక సంస్థల్లో దాన్ని తగ్గించడం దారుణమన్నారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో తెలంగాణలోనే అత్యధికంగా బీసీలు 52 శాతం ఉన్నారని, జనాభా ప్రాతిపదికన 52 శాతం అమలు కావాల్సిన రిజర్వేషన్లను ప్రభుత్వం కోర్టు కేసులంటూ అన్యాయంగా కుదించిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తన తీర్పులో బీసీ సామాజిక, ఆర్థిక గణన చేపట్టాలని సూచించిందని, సుప్రీం తీర్పులోని బీసీ జనగణనను అమలు చేయకుండా అమానుషంగా రిజర్వేషన్లను తగ్గించారని విమర్శించారు. సమగ్ర కుటుంబ సర్వే చేసినా వాటి వివరాలు కోర్టుకు సమర్పించలేదని, కొత్తగా గణన చేపట్టలేదన్నారు. సర్కారు అసమర్థత వల్లే బీసీలు 12 శాతం రిజర్వేషన్లు కోల్పోయారన్నారు. బీసీలను ఏ, బీ, సీ, డీ, ఈలుగా విభజించాలని కోర్టు సూచించినా ఇప్పటికీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 34 శాతం రిజర్వేషన్లను కొనసాగించాలని, వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్‌‌ప్లాన్ నేత గోపాల్, ఎంబీసీ నేత పైళ్ల ఆశయ్య, గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు ఉడుత రవీందర్, బీసీ సంక్షేమ సంఘం నేత మేకపోతుల నరేందర్‌‌గౌడ్, రజక వృత్తిదారుల సంఘం నేత నాగరాజు తదితరులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు.



తిరస్కరిస్తే ఎందుకు చెప్పలేదు?

ప్రభాస్ 'భూమి' కేసుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్, వెలుగు: హీరో ప్రభాస్ భూమి క్రమబద్ధీకరణ దరఖాస్తును అధికారులు తిరస్కరిస్తే ఆ విషయం ఆయనకు లిఖితపూర్వకంగా ఎందుకు చెప్పలేదని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలివ్వాలని అధికారులను న్యాయమూర్తులు జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ కేశవరావుల డివిజన్ బెంచ్ ఆదేశించింది. విచారణ గురువారానికి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం పన్మక్తలోని భూమి ప్రభుత్వానిదంటూ అక్కడున్న తన నిర్మాణాన్ని సీజ్ చేయడం అన్యాయమని ప్రభాస్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని బెంచ్ విచారించింది. ప్రభాస్ క్రమబద్ధీకరణ దరఖాస్తును తిరస్కరించామని ప్రభుత్వ లాయర్ చెప్పగా ఆ సమాచారం తమకు తెలియదని ప్రభాస్ తరఫు లాయర్ తెలిపారు.



'సాకర్' పోప్

క్యూబా సర్కస్ సభ్యుడు అందించిన సాకర్ బాల్‌‌ను ప్రొఫెషనల్ ఆటగాడిలా వేళ్లపై తిప్పుతున్న పోప్ ఫ్రాన్సిస్.. బుధవారం వాటికన్‌‌సిటీలోని పోప్‌‌పాల్4 హాల్‌‌లో కనిపించిందీ దృశ్యం


కరెంట్ ప్రమాదాలకు 'ఓల్ట్ డిటెక్టర్'తో చెక్

హైదరాబాద్, వెలుగు:

చాలా చోట్ల విద్యుత్ సరఫరా వ్యవస్థ గజిబిజిగా ఉంటుంది. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో చిక్కులు, చిక్కులుగా వైర్లు కనబడుతుంటాయి. ఇక మెయిన్ లైన్లలో అయితే ఏ సబ్‌‌స్టేషన్/ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది, ఎన్ని వైపుల నుంచి విద్యుత్ వస్తుందన్నది తెలియక లైన్‌‌మన్లు, హెల్పర్లు ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. కొన్నిసార్లు వారి ప్రాణాలకూ హాని కలుగుతోంది. ఇలాంటి పరిస్థితిని నివారించే 'ఓల్ట్ డిటెక్టర్'లు అందుబాటులో ఉన్నా వాటిపై కార్మికులకు అవగాహన లేకపోవడం గమనార్హం. నేరుగా తీగలను, విద్యుత్ సరఫరా వ్యవస్థలను తాకాల్సిన అవసరం లేకుండా.. కొంత దూరం నుంచే వాటిల్లో కరెంటు సరఫరా ఉన్నదీ, లేనిదీ ఈ పరికరాలతో తెలుసుకోవచ్చు. మెయిన్ లైన్లలోనే కాదు ఇళ్లలోనూ వినియోగించుకునే 'ఓల్ట్ డిటెక్టర్లు' కూడా అందుబాటులో ఉన్నాయి.

కార్మికులకు ఇబ్బందులు

ఏ సబ్‌‌స్టేషన్ నుంచి ఏ ఫీడర్‌‌కు విద్యుత్ సరఫరా అవుతుంది, ఏ లైను ఎక్కడి నుంచి వస్తుంది, ఏ ట్రాన్స్‌‌ఫార్మర్ నుంచి ఏ పోల్‌‌కు విద్యుత్ సరఫరా అవుతుందన్నది తెలుసుకోవడం విద్యుత్ కార్మికులకు కష్టంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థపై పూర్తి అవగాహన లేక, ఒక లైనులో ఎల్సీ (విద్యుత్ సరఫరా ఆపేసి లైన్ క్లియర్ తీసుకోవడం) తీసుకుని, మరో లైన్‌‌లో తీసుకోకుండా ఉంటున్నారు. దాంతో స్తంభం ఎక్కిన తర్వాత విద్యుత్ షాక్‌‌లకు గురవుతున్నారు. ఇలా హైదరాబాద్ డిస్కం పరిధిలో సుమారు 400 మందికిపైగా కార్మికులు మృతి చెందినట్టు అధికారిక లెక్కలే చెప్తున్నాయి.



స్తంభం ఎక్కే ముందే అలర్ట్

ఇప్పటి వరకు తీగలు, ప్లగ్‌‌లో కరెంటు ఉందో లేదో గుర్తించేందుకు టెస్టర్‌‌ను వాడుతున్నారు. ఆ టెస్టర్‌‌ను నేరుగా కనెక్షన్‌‌కు టచ్ చేయాల్సి వస్తుంది. అది కూడా 500 ఓల్ట్‌‌ల లోపు విద్యుత్ ప్రసరణను మాత్రమే గుర్తించవచ్చు. ఆపై ఓల్టేజ్ ఉంటే టెస్టర్ దెబ్బతిని, కరెంటు ఉందో లేదో గుర్తించలేని పరిస్థితి ఉంటుంది. అదే ఓల్ట్ డిటెక్టర్ తీగలు, విద్యుత్ పరికరాల్లో కరెంటు సరఫరాను దూరం నుంచే గుర్తించగలదు. ఇది కూడా చూడటానికి సాధారణ టెస్టర్‌‌లానే ఉంటుంది. విద్యుత్ సరఫరా ఉంటే ఇందులోని లైటు వెలుగుతుంది. 11 కేవీ ఫీడర్ వైరుకు మీటరు దూరం నుంచి, 33 కేవీ లైనుకు రెండు మీటర్ల దూరం నుంచి, 220 కేవీ వైర్లకు మూడు మీటర్ల దూరం నుంచే వాటిలోని కరెంటును గుర్తించగలదు. ఇళ్లలోని కరెంటు వైర్లు, స్విచ్ బోర్డుల వద్ద కూడా అర మీటరు వరకు దూరం నుంచే గుర్తిస్తుంది. కొత్తలైన్లు, మీటర్ల బిగింపు, ఇతర పనుల కోసం అత్యవసర పరిస్థితుల్లో స్తంభం ఎక్కే విద్యుత్ కార్మికులను ఈ పరికరం అలర్ట్ చేయగలదు.

ప్రమాదాలను నివారించొచ్చు

దూరం నుంచే కరెంటు సరఫరాను గుర్తించగలగడం 'ఓల్ట్ డిటెక్టర్' ప్రత్యేకత. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో కార్మికులు ఈ పరికరాన్ని వాడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్మికులందరికీ అందజేస్తే ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చు. సాధారణ వినియోగదారులకూ ఇది ప్రయోజనకరమే.

- రాజుమారాజు, విద్యుత్ రంగ నిపుణుడు

లోక్‌సభలో ఆధార్ సవరణ బిల్లు

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ఆధార్‌సవరణబిల్లును ప్రవేశపెట్టింది. మొబైల్‌నంబర్లు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ కార్డును స్వచ్ఛంధంగా లింక్‌చేసుకునే అంశానికి చట్టపరమైన మద్దతును కల్పించేందుకు దీన్ని ప్రవేశపెట్టినట్లు కేంద్రమంత్రి రవిశంకర్‌ప్రసాద్‌చెప్పారు. ప్రతి అంశానికి ఆధార్‌కార్డ్‌తప్పనిసరి కాదని సుప్రీం ఇచ్చిన తీర్పుకు లోబడే బిల్లులో సవరణలు చేశామని మంత్రి చెప్పారు. త్వరలో డేటా ప్రొటక్షన్ బిల్లును కూడా ప్రవేశపెడతామన్నారు. బిల్లులో చేసిన సవరణల వల్ల ఎవరి ప్రైవసీకి ఇబ్బందులు ఉండవని చెప్పారు. డైరెక్ట్ బెనిఫిట్‌ట్రాన్స్‌ఫర్స్ ద్వారా ఆధార్‌మనకు 90 వేల కోట్ల రూపాయల సేవింగ్స్‌తెచ్చిపెట్టిందని, వరల్డ్‌బ్యాంక్, ఐఎంఎఫ్‌ఆధార్‌ను మెచ్చుకున్నాయని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. ఈ బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లు సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘించేలా ఉందని ఆరోపించాయి. ముందు డేటా ప్రొటక్షన్‌లా బిల్లును చూపించాలని, ఆ తర్వాతే దీన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్‌చేశాయి. బిల్లును వెనక్కు తీసుకుని సవరణలు చేసిన తర్వాత ప్రవేశపెట్టాలన్నాయి.



123 కోట్ల మందికి ఆధార్ జారీ

రాజ్యసభలో కేంద్ర మంత్రి ఆహిర్

న్యూఢిల్లీ: దేశంలోని దాదాపు 123 కోట్ల మందికి ఆధార్ కార్డులు జారీ చేసినట్లు కేంద్ర మంత్రి హన్సరాజ్ ఆహిర్‌బుధవారం రాజ్యసభకు వెల్లడించారు. 2011 జనగణన ప్రకారం దేశ జనాభా 121,08,54,977 కాగా అప్పటి నుంచి గతేడాది వరకు 2,08,98,228 చిన్నారులు పుట్టారని మంత్రి చెప్పారు. 2018 నవంబర్30 నాటికి ఆధార్ అథారిటీ 122.90 కోట్ల కార్డులను జారీ చేసిందని అన్నారు. ఇందులో ఐదేళ్లలోపు చిన్నారుల సంఖ్య 6.71 కోట్లు, ఐదు నుంచి పద్దెనిమిదేళ్ల వయస్కులు 29.02 కోట్ల మంది ఉన్నారని వివరించారు. ఇక శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(ఎస్ఆర్ఎస్) తాజా నివేదిక ప్రకారం.. 2016లో దేశంలో బర్త్‌రేట్ 20.4గా ఉందని, మరణాల శాతం 6.4గా ఉందని మంత్రి ఆహిర్ చెప్పారు.







జేపీసీ వెయ్యాల్సిందే

రాఫెల్‌పై పట్టుబట్టిన కాంగ్రెస్ చీఫ్ ■ అవసరంలేదన్న కేంద్ర ప్రభుత్వం ■ లోక్ సభలో రాహుల్ వర్సెస్ జైట్లీ

న్యూఢిల్లీ :

రాఫెల్ డీల్ పై బుధవారం లోక్ సభ లో వాడివేడి చర్చ జరిగింది. అధికార, ప్రతిపక్ష సభ్యులు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) కోసం కాంగ్రెస్ చీఫ్ రాహుల్ పట్టుబట్టగా అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. వాయిదా అనంతరం రెండు గంటలకు సభ ప్రారంభమైన తర్వాత యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం పై కాంగ్రెస్ చీఫ్ రాహుల్ మాట్లాడారు. చర్చను ప్రారంభిస్తూ మోడీ సర్కార్ పై కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. ఒప్పందం పై జేపీసీ తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు కూడా రాఫెల్ ఒప్పందం విచారణ తమ పరిధిలోకి రాదని పేర్కొందే కానీ, జేపీసీ ఏర్పాటు వద్దని అనలేదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తనపై వ్యక్తిగతంగా చిన్న ఆరోపణ కూడా లేదని మంగళవారం ప్రధాని మోడీ చేసిన కామెంట్‌ను రాహుల్ తప్పుపట్టారు.

ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం లేని ప్రధాని

ఒప్పందం పై ప్రతిపక్షాల ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం ప్రధాని మోడీకి లేదని ఎగతాళి చేశారు. అందుకే ఎన్ని సార్లు, ఎన్ని విమర్శలు చేసినా మోడీ బదులివ్వడం లేదన్నారు. డీల్ పై తనను ఎవరూ ప్రశ్నించలేరని ప్రధాని చెప్పడం కరెక్ట్ కాదన్నారు. ఒప్పందం పై దేశ ప్రజలంతా ప్రశ్నిస్తున్నారని చెప్పారు.ఈసందర్భంగా మోడీకి ఆయన ఆరు కీలక ప్రశ్నలు వేశారు. వీటికి ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మిత్రులకు లాభం చేయడానికే పాత ఒప్పందాన్ని రద్దు చేసి, ప్రధాని మోడీ కొత్త ఒప్పందాన్ని చేసుకున్నారని ఆరోపించారు. 'హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్' సంస్థ ఉండగా, అనిల్ అంబానీ సంస్థకు ఎందుకు కాంట్రాక్ట్ ఇచ్చారని ప్రశ్నించారు. దీంతో అనిల్ అంబానీకి రూ.30 వేల కోట్ల లాభం జరిగిందని ఆరోపించారు. ఒప్పందంలోని లొసుగులను ప్రజల ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

విమానాలను 36కు ఎందుకు కుదించారు ?

రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు 126 విమానాలు కావాలని డిమాండ్ చేయగా వాటి సంఖ్యను 36కు ఎందుకు కుదించాల్సి వచ్చిందని మోడీని రాహుల్ ప్రశ్నించారు.అలాగే యుద్ధ విమానం కొత్త ధర రూ. 1,600 కోట్ల పై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసింది నిజం కాదా అని నిలదీశారు.

ఆడియో టేప్ కు 'నో' పర్మిషన్

యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన అన్ని ఫైళ్లు మాజీ రక్షణ మంత్రి మనోహర్ పారికర్ దగ్గర ఉన్నట్లు తమ వద్ద ఆడియో టేపు ఉందని, దానిని పార్లమెంటులో వినిపించడానికి అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ కోరారు. అయితే రాహుల్ విజ్ఞప్తిని స్పీకర్ సుమిత్రా మహాజన్ తోసిపుచ్చారు.ఈదశలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ జోక్యం చేసుకున్నారు. " అది బూటకపు ఆడియో టేప్ " అన్నారు. బీజేపీ సర్కార్ ను అప్రతిష్ఠ పాలు చేయడానికి కాంగ్రెస్ కావాలని కట్టుకథలు అల్లుతోందని మండిపడ్డారు. " ఆ ఆడియో టేపు నిజమైనదే అని రాహుల్ చెప్పగలరా ? దీనికి బాధ్యత వహిస్తారా ? ఆడియో క్లిప్ అబద్ధమని తేలితే హక్కుల తీర్మానం కింద సభ నుంచి బహిష్కారం ఎదుర్కోవడానికి సిద్ధమేనా ? " అంటూ తీవ్ర స్వరంతో జైట్లీ ప్రశ్నించారు. దీనికి బదులిస్తూ ఆడియో టేపులో ఉన్నది కనీసం చదివి వినిపించడానికైనా అనుమతి ఇవ్వాలని స్పీకర్ ను రాహుల్ కోరారు.దీంతో, ఎంపీల అరుపులు, కేకలతో సభ మొత్తం గందరగోళంగా మారింది.

రాహుల్ ను టార్గెట్ చేసిన జైట్లీ


రాఫెల్ డీల పై చర్చ సందర్భంగా రాహుల్ ను కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ టార్గెట్ చేశారు. " కొంతమంది సహజంగా వాస్తవాలను ఇష్టపడరు " అని రాహుల్ ను ఉద్దేశించి అన్నారు. ఒప్పందంపై అవాస్తవాలు ప్రచారం చేయడాన్ని కాంగ్రెస్ చీఫ్ అలవాటుగా చేసుకున్నారని ఎగతాళి చేశారు. గతంలో జరిగిన రక్షణ మంత్రిత్వ శాఖ ఒప్పందాలతో ప్రమేయం ఉన్న వారు ఇప్పుడు మోడీ సర్కార్ ను అపఖ్యాతి పాల్జేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈసందర్భంగా నేషనల్ హెరాల్డ్, ఆగస్టా వెస్ట్ లాండ్ స్కాంలను ఆయన ప్రస్తావించారు. కొంతమంది జాతీయ భద్రత విషయాలను అర్థం చేసుకోలేరని ఎగతాళి చేశారు.

యూపీఏ హయాంలోనే రాఫెల్ డీల్

రాఫెల్ యుద్ధ విమానాలకు అనుమతి ఇచ్చింది యూపీఏ ప్రభుత్వమేనని జైట్లీ గుర్తు చేశారు. ఒప్పందంపై మోడీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడం సరికాదన్నారు. కొనుగోలుకు సంబంధించిన అన్ని ప్రక్రియలు పూర్తయ్యాకే డసో కంపెనీతో ఒప్పందం జరిగిందన్నారు. విమానాల ధరలపై జ్యుడీషియల్ రివ్యూ వద్దని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని కేంద్ర మంత్రి చెప్పారు. ధరల వివరాలను సుప్రీం కోర్టు పూర్తిగా పరిశీలించిందన్నరు. అనిల్ అంబానీకి ఆఫ్ సెట్ అగ్రిమెంట్ ఇవ్వడం అనేది పూర్తిగా డసోకు సంబంధించిన వ్యవహారమన్నారు. జెట్ ఫైటర్లకు సంబంధించి రాహుల్ కు ఉన్న నాలెడ్జ్ బాగా తక్కువని అరుణ్ జైట్లీ ఎగతాళి చేశారు.

అది బూటకపు ఆడియో : పారికర్

పనాజీ : రాఫెల్ డీల్‌కు సంబంధించి కొత్త వివాదానికి తెరతీసిన ఆడియో టేపుపై గోవా సీఎం మనోహర్ పారికర్ స్పందించారు. "అది బూటకపు ఆడియో టేపు" అని అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక, కాంగ్రెస్ పార్టీ బూటకపు ఆడియో టేపులను సృష్టిస్తోందన్నారు. ఒప్పందానికి సంబంధించి అక్రమాలు జరగలేదంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చాక కూడా ఆడియో టేపుల పేరుతో కాంగ్రెస్ హంగామా చేస్తోందన్నారు. "ఆడియో టేపులో ప్రస్తావనకు వచ్చిన చర్చ, కేబినెట్ భేటీలో కానీ, మరో మీటింగ్‌లో కానీ జరగలేదు " అని పారికర్ స్పష్టం చేశారు.



సభలో కాగితపు విమానాలు

రాఫెల్ డీల్ పై లోక్ సభలో వాడి వేడి చర్చ జరుగుతున్న సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు కాగితపు విమానాలను విసిరారు. దీంతో స్పీకర్ సుమిత్ర మహాజన్ వారిని మందలించారు. " మీరు చిన్న పిల్లలా? పెద్దవారా? " అని ప్రశ్నించారు. దీనికి కాంగ్రెస్ సభ్యులు బదులిస్తూ రాఫెల్ ఒప్పందం పై చర్చ జరుగుతుంటే కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ఆగస్టా వెస్ట్ ల్యాండ్, నేషనల్ హెరాల్డ్ స్కాంల గురించి మాట్లాడుతున్నారన్నారు . చర్చను పక్కదారి పట్టించడానికే సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తున్నారని ఆరోపించారు. దీనికి నిరసగానే తాము కాగితపు విమానాలు విసిరేశామన్నారు. ఒప్పందం పై జేపీసీ తో విచారణ జరిపించాలన్న రాహుల్ డిమాండ్ కు మద్దతు పలుకుతున్నట్లు ఆయన చెప్పారు.

కొత్తగా ఆడియో వివాదం

రాఫెల్ ఒప్పందంపై మరో వివాదం రాజుకుంది. గోవా ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణేకు, మరో వ్యక్తికి మధ్య జరిగినట్లుగా భావిస్తున్న సంభాషణల ఆడియోను కాంగ్రెస్ బయటపెట్టింది. రాఫెల్ ఒప్పందానికి సంబంధించిన కీలక ఫైళ్లు గోవా సీఎం మనోహర్ పారికర్ బెడ్ రూంలో ఉన్నాయని మంత్రి విశ్వజిత్ రాణే అన్నట్లుగా ఆడియోలో ఉండటంతో వివాదం రాజుకుంది.

మీడియా ముందుకు ఆడియో క్లిప్

యుద్ధవిమానాల కొనుగోలులో కొత్త వివాదానికి కారణమైన ఆడియో క్లిప్ ను రణదీప్ సూర్జేవాలా బుధవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు. కేంద్ర ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేయడానికే పారికర్ ఈ రహస్యాలను తన దగ్గరే దాచిపెట్టుకున్నారని సూర్జేవాలా ఆరోపించారు. ఆడియో టేపు వ్యవహారాన్నిగోవా మంత్రి విశ్వజిత్ రాణే ఖండించారు.

జేపీసీకి పట్టుబట్టిన గల్లా జయదేవ్

రాఫెల్ పై చర్చ సందర్భంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని గల్లా జయదేవ్ (టీడీపీ) పట్టుబట్టారు. "ఇంతటి కీలక ఒప్పందానికి సంబంధించిన డాక్యుమెంట్లు మనోహర్ పారికర్ బెడ్ రూంకు ఎలా చేరాయో దేశ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు " అని ఆయన అన్నారు. సౌగత్ రాయ్ (టీఎంసీ) మాట్లాడుతూ బీజేపీకి లోక్ సభలో ఎంతో మంది సభ్యులుంటే, వారిని కాదని రాజ్యసభ సభ్యుడిని ఎందుకు తీసుకువచ్చిందని ప్రశ్నించారు. శివసేన కు చెందిన అరవింద్ సావంత్ కూడా చర్చ సందర్భంగా మాట్లాడారు. రాఫెల్ చర్చ ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో లోక్ సభ గురువారానికి వాయిదా పడింది.

రాఫెల్‌పై రివ్యూ పిటిషన్

న్యూఢిల్లీ : రాజకీయాల్లో దుమారం రేపుతున్న రాఫెల్ డీల్ పై మోడీ ప్రభుత్వానికి క్లీన్ చిట్ ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మరోసారి సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. మాజీ కేంద్ర మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరితో పాటు సీనియర్ లాయర్ ప్రశాంత్ భూషణ్ ఈ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. రాఫెల్ డీల్‌పై సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తప్పుడు వివరాలు అందచేసిందని వీరు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. రాఫెల్ ఒప్పందంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని కోరుతూ సుప్రీంకోర్టులో గతంలో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కిందటేడాది డిసెంబర్ 14న మోడీ ప్రభుత్వానికి క్లీన్ చిట్ ఇస్తూ తీర్పు చెప్పింది. రాఫెల్ డీల్ లో నిర్ణయ ప్రక్రియను అనుమానించడానికి ఎలాంటి ప్రాతిపదిక కనిపించడంలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. యుద్ధ విమానాల నాణ్యతపై ఎలాంటి అనుమానాలు లేవన్నది. దీంతో రాఫెల్ డీల్ ను రద్దు చేయాల్సిన అవసరం లేదని కోర్టు అభిప్రాయపడింది. ఒప్పందాన్ని సవాల్ చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టివేసింది.

అంత వరకు హిందువులు ఆగలేరు

రామమందిరం నిర్మాణంపై వీహెచ్‌పీ

న్యూఢిల్లీ: రామమందిరం నిర్మాణం విషయంలో హిందువులు కోర్టు తీర్పు కోసం శాశ్వత కాలం వేచి ఉండలేరని విశ్వహిందూ పరిషత్ అభిప్రాయపడింది. మందిరం నిర్మాణానికి వెంటనే చట్టాన్ని తీసుకురావాలని కోరింది. అయోధ్యలో రామమందిరం నిర్మాణంపై న్యాయప్రక్రియ ముగిసిన తర్వాతే ఆర్డినెన్స్‌తీసుకొచ్చే విషయంపై ఆలోచిస్తామని ప్రధాని మోడీ చెప్పిన నేపథ్యంలో వీహెచ్‌పీ ఈ వ్యాఖ్యలు చేసింది. "చట్టాన్ని తీసుకురావటం ఒక్కటే రామమందిర నిర్మాణానికి అసలైన పరిష్కారం" అని వీహెచ్‌పీ ఇంటర్నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్‌కుమార్ మీడియాతో చెప్పారు.



రాజ్యసభలో కావేరీ రగడ

- గురువారానికి సభ వాయిదా

న్యూఢిల్లీ: రాజ్యసభ లో బుధవారం కార్యక్రమాలు సజావుగా సాగలేదు. కావేరీ అంశంపై అన్నా డీఎంకే, డీఎంకే సభ్యులు గొడవ చేశారు. కావేరీ నది పై ఆనకట్ట నిర్మాణానికి అనుమతి ఇవ్వడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ దశలో చైర్మన్ వెంకయ్య నాయుడు వారిని వారించడానికి ప్రయత్నించారు. అయినా తమిళనాడు ఎంపీలు, ఆయన మాటను ఖాతరు చేయలేదు. సభలో గందరగోళం కొనసాగుతూనే ఉంది. దీంతో సభ వాయిదా పడింది. తర్వాత సభ ప్రారంభమైనా ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. అన్నా డీఎంకే సభ్యులు వెల్ లోనికి దూసుకు వచ్చి " ఉయ్ వాంట్ జస్టిస్ " అని నినాదాలు చేశారు. కావేరీ నది పై ఆనకట్ట నిర్మాణానికి ఇచ్చిన అనుమతిని వెనక్కి తీసుకోవాలని కోరారు. తమిళనాడు ప్రయోజనాలు కాపాడాలని డిమాండ్ చేశారు. ఈదశలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ గోయల్, వారిని సముదాయించడానికి విఫలయత్నం చేశారు. తర్వాత సభను చైర్మన్ వెంకయ్య నాయుడు గురువారానికి వాయిదా వేశారు.

ప్రస్తావనకు రాని ట్రిపుల్ తలాక్ బిల్లు

రాజ్యసభలో బుధవారం ట్రిపుల్ తలాక్ బిల్లు చర్చకు వస్తుందని భావించారు. లోక్ సభ ఆమోదం పొందిన తర్వాత బిల్లుపై సోమవారం వాడివాడి చర్చ జరిగింది. జాయింట్ సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు పట్టుబట్టగా, కేంద్రం తిరస్కరించింది.

జనం మనల్ని చూసి నవ్వుకుంటున్నారు

పార్లమెంటు సభ్యులను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు అన్నారు. ఉభయ సభల్లోనూ సభ్యులు రభస సృష్టిస్తున్న నేపథ్యంలో నిర్మాణాత్మకంగా పని చేయాలని కోరారు. పార్లమెంటు ప్రతిష్ఠ దెబ్బ తింటోందన్నారు.



మెక్సికో సరిహద్దుల్లోని టిజువానా వద్ద అక్రమంగా బోర్డర్ దాటుతున్న150 మంది మైగ్రెంట్లను యూఎస్ ఆర్మీ అడ్డుకుంది. వాళ్లు రాళ్లతో దాడి చేయడంతో టియర్ గ్యాస్ ప్రయోగించింది. దీంతో చెల్లాచెదురుగా పరిగెడుతున్న వలసవాదులు.

గుడిలో మహిళల అడుగు

ఇద్దరు మహిళలు అయ్యప్పను దర్శించుకున్నారు ■ ధ్రువీకరించిన కేరళ సీఎం

శబరిమల:

కేరళలోని శబరిమల ఆలయంలోకి 50 ఏళ్ల లోపు వయసు ఉన్న ఇద్దరు మహిళలు ప్రవేశించారు. కోజికోడ్‌కు చెందిన సీపీఐ(ఎంఎల్) కార్యకర్త, లెక్చరర్‌బిందు(42), అంగడిపురానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి కనకదుర్గ(44) బుధవారం తెల్లవారుజామున ఆలయంలోకి ప్రవేశించి అయ్యప్పను దర్శించుకున్నారు. ఈ విషయాన్ని కేరళ సీఎం పినరయి విజయన్ కూడా ధ్రువీకరించారు. పోలీసు సెక్యూరిటీ మధ్య ఇద్దరు మహిళలు ఆలయంలోకి ప్రవేశించారని చెప్పారు. ఆలయానికి వెళ్లాలనుకునే మహిళలకు సెక్యూరిటీ కల్పించే విషయంలో పోలీసులు కట్టుబడి ఉన్నారన్నారు. మంగళవారం అర్ధరాత్రి పన్నెండు గంటలకు మహిళలిద్దరూ పంబకు చేరుకున్నారు. అక్కడి నుంచి పోలీసు సెక్యూరిటీ మధ్య ఉదయం 3.45 గంటలకు అయ్యప్పను దర్శించుకున్నారు. సన్నిధానం దగ్గరకు చేరుకున్న టైంలో భక్తులు ఎక్కువగా లేరని, పోలీసులు కూడా మామూలు దుస్తుల్లో తమకు సెక్యూరిటీగా వచ్చారని ఒక మహిళ చెప్పింది. నల్లటి దుస్తులు ధరించిన ఇద్దరు మహిళలు హడావుడిగా ఆలయంలోకి ప్రవేశిస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరలైంది. మహిళలు ఆలయంలోకి ప్రవేశించారనే విషయం తెలిసిన వెంటనే ఆలయ నిర్వాహకులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఆలయాన్ని శుద్ధి చేయాలని ప్రధాన అర్చకుడు ఆదేశించారు. దీంతో దాదాపు గంటపాటు ఆలయాన్ని మూసేసిన పూజార్లు సంప్రోక్షణ చేసిన అనంతరం మళ్లీ తెరిచారు. ఆలయం సంప్రోక్షణ చేయటం చట్ట విరుద్ధమని, సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలనే తాము పాటించామని కేరళ మంత్రి ఈపీ జయరాజన్ చెప్పారు. మహిళలు ఆలయంలోకి ప్రవేశించారనే విషయం తెలిసిన వెంటనే వారి ఇళ్ల వద్ద పోలీసులు సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. సుప్రీం తీర్పు తర్వాత మహిళలు అయ్యప్పను దర్శించుకోవడం ఇదే మొదటిసారి. గత ఏడాది డిసెంబరులో ఇద్దరూ అయ్యప్పను దర్శించుకునేందుకు సన్నిధానం వరకు వచ్చినా ఆందోళనకారులు వారిని అడ్డుకున్నారు.

ఆందోళనకు దిగిన బీజేపీ

ఆలయంలోకి మహిళలు ప్రవేశించడంతో శబరిమలలో హైటెన్షన్‌నెలకొంది. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. కేరళలోని మంత్రుల ఇళ్ల ముందు నల్లజెండాలతో ఆందోళనకు దిగారు. కోసర్‌కోడ్, తిరువనంతపురం తదితర ప్రాంతాల్లో హైవేలపై నిరసనకు దిగటంతో వాహనాలు స్తంభించిపోయాయి. యువ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. శబరిమల కర్మ సమితి గురువారం కేరళ బంద్‌కు పిలుపునిచ్చింది. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. సెక్రటేరియట్ వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేశారు.

- బందోబస్తు మధ్య అయ్యప్ప దర్శనం
- ఆలయం మూసి సంప్రోక్షణ చేసిన పూజారులు
- మండిపడుతున్న బీజేపీ.. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు



బుధవారం శబరిమల అయ్యప్ప గుడిలో దర్శనాలు నిలిపేసి, సంప్రోక్షణ చేస్తున్న పూజారులు



ఇది చరిత్రాత్మకమైన రోజు: తృప్తిదేశాయ్

శబరిమల ఆలయంలోకి మహిళలు ప్రవేశించడంపై సామాజిక వేత్త తృప్తిదేశాయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఇది చరిత్రాత్మకమైన రోజు అని అన్నారు. "మేము చేస్తున్న ఆందోళనలో ఇది పెద్ద విజయం. చరిత్రాత్మకమైన విజయం. న్యూఇయర్‌లో మహిళలకు ఇది గొప్ప ఆరంభం. చాలెంజ్‌చేసిన వారికి ఇది పరాజయం" అని తృప్తి దేశాయ్ అన్నారు. తాను కూడా తప్పకుండా ఆలయాన్ని దర్శించుకుంటానని చెప్పారు. సీపీఐ నేత బృందాకారత్ స్పందించారు. ప్రతి మహిళకు పూజ చేసే హక్కు ఉందని అభిప్రాయపడ్డారు. మహిళల కోరికను నెరవేర్చేందుకే కేరళ ప్రభుత్వం వారికి సెక్యూరిటీ ఇచ్చిందని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పును కచ్చితంగా అమలు పరుస్తామని ఎల్‌డీఎఫ్‌నేతృత్వంలోని కేరళ ప్రభుత్వం మొదటి నుంచి పట్టుదలతో ఉంది. దీనిలో భాగంగానే మంగళవారం 620 కిలోమీటర్ల మేర 'ఉమెన్‌వాల్' కార్యక్రమం నిర్వహించింది. బీజేపీ ఎంపీ ఉదిత్‌రాజ్ ఈ విషయాన్ని స్వాగతించారు. మహిళలు ఆలయంలోకి వెళ్లడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు.



- ఏడాదంతా సిరిసిల్ల నేతన్నలకు పని..
- రూ.570 కోట్ల ఆర్డర్లు
- ఇప్పటికే ఆర్వీఎం ఆర్డర్లు ప్రారంభం

సాంచాలకు ఇరాం లేదు

ఆకలి చావులు, అప్పల గోసల నుంచి నేతన్న బయట పడుతున్నడు. ఈలోగా సర్కారు ఆర్డర్ల మీద ఆర్డర్లు ఇచ్చింది. దీంతో యాడాదంతా సాంచాలు ఇరాం లేకుండా నడుస్తనే ఉంటయ్. నేతన్నకు చేతి నిండా పని దొరుకుతది. గతేడాది తెలంగాణ సర్కారు బతుకమ్మ చీరలు నేసేందుకు సిరిసిల్ల నేతన్నలకు ఆర్డర్ ఇచ్చి ఆదుకుంది. ఇప్పుడు బతుకమ్మతోపాటు రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లు, రాజీవ్ విద్యా మిషన్ (ఆర్వీఎం) ఆర్డుర్లు ఇచ్చింది. గతంలో జరిగిన పొరపాట్లను దృష్టిలో పెట్టుకొని తక్కువ టైంలో ఎక్కువ ఆర్డర్లు ఇచ్చి కార్మికులను ఇబ్బంది పెట్టేకన్నా ముందుగానే ఆర్డర్లు ఇచ్చి ప్రజలకు నాణ్యమైన గిఫ్ట్‌లు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

రాజన్నసిరిసిల్ల,వెలుగు: సిరిసిల్ల నేతన్నల బతుకుల్లో వెలుగులు నింపేందుకు ఈ సారి తెలంగాణ సర్కారు ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తోంది. బతుకమ్మ చీరలతో పాటు ఇతర ఆర్డర్ల విషయంలో ప్రభుత్వం ఒక క్యాలెండర్‌ను రూపొందించింది. ఇంతకు ముందు కేవలం నాలుగు నెల ముందుగా బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి కాల పరిమితి పె ట్టింది. తక్కువ సమయంలో ఎక్కువ చీరలు తయారు చేయాలని ఇటు యజమానులు, కార్మికులపై ఒత్తిడి తీసుకొచ్చింది. ఇప్పుడు దానికి స్వస్తి పలకనుంది. ఈ సారి బతుకమ్మ, ఆర్వీఎం, రంజాన్ గిఫ్ట్‌ప్యాక్‌లు కూడా సిరిసిల్ల నేతన్నలకే ఆర్డర్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. టీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్‌ప్రతినిథ్యం వహిస్తున్న సిరిసిల్లకు ఈ సారి ప్రభుత్వ ఆర్డర్ల పంట పండనుంది. ఇప్పటికే ఆర్వీఎం ఆర్డర్లు రూ.100 కోట్లు ఇచ్చారు. ఆర్వీఎంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇతర మార్కెట్‌రేట్లకంటే ఎక్కువ నాణ్యతతో ప్రభుత్వ స్కూళ్లకు యూనిఫాంల తయారీ కోసం బట్టలు తయారు చేయించేందుకు చేనేత జౌళి శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి విడతలో రూ.60కోట్లతో 1.22 కోట్ల మీటర్లు ఆర్డర్ ఇవ్వగా ఇప్పటికే 80 లక్షల మీటర్లు తయారు చేసి ఈ వారంలో ఆర్వీఎంకు అందజేసేందుకు సిద్ధంగా ఉంచారు. మార్చి లోపు పూర్తి చేసి స్కూళ్ల ప్రారంభం రోజే యూనిఫాంలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ దిశగా చేనేత జౌళి శాఖ చర్యలు తీసుకుంటోంది. ఆర్వీఎం ఆర్డర్లు తయారు చేయడానికి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 123 మ్యాక్ సంఘాలు, 74 చిన్న తరహా పరిశ్రమల సంఘా లు పని చేస్తున్నాయి. మొత్తం 13500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. 30 మరమగ్గాల్లో బట్టలు తయారు చేస్తున్నారు. వారం రోజుల్లో 80 లక్షల మీటర్లు ఆర్వీఎంకు అప్పగించనున్నారు. మిగతా 62లక్షల మీటర్లు మార్చిలోపే అందించనున్నామని చేనేత జౌళి శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్ధేశించిన క్యాలెండర్ ప్రకారం సిరిసిల్ల నేతన్నలకు ఏడాదంతా ఉపాధి దొరుకుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు ఆర్వీఎం ఆర్డర్లు ఇచ్చారని, ఇది పూర్తి కాగానే రంజాన్‌మాసంలో మస్లింలకు కానుక ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తూ రూ.70కోట్లు అర్డర్ ఇవ్వనుందని, ఇప్పటికే ప్రాథమిక ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఏప్రిల్ లో ఈ ఆర్డర్లు రంజాన్‌గిఫ్ట్‌ప్యాకుల్లో భాగంగా మైనార్టీ వేల్ఫేర్ శాఖ చేనేత జౌళి శాఖతో ఒప్పందం కుదుర్చుకోనుంది. ఆర్వీఎం, రంజాన్‌ఆర్డర్లే రూ.170 కోట్లు దాటనుంది. దీంతో ఈ సారి కూలీ ఒప్పందం కూడా చేసి కార్మికులకు నెలసరి వేతనం పెరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

ఏప్రిల్ నుంచే బతుకమ్మ చీరల తయారీ

2019లో వచ్చే బతుకమ్మ పండగకు బతుకమ్మ చీరల తయారీకి కాల పరిమితి పెట్టకుండా, ఈ సారి మంచి డిజైన్లు, నాణ్యతతో బతుకమ్మ చీరలు తయారు చేయించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఈ నేపథ్యంలో బతుకమ్మ చీరలకు ప్రతిపాధనలు పంపాలని చేనేత జౌళిశాఖకు ఆదేశాలు అందడంతో అధికారులు రూ.400 కోట్లతో ప్రతిపాదనలు పంపేందుకు రంగం సిద్ధం చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లతో కలిపి సిరిసిల్లకు రూ.570 కోట్లకు ఆర్డర్లు చేరుకోనున్నాయి. ఈ ఆర్డర్లు అనుకున్న సమయంలో వచ్చినట్లయితే 2019 ఏడాదంతా సిరిసిల్ల నేత కార్మికులకు చేతి నండా పని ఉండడమే కాకుండా ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లవుతుంది.



ఆర్వీఎం ఆర్డర్లు వచ్చాయి..

సిరిసిల్లకు రూ.100 కోట్ల ఆర్వీఎం ఆర్డర్లు వచ్చాయి. మొదటి విడతగా ప్రభుత్వం రూ.60 కోట్లు మంజూరు చేసింది. 1.22కోట్ల మీటర్లకు గానూ 80 లక్షల మీటర్లు ఈ వారంలోనే అందజేయనున్నాయి. ఈ సారి బతుకమ్మ చీరలు ముందస్తుగా తయారు చేయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా ఇప్పటి వరకు పంపిణీ చేసిన చీరలకంటే మరింత నాణ్యతతో చీరలు ఇచ్చేందుకు రూ.400కోట్లతో 2019 బతుకమ్మ చీరల తయారీకి ప్రతిపాదనలు పంపనున్నాం. ప్రభుత్వం పరిశీలించాక పై అధికారుల నిర్ణయం మేరకు చర్యలు చేపడతాం. ఇతర మార్కెట్‌రేట్ల కంటే తక్కువ ధరకు సిరిసిల్ల యజమానులు బట్టలు తయారు చేసి ఇస్తున్నారు.

అశోక్‌రావు, ఏడీ, చేనేత జౌళిశాఖ, సిరిసిల్ల

చిన్నారి ప్రాణం తీసిన మెంతోప్లస్ డబ్బా

మెదక్, వెలుగు: గొంతులో మెంతోప్లస్ డబ్బా ఇరుక్కొని ఏడాది వయసున్న ఓ చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన పాపన్నపేట మండలం కొడపాక గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన చాకలి దమ్మరాజు-యశోదలు గ్రామంలో తెలిసిన వారింట్లో ఎంగేజ్‌మెంట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వారి కూతురు బిందు(1) ఆడుకుంటూ అక్కడున్న మెంతోప్లస్ డబ్బాను నోట్లో పెట్టుకుంది. కొద్దిసేపటి తర్వాత ఊపిరి ఆడక పాప ఇబ్బంది పడుతుండటం చూసిన తల్లి యశోద పాప గొంతులో డబ్బా ఇరుకున్న విషయం గమనించింది. వెంటనే చికిత్స కోసం మెదక్ పట్టణంలో హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్ చెప్పారు. మంగళవారమే ఫస్టు బర్త్‌డే జరుపుకున్న బిందు.. మరుసటి రోజే మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.



ఆలోచన అదుర్స్

రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని అర్లిటీలో అయితే అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో ప్రజలే కాకుండా మూగజీవాలకు సైతం చలి బాధలు తప్పడం లేదు. మనుషులైతే సొంతంగా రక్షణ చర్యలు తీసుకోగలరు. దీంతో మూగజీవాల పరిస్థితి ఏమిటని ఆలోచించిన ఓ వ్యక్తి తనకు చెందిన ఎద్దులకు బొంతలు కప్పి రక్షణ చర్యలు చేపట్టాడు.

- ఆదిలాబాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

నెరవేరిన సిద్దిపేట ప్రజల కల

కేంద్రీయ విద్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, వెలుగు : కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో సిద్దిపేట ప్రజల చిరకాల స్వప్నం సాకారమైందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయ ప్రారంభోత్సవంలో కలెక్టర్ కృష్ణభాస్కర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమమైన విద్యార్థులను తీర్చిదిద్ది రేపటి తరానికి అందించేలా అధ్యాపకులు పనిచేయాలని సూచించారు. తల్లిదండ్రుల, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చదువు చెప్పాల్సిన బాధ్యత వారిదేనన్నారు. కేంద్రీయ విద్యాలయం కోసం ఎనిమిదేళ్లుగా ప్రయత్నిస్తున్నామని, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కృషి మరువలేనిదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైనా చివరి నిమిషంలో చేజారిందని, ఇప్పటికైనా ఏర్పాటు కావడం సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ కృష్ణభాస్కర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సిద్దిపేటలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ, అర్బన్ పార్క్ పనులను హరీశ్‌రావు పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను ఆరా తీసిన ఆయన.. కళాశాల ముఖ ద్వారం వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలని, కాలేజీ మార్గంలో డివైడర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కాలేజీ, ఆసుపత్రి ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపాలని ఆదేశించారు. అలాగే నాగులబండ వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న అర్బన్, ఆక్సిజన్ పార్క్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిని వివరించిన డీఎఫ్‌వో శ్రీధర్ జంతువుల కోసం తాగు నీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు.

లక్ష మెజార్టీ ఇచ్చారు.. లక్ష్యం మేరే ఇవ్వండి

'సిద్దిపేట ప్రజలు లక్ష మెజార్టీ ఇచ్చారు.. ఐదేండ్ల లక్ష్యాన్ని కూడా మీరే ఇవ్వండి.. అమలు చేసే బాధ్యత నాదే'నని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట ఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన కృతజ్ఞత సమావేశానికి హాజరై మాట్లాడారు. గత అభివృద్ధి మీ ముందు వుంది ఇక భవిష్యత్తుపై ఆలోచన చేయడండని కోరారు. అభివృద్ధి, ఆరోగ్యం, పచ్చదనంపై దృష్టి సారించాలన్నారు. అన్నింటిలో ఆదర్శంగా ఉన్న సిద్దిపేటను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.



అంతా రామమయం..

- వైభవంగా విశ్వరూప సేవ
- తరలివచ్చిన దేవతామూర్తులు
- తరించిన భక్తులు..

భద్రాచలం, వెలుగు : దేశంలో ఏ క్షేత్రంలోలేని 'విశ్వరూప (సర్వదేవతాలంకారం) సేవ' బహుళ ద్వాదశి రోజున బుధవారం భద్రాచల శ్రీరామదివ్యక్షేత్రంలో అత్యంత వైభవంగా జరిగింది. వైకుంఠ ఏకాదశి తర్వాత వచ్చే బహుళ ద్వాదశి వేళ ఈ ఉత్సవాన్ని భద్రాచల దేవస్థానంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయంలోని దేవతామూర్తులంతా ఒక్కచోటే కొలువై భక్తులకు కనువిందు చేశారు. భక్త రామదాసు తన కీర్తనల్లో ఆలపించిన 'అంతా రామ మయం'లా దేవతామూర్తులందరూ రామ స్వరూపులేనని స్థానాచార్యులు స్థలసాయి భక్తులకు వివరించారు. ముందుగా ప్రాకార మండపంలో ప్రత్యేక పూలతో అలకరించిన మండపంలో ఆలయ ఆవరణలోని దేవాలయాల్లోని మూర్తులను, ఆళ్వార్లను అధిష్టింపజేశారు. అనంతరం రామచంద్రుడు అక్కడకు చేరుకున్నారు. శ్రీరామున్ని కీర్తిస్తూ ఆస్థాన విధ్వాంసులు ఆలపించిన కీర్తనలతో భద్రగిరులు పులకించాయి. స్వామికి స్వర్ణ పుష్పార్చన చేశారు. విశ్వరూపసేవలో భాగంగా ఒకే చోటు కొలువైన రామచంద్రుడితో సహా దేవతామూర్తులందరికీ ఏకారాధన జరిగింది. మహాదర్బారు సేవలో రామయ్యకు ఇచ్చిన దివిటీ సలాం ఉత్సవానికే హైలైట్. కాగా విశ్వరూప సేవలో స్వామికి కదంబం ప్రసాదాన్ని నైవేద్యంగా పెట్టారు. ఈ ప్రత్యేక ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు పోటీపడ్డారు. జిల్లా అడిషినల్ జడ్జి ప్రేమలత, దేవస్థానం ఈవో తాళ్లూరి రమేశ్‌బాబు, సీఐ సత్యనారాయణరెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

≡ క్విక్ బైట్స్

సాయికృష్ణగౌడ్‌ను అభినందించిన కేసీఆర్

రామగుండం, వెలుగు: రష్యాలో జరిగిన ఇంటర్నేషనల్ కబడ్డీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన అంతర్గాం మండలం గోలివాడకు చెందిన బాలసాని సాయికృష్ణగౌడ్‌ను మంగళవారం సీఎం కేసీఆర్ అభినందించారు. గోలివాడ పంప్‌హౌజ్ నిర్మాణాన్ని పరిశీలించేందుకు వచ్చిన సీఎం దగ్గరకు క్రీడాకారుడిని ఎమ్మెల్యే చందర్ తీసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా సాయికృష్ణగౌడ్‌కు సహకారం అందించాలని పెద్దపల్లి కలెక్టర్ శ్రీదేవసేనను సీఎం ఆదేశించారు.



అబ్కారీ ఆఫీస్ ఎదుట ధర్నా

హైదరాబాద్, వెలుగు: నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజీపేట ఐఎంఎఫ్ఎల్ (ఇండియన్ మేడ్ ఫారన్ లిక్కర్) డిపోలో కార్మికులను విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు బుధవారం హైదరాబాద్‌లోని అబ్కారీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహన్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను ఏ కారణం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. భారీ మెజారిటీతో గెలిచిన సీఎం కేసీఆర్ నెల గడవక ముందే కార్మికుల హక్కులపై దాడి చేయడం అన్యాయమన్నారు.

డ్యూటీలోనే కానిస్టేబుల్ మృతి

జయశంకర్ భూపాలపల్లి, వెలుగు: సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా బందోబస్తు డ్యూటీలో ఉన్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన బుధవారం కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన కోసం సీఎం కేసీఆర్ రెండు రోజుల పర్యటన బందోబస్తులో ములుగు మండలం రాజన్నగూడెం గ్రామానికి చెందిన వజ్జ నారాయణ (52) పాల్గొన్నాడు. ఇతడు సోమవారం రాత్రి నుంచే కన్నెపల్లి పంప్‌హౌజ్ వద్ద డ్యూటీలో ఉన్నాడు. మంగళవారం సాయంత్రం కేసీఆర్ పర్యటన అనంతరం నారాయణ అక్కడే నిద్రించాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆయనకు గుండెపోటు రావడంతో హుటాహుటిన మహాదేవపూర్‌లోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

రిపబ్లిక్‌డే చేసుడెట్లా?

హుజూర్‌నగర్, వెలుగు: పంచా యతీల రెండో విడత పోలింగ్ రిప్లబిక్ డే వేడుకలు అడ్డంగా మారింది. రెండో విడత ఎన్నికల ప్రక్రియ జనవరి 11తో ప్రారంభం అవుతుంది. 25వ తేదీన ఉదయం పోలింగ్ జరిగిన తర్వాత మధ్యాహ్నం కౌంటింగ్ వెంటనే ఫలితాలను ప్రకటించనున్నారు. ఫలితాలు వెల్లడించిన అనంతరం ఉప సర్పంచ్ ఎన్నికతో ప్రక్రియ ముగుస్తుంది. అన్ని పాఠశాలల్లోని హెచ్‌ఎంతో సహా టీచర్లందరికీ ఎన్నికల విధులు కేటాయించారు. దీంతో రెండో విడత ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది 24వ తేదీ సాయంత్రం లోగా ఎన్నికల విధులు కేటాయించబడిన గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. 25వ తేదీన పోలింగ్ ముగిసిన అనంతరం ఏ అర్ధరాత్రో ఇండ్లకు చేరుకుంటారు. దీంతో తెల్లవారి ఉదయాన్నే రిపబ్లిక్ డే వేడుకలకు హాజరు కావడం అనుమానమే.

- 24, 25 తేదీల్లో ఎన్నికల డ్యూటీలో టీచర్లు
- రిపబ్లిక్ డే వేడుకల నిర్వహణపై ఆందోళన

ఏర్పాట్లు చేసుకోవడం కష్టమే

రిపబ్లిక్ డే నిర్వహించాలంటే ముందురోజే ఆయా పాఠశాలను శుభ్రం చేసుకోవడం, రంగురంగుల కాగితాలు కట్టుకోవడం, జెండాను సిద్ధం చేసుకోవడం వంటి పనులను చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు పోలింగ్ ముగిసిన తెల్లారే రిపబ్లిక్ డే రావడం, టీచర్లు 24 నుంచి 25వ తేదీ రాత్రి వరకు ఎన్నికల విధుల్లోనే ఉండడం వల్ల ఏర్పాట్లు ఎలా చేసుకోవాలో తెలియడం లేదు. మరో వైపు మెజార్టీ పోలింగ్ కేంద్రాలు స్కూళ్లలోనే ఏర్పాటు చేశారు. దీంతో ఆ స్కూళ్లను 24న ఉదయమే ఎలక్షన్ అధికారులకు అప్పగించాల్సి ఉంటుంది. అలా చూసిన రెండు రోజుల ముందే ఏర్పాట్లు చేసుకునే పరిస్థితి ఉండడం లేదు. దీంతో ఈ సారి రిపబ్లిక్ డే వేడుకలకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఈ విషయాన్ని పట్టించుకోకుండా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంపై పలువురు ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు



తేదీలను సవరించాలి

ఎన్నికల సంఘం ప్రకటించిన పంచాయతీ షెడ్యూల్ వల్ల రిపబ్లిక్ డే వేడుకల్లో టీచర్లు ఎలా పాల్గొనాలో అర్థం కావడం లేదు. దూర ప్రాంతాల్లో డ్యూటీ చేసిన టీచర్లు అర్ధరాత్రి ఇండ్లకు చేరుకుంటారు. మళ్లీ ఉదయాన్నే లేచి తమ స్కూళ్లకు చేరుకోవడం కష్టమే. ప్రత్యామ్నాయంగా పాఠశాలల్లో జెండా ఎగురవేయడానికి కూడా వీలు లేకుండా టీచర్లందరికీ డ్యూటీలు వేశారు. తేదీలను సవరించాలి.

విష్ణుదాస్యం యతిపతిరావు, ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



వేడుకల్లో పాల్గొనడం కష్టమే

రిపబ్లిక్ డే వేడుకలకు ముందురోజు ఎస్ఎంసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, దాతలకు ఆహ్వానం పంపడం సంప్రదాయంగా వస్తుంది. ఈ సారి టీచర్లంతా ఎలక్షన్ డ్యూటీలో ఉండడం వల్ల అది సాధ్యం కాదు. అంతేగాకుండా జెండా వందనానికి ముందు రోజే స్కూల్‌ను శుభ్రపరుచుకోవడం, రంగు కాగితాలు అంటించడం వంటి పనులు ఎలా చేయాలో అర్థం కావట్లేదు. అందరికీ డ్యూటీలు ఉండడం వల్ల ఈ పనులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది.

ఓరుగంటి నాగేశ్వర్‌రావు, టీచర్, మేళ్లచెర్వు

రాజ్యాంగ విరుద్ధంగా పోతే ఊరుకోం

ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ గుర్రు

హైదరాబాద్, వెలుగు: టీఆర్ఎస్ పార్టీకి రాష్ట్ర ఎన్నికల సంఘం, ఎలక్షన్ కమిషన్ అనుకూలంగా పని చేస్తున్నాయని పీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్ విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో 22 లక్షల ఓట్లు గల్లంతైనా తన తీరు మార్చుకోలేదన్నారు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలనూ గందరగోళంగానే నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అధికారులు రాజ్యాంగ విరుద్ధంగా పనిచేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.



ఎమ్మెల్యేలకు పంచాయతీ పోరు

గద్వాల, వెలుగు :

- గ్రామాల వారీగా పరిస్థితులు వేరు
- ఒకే పార్టీలో రెండు, మూడు వర్గాలు
- పార్టీ మద్దతు మాకంటే మాకని చక్కర్లు
- తలనొప్పిగా మారుతున్న వర్గపోరు

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గుర్తు చూసో.. సీఎం అభ్యర్థి ముఖం చూసో.. ఎమ్మెల్యే అభ్యర్థి పేరును బట్టో జనాలు ఓట్లేశారు. కాని, పంచాయతీ ఎన్నికలు ఇందుకు పూర్తిగా భిన్నం. అక్కడ పార్టీ గుర్తులుండవు.. ఒకే పార్టీకి చెందిన ఇద్దరు ముగ్గురు నేతలు మాత్రం బరిలో ఉంటారు. వ్యక్తిగత ఇమేజ్, పలుకుబడి పనిచేసే అవకాశం ఎక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ, స్థానిక ఎమ్మెల్యే మద్దతు ఎవరికో ఆస్తకిగా మారింది. 'అన్నా అసెంబ్లీ ఎన్నికల్లో మీ కోసం పని చేసినం.. రిజర్వేషన్ కూడా అనుకూలం వచ్చింది... మద్దతివ్వడంటూ' ఆశావహులు ఇప్పటికే ఎమ్మెల్యేల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు...

జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో 12 మండలాలలో విడతకు 4 మండలాల చొప్పున మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో గద్వాల, గట్టు, ధరూరు, కేటీ దొడ్డి మండలాలు, రెండో విడతలో మల్దకల్, అయిజ, రాజోలి, వడ్డేపల్లి మండలాలు, మూడో విడతలో అలంపూర్, ఇటిక్యాల, ఉండవెల్లి, మానవపాడు మండలాలాలో ఎన్నికలు జరగనున్నాయి.

పెద్దసమస్యగా వర్గపోరు

పార్టీల గుర్తు లేక పోవచ్చు కాని, ప్రతి గ్రామంలో వర్గపోరు మాత్రం ఉంటుంది. అందునా ప్రతి పార్టీలోనూ ఉండడం మరింత సమస్యగా మారుతున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తమకే పని చేశాం. పంచాయతీ ఎన్నికల్లో మద్దతివ్వాలంటూ గ్రామ స్థాయి నాయకులు ఇప్పటికే ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. తమకు కాకుండా మరో వర్గానికి సపోర్ట్ చేస్తే తమ దారి తాము చూసుకుంటామని తేల్చి చెబుతున్నారు. ఇదిలా ఉంటే నెల రోజుల క్రితమే గెలుపొందిన ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ఎక్కువ గ్రామాలను ఏకగ్రీవం చేస్తే పార్టీ మంచి గుర్తింపు వస్తుందని భావిస్తున్నారు. కాని పక్షంలో తాము మద్దతిచ్చిన వారిని గెలిపించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన ఓడిపోయిన వారు తామేంటో నిరూపించుకోవాలని గట్టిగానే కృషి చేస్తున్నారు. ఇప్పటికే టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఎవరికి వారు వ్యూహారచనలో మునిగిపోయారు. ముఖ్యంగా గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 80 శాతం పంచాయతీలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

గద్వాల నియోజకవర్గంలో ...

గద్వాల నియోజకవర్గంలో ఒకే కుటుంబంలోని వారు 41 ఏళ్ల పాటు ప్రాతినిధ్యం వహించారు. అందులో మాజీ మంత్రి డీకే అరుణ ఏకదాటిగా 15 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనా నియోజకవర్గంలో మంచి పట్టుంది. పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ మద్దతుదారులను వీలైనంత ఎక్కువ మందిని గెలిపించాలనే కార్యాచరణతో రంగంలోకి దిగుతున్నారు. ఇక మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలుపొందిన కృష్ణమోహన్‌రెడ్డి సైతం టీఆర్ఎస్ మద్దతు దారులను సర్పంచులుగా గెలిపించేందుకు కృషి చేస్తున్నారు.

అలంపూర్ నియోజకవర్గంలో ...

అసెంబ్లీ ఎన్నికలలో భారీ మోజార్టీతో అందుకున్న ఎమ్మెల్యే అబ్రహం పంచాయతీల్లోనూ అదే ఫలితాలను పునరావృతం చేయాలని చూస్తున్నారు. అందుకు అనుగుణంగా టీఆర్ఎస్ మద్దతు దారులను ఎక్కువ మందిని సర్పంచ్‌లుగా గెలిపించేందుకు ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాంగ్రెస్ పార్టీలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మరో మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డిలు సర్పంచ్ ఎన్నికలపై గట్టిగానే నజర్ పెట్టారు. తనకు ఎమ్మెల్యేగిరి పోయినా తమ మద్దతుదాలకు సర్పంచ్‌గిరి కోసం ప్రయత్నిస్తున్నారు.

సంక్రాంతికి 124 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, వెలుగు:



- ఆంధ్రప్రదేశ్‌కే ఎక్కువ రైళ్లు
- సాధారణ, ప్రత్యేక రైళ్లలో రిజర్వేషన్లు దాదాపు ఫుల్
- సువిధ రైళ్లలో అదనపు చార్జీలు

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టింది. సొంతూళ్లకు వెళ్లే లక్షలాది మంది కోసం వివిధ ప్రాంతాలకు 124 స్పెషల్ ట్రైన్స్ నడపనుంది. ఇందులో ఎక్కువ రైళ్లు ఏపీకి వెళ్లనున్నాయి. ఇప్పటికే ఆయా రైళ్లలో టికెట్ రిజర్వేషన్లన్నీ పూర్తయ్యాయి. ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకు 124 ప్రత్యేక రైళ్లు నడుస్తాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 11,12 తేదీల్లో రైళ్లు కిక్కిరిసిపోనున్నాయి. సికింద్రాబాద్ నుంచి దర్భంగకు ఈ నెల 5,8,12,15,19,22 తేదీల్లో, కాకినాడ టౌన్ నుంచి కర్నూల్ టౌన్‌కు 8,10,15,17,22,24 తేదీల్లో, కర్నూలు టౌన్ నుంచి కాకినాడ టౌన్‌కు 9,11,16,18,23,25 తేదీల్లో, కాకినాడ టౌన్ నుంచి రాయచూర్‌కు 6,9,11,16,18,20,23,25 తేదీల్లో, రాయచూర్ నుంచి కాకినాడ టౌన్‌కు 5,7,10,12,14,17,19,21,24 తేదీల్లో, హైదరాబాద్ నుంచిరాక్సల్‌కు 10,17,24 తేదీల్లో, కాచిగూడ నుంచి కాకినాడ పోర్ట్‌కు 5,12,19 తేదీల్లో ఈ ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఇవే కాకుండా హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ నుంచి ఆయా ప్రాంతాలకు వివిధ రైళ్లు బయలుదేరనున్నాయి. కాగా గతేడాది దక్షిణ మధ్య రైల్వే డివిజన్ పరిధిలో 134 రైళ్లను అధికారులు నడిపారు.

'సువిధ'లో అదనపు చార్జీలు

సంక్రాంతి పండుగ సమయంలో 23 సువిధ, 6 జనసాధారణ్ రైళ్లు నడపనున్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్, విజయవాడ, కాకినాడ టౌన్, నాగర్‌సోల్, మచిలీపట్నం నుంచి ఈ రైళ్లు ప్రారంభం కానున్నాయి. మిగతా రైళ్లతో పోల్చితే సువిధ రైళ్లలో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. చార్జీల పెంపును నాలుగు స్లాబులుగా విభజించారు. మొదటి, రెండో స్లాబులో సాధారణం కంటే స్వల్పంగా పెంచగా, నాలుగో స్లాబులో టికెట్‌పై రెండు నుంచి మూడు రెట్లు అధికంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పండుగ సమయంలో ప్రజల రద్దీని తగ్గించేందుకు హైదరాబాద్, సికింద్రాబాద్ స్టేషన్లలో ప్లాట్‌ఫాం టికెట్ ధర రూ.10 నుంచి రూ.20కి పెంచారు. మరోవైపు సంక్రాంతి నేపథ్యంలో అన్ని రైళ్లలోనూ ఇప్పటికే టికెట్ బుకింగ్ రిజర్వేషన్లు నిండిపోయాయి. ఈ నెల 5 నుంచి నడపనున్న ప్రత్యేక రైళ్లలోనూ దాదాపు రిజర్వేషన్లు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. సువిధ ట్రైన్స్‌లో మాత్రం కొన్ని ఖాళీలు ఉన్నాయని తెలిపారు.



బీసీల గొంతు కోశారు

'పంచాయతీ' రిజర్వేషన్ల తగ్గింపుపై కృష్ణయ్య

హైదరాబాద్, వెలుగు: పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల తగ్గింపుపై బీసీ సంఘాలు హైకోర్టును ఆశ్రయించినందుకే ప్రభుత్వం ఆదరబాదరగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య బుధవారం మండిపడ్డారు. బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందని విమర్శించారు. మంత్రివర్గ ఆమోదం లేకుండా రాజ్యాంగ విరుద్ధంగా ఆర్డినెన్స్ విడుదల చేశారని, గవర్నర్ కూడా బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. 14 బీసీ సంఘాలు ఏర్పాటు చేసిన ఈ అత్యవసర సమావేశంలో ఏకగ్రీవంగా ప్రభుత్వ చర్యను ఖండించామన్నారు. టీఆర్ఎస్ సర్కారు ఏర్పాటులో బీసీల పాత్ర కీలమని, కానీ సీఎంగా బాధ్యతలు తీసుకున్నాక తొలి సంతకం బీసీ రిజర్వేషన్ల కుదింపుపై పెట్టడం బాధాకరమని అన్నారు. సర్కారుపై ప్రతీకారం తీర్చుకోవడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

కేసీఆర్‌తోనే హైకోర్టు విభజన

ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్, వెలుగు: సీఎం కేసీఆర్ కృషితోనే తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు వచ్చిందని ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవాదుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఇరు రాష్ట్రాలకు హైకోర్టులు కేటాయించాలని విభజన చట్టంలో ఉన్నా విభజించకుండా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నీచ రాజకీయాలకు పాల్పడ్డారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమరావతిలో హైకోర్టు నిర్మాణానికి ఐదు వందల కోట్ల రూపాయలు ఇచ్చినా.. వాటిని ఖర్చు చేయకుండా తాత్సారం చేశారని మండిపడ్డారు. ఇది గమనించి సీఎం కేసీఆర్ కేంద్రంతో మాట్లాడి హైకోర్టు విభజనను దిగ్విజయంగా పూర్తి చేయించారన్నారు. మన హైకోర్టు మనకు రావడంతో అనేక కేసులు పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం ఎమ్మెల్యేను లాయర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి హరి నారాయణ భూపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంత్ రెడ్డి, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు .

ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో న్యూ ఇయర్ సంబురాలు

హైదరాబాద్, వెలుగు: నూతన సంవత్సరంలో మంచి ప్రణాళికలతో లక్ష్యాల దిశగా కృషి చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ.ఆచార్య పిలుపునిచ్చారు. బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరించారు. నిరంతర సాధన, నిబద్ధత తమ వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ సందర్భంగా 'ఇంటర్నేషనల్ సెక్యూరిటీ' అనే పుస్తకాన్ని సంస్థ ఉద్యోగులు ఆయనకు బహూకరించారు.

సాగర్ నీరు.. సాగు జోరు

మిర్యాలగూడ, వెలుగు:

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో యాసంగి పనుల్లో రైతులు బిజీగా మారాడు. ఇప్పటికే బోర్లు, బావుల కింద సాగైన వరి నాట్ల దశకు చేరుకుంది. దీనికి తోడు గత నెల 26న నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయడంతో రైతులు మరింత బిజీగా మారారు. సాగర్ నుంచి ఎడమ కాల్వకు మొదటి జోన్ పరిధిలోని పాలేరు వరకు ఏడు విడతలుగా 66 రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నారు. వ్యవసాయ పనుల్లో భాగంగా పొలం దమ్ము చేసి, వరం గట్లను సరి చేయడంతో పాటు కరిగట్టు పనులు, నాట్లు వేయడం చేస్తున్నారు. యాసంగికి సాగు నీరు వస్తుందన్న ముందస్తు అంచనాతో పలు చోట్ల రైతులు బోర్ల కింద నారు పెంచుకున్నారు. ఇప్పుటు నీటి విడుదల కావడంతో పనుల్లో వేగం పెంచారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో యాసంగి సాగు సాధారణ విస్తీర్ణం 1.45 లక్షల హెక్టార్లు కాగా బోర్లు, బావుల కింద 44 వేల హెక్టార్లలో సాగు ప్రారంభమై నాట్ల దశలో ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

వారబందీ పద్ధతిలో నీటి విడుదల

నాగార్జున సాగర్ నుంచి ఎడమ కాల్వకు వారబందీ పద్ధతిలో ఏడు విడతలుగా నీరు విడుదల కానుంది.



గోగువారిగూడెంలో నాట్లు వేస్తున్న మహిళలు

- వారబందీ పద్ధతిలో 66 రోజులు సాగర్ నీటి విడుదల
- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

ఈ విధానంలో కొన్ని రోజుల పాటు నీటిని విడుదల చేసి, మరికొన్ని రోజులు విడుదల ఆపేస్తారు. ఇందులో మొదటి విడతలో డిసెంబర్ 26న ప్రారంభమైంది. ఈ విడుదల ఈ నెల 9వ తేదీ వరకు 15 రోజులు సాగనుంది. తర్వాత 17వ తేదీ నుంచి 25 వరకు, ఫిబ్రవరి 2 నుంచి 10 వరకు, 18 నుంచి 26 . మార్చి 6 నుంచి 14 వరకు, 22 నుంచి 30 వరకు, ఏప్రిల్ 4 నుంచి 9 వరకు నీరు విడుదల కానుంది.

రైతులంతా బీజీ అయిండ్రు

మాకు సాగర్ కెనాల్ కింద పొలం ఉన్నది. ఇంతకు ముందే నార్లు పెంచినం. ఇప్పుడు నీళ్లు ఇయ్యంగనే కరిగట్టు చేసినం. పొలం నాటు మొదలైంది. నీళ్లు విడుదల అవుతుండటంతో ఊళ్ల రైతులందరూ పొలం పనులల్ల బిజీ అయిండ్రు.

- వెంకటయ్య, తడకమళ్ల

నీటిని సద్వినియోగం చేసుకోవాలి

నాగార్జున సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మొదటి జోన్ వరకు పంటల సాగుకు 22.90 టీఎంసీల నీటిని కేటాయించాం. గత నెల 26న నీటిని విడుదల చేసినం. ఏప్రిల్ 9 వరకు నీటి విడుదల ఉంటుంది.

- వర్కాల నర్సింహ, నాగార్జునసాగర్

ఎంఆర్ఎఫ్ ఎన్నికల్లో కేపీఎస్ విజయం

సంగారెడ్డి, వెలుగు: ఎంఆర్ఎఫ్ కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మిక పోరాట సమితి (కేపీఎస్) ప్యానల్ ఘన విజయం సాధించింది. జిల్లాలోని సదాశివపేట సమీపంలో గల ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో బుధవారం కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు జరిగాయి. ఇందులో టీఎంఎస్, బీఎంఎస్, కేపీఎస్ కార్మిక సంఘాలు పోటీ పడగా.. కేపీఎస్ గెలుపొందింది. బీఎంఎస్ రెండో స్థానంలో, టీఎంఎస్ మూడో స్థానంలో నిలిచాయి. డీఎఫ్ఎల్, జేపీఎల్ పర్యవేక్షణలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించారు. 1,788 ఓట్లకు 1,772 మంది పర్మినెంట్ కార్మికులు తమ ఓటేశారు. కేపీఎస్‌కు 821 ఓట్లు పోలవ్వగా, బీఎంఎస్‌కు 500, టీఎంఎస్‌కు 451 ఓట్లు పోలయ్యాయి. టీఎంఎస్ తరపున దేవేందర్‌రెడ్డి, బీఎంఎస్ నుంచి సుంకరి మల్లేశం నిలబడ్డారు. కేపీఎస్‌ను సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ బలపర్చడంతో యూనియన్ అధ్యక్షునిగా చుక్క రాములు, ప్రధాన కార్యదర్శిగా కొత్తగొల్ల చంద్రశేఖర్‌లు విజయం సాధించారు. కాగా, టీఆర్ఎస్ మద్దతిచ్చిన టీఎంఎస్ కాకుండా స్థానిక ఎమ్మెల్యే జగ్గారెడ్డి బలపర్చిన కేపీఎస్ గెలువడం గమనార్హం.

వేతన సవరణలో వేగం పెంచాలి

- తెలంగాణ ఉద్యోగ సంఘం డిమాండ్
- నేడు పీఆర్సీ కమిషనర్‌ను కలవనున్న నేతలు

హైదరాబాద్, వెలుగు: వేతన సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగుల సంఘం నేతలు పీఆర్సీ కమిటీని కలవనున్నారు. గురువారం పీఆర్సీ కమిటీ చైర్మన్ సీఆర్ బిశ్వాల్‌ను సంఘం ప్రెసిడెంట్ పద్మాచారి నేతృత్వంలోని నేతలు, వివిధ శాఖల ఉద్యోగులు కలవనున్నారు. నివేదిక రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని వారు కమిషర్‌ను కోరనున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు సంఘం తరుపున పలు డి మాండ్లతో కూడిన వినతి పత్రాన్ని చైర్మన్ కు ఇవ్వనున్నారు.

ఆ మూడు పంచాయతీలు ఎటు?

సంగారెడ్డి, వెలుగు:

- గతంలో పోతిరెడ్డిపాడు, చింతలపల్లి, హోతి (బి) గ్రామాలు మున్సిపాలిటీలోకి..
- కోర్టుకెళ్లడంతో స్టే
- ఎన్నికల షెడ్యూల్‌లో లేని పేర్లు

జిల్లాలోని ఆ మూడు పంచాయతీలను గతంలో మున్సిపాలిటీల్లో కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అయితే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాల నేతలు కోర్డుకు వెళ్లడంతో తాత్కాలిక పంచాయతీలుగా స్టే ఇచ్చింది. అయితే రాష్ట ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసిన పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌లో వాటి పేరు లేదు. దీంతో ఆ పంచాయతీల పరిస్థితి సందిగ్ధంలో పడింది. సంగారెడ్డి మండలంలోని పోతిరెడ్డిపల్లి, చింతలపల్లి, జహీరాబాద్ మండలంలోని హోతి (బి) గ్రామాలు ఆగస్టు రెండవ తేదీ నుంచి మున్సిపాలిటీలలో కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ గ్రామాల మాజీ సర్పంచ్‌లు సెప్టెంబర్‌లో కోర్టును ఆశ్రయించారు. పరిశీలించిన కోర్డు తాత్కాలిక పంచాయతీలుగా గుర్తిస్తూ స్టే ఇచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. తాజాగా ఎన్నికల సంఘం విడుదల చేసిన పంచాయతీ షెడ్యూల్‌లో ఈ గ్రామాల పేర్లు లేవు. ఎన్నికలు జరగని జాబితాలోనూ లేవు. మున్సిపాలిటీలో లేక, పంచాయతీలుగా మారక రెంటికి చెడ్డ రేవడిలా అయ్యాయి. కోర్టు తుది నిర్ణయం చెప్పే వరకు పరిస్థితి ఇలాగే ఉండొచ్చని అధికారులు అంటున్నారు.



పోతిరెడ్డిపల్లి చౌరస్తా

ఐదు దేశాలకు టిటా అధ్యక్షుల ఎన్నిక

హైదరాబాద్, వెలుగు: తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా) 5 దేశాల అధ్యక్ష, కార్యదర్శులను రిటర్నింగ్ అధికారి సి. విఠల్ బుధవారం ప్రకటించారు. ఫ్రాన్స్ టిటా అధ్యక్షుడిగా శివానంద కొండిన్య, సింగపూర్ అధ్యక్షుడిగా కళా సంతోష్‌రెడ్డి, యూఏఈ అధ్యక్షుడిగా అల్లూరి నరేష్, ఉరుగ్వే అధ్యక్షుడిగా నిరంజన్ బైరబోయిన, మెక్సికో అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారని వెల్లడించారు. అమెరికా టీటా కార్యదర్శిగా మనోజ్ తాటికొండ, సంయుక్త కార్యదర్శిగా సంతోష్ ఎన్నికయ్యారన్నారు. వీరంతా 2022 వరకు పదవుల్లో ఉంటారని తెలిపారు.



వనపర్తి మార్కెట్‌కు భారీగా వచ్చిన వేరుశనగ

పల్లికి మస్తు డిమాండ్

- వనపర్తి మార్కెట్‌లో రాసులు
- క్వింటాల్‌కు రూ. 4 వేలకు పైగా ధర


వనపర్తి, వెలుగు: వనపర్తి మార్కెట్‌కు పల్లికాయ పోటెత్తుతున్నది. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో పాటు సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తూ సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహిస్తుండడంతో ఈ యేడు పంట దిగుబడి పెరిగింది. ఈ యేడు జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా వేరుశనగను సాగు చేశారు. ఇంత పెద్దమొత్తంగా సాగు చేయడం ఓ రికార్డుగా వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో ఎప్పుడూ ఇంత విస్తీర్ణంలో వేరుశనగను వేయలేదని, దిగుబడీ బాగా వస్తోందని చెప్పారు.

మేలు రకానికి మరో రూ.500 ఎక్కువ

వనపర్తి వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ క్వింటాల్‌కు రూ. 4000 వరకు ధర పలుకుతున్నది. మేలు రకమైతే మరో రూ. 500కు ఎక్కువ అమ్ముడుపోతున్నది. ఇక్కడి వేరుశనగలో నూనెశాతం అధికంగా ఉంటుండటంతో మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వర్షాధారంగా పండించినా మంచి దిగుబడి వస్తుండడంతో రాయలసీమకు చెందిన రైతులు విత్తనాలుగా కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. రెండు విధాలుగా డిమాండ్ ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమకు బాగానే గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు.

ఓపెన్ పేజ్

ఒకప్పుడు సిద్ధాంతాలకు కట్టుబడి తమిళ రాజకీయాలు సాగేవి. అన్నాదురై, ఎంజీఆర్ కన్నుమూతతో తమిళనాడులో సిద్ధాంత పోరాటాలు సన్నగిల్లాయి. కరుణానిధి తుదివరకు పెరియార్ ద్రవిడ ఉద్యమానికి పెద్ద దిక్కుగా ఉండే ప్రయత్నం చేశారు. జయలలిత ఈ ఉద్యమానికి సంబంధం లేకుండా ఎంజీఆర్ నీడలో ఫేస్‌వ్యాల్యూతో ఎదిగిన నాయకురాలు. ఇప్పుడు వాళ్లెవ్వరూ లేరు. ఈ పొలిటికల్ గ్యాప్‌లో 'లక్' పరీక్షించుకోవాలని చాలామంది ట్రై చేస్తున్నారు.



తలైవర్‌లు లేని తమిళ రాజకీయాలు!

పెద్ద తలకాయ ఉన్నంతవరకే ఐక్యత. ఆ తర్వాత కుమ్ములాడుకోవడం కామన్. తమిళనాడులో ఇకమీదట జరుగుతున్నది అదే. డీఎంకె అధినేత కరుణానిధి కన్నుమూయగానే పెద్ద కుమారుడు అళగిరి తన సొంత తమ్ముడు స్టాలిన్‌కి దూరమయ్యారు. కరుణానిధి బతికుండగానే దక్షిణ తమిళనాడులో చాలా జిల్లాల సెక్రటరీల్ని స్టాలిన్ మార్చేశారు. చాలా నియోజకవర్గాలలో ఎగ్జిక్యూటివ్ కమిటీలను కొత్త సభ్యులతో నింపేశారు. వీరిద్దరి నడుమ వైరం కరుణానిధి బతికున్న రోజుల్లోనే మొదలైంది. ఒక సర్వే ప్రకారం స్టాలిన్ వెనుక పార్టీ శ్రేణులు 70 శాతం ఉన్నట్లుగా తేలింది. అయితే, ఇంతకాలం గుంభనంగా ఉన్న అళగిరి ఇప్పుడు పురి విప్పి, సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో సన్నిహితం కావడానికి ప్రయత్నిస్తున్నారు. అళగిరి రాసుకుపూసుకు తిరగడం మొదలెట్టేసరికి స్టాలిన్ తేరుకున్నారు. రజనీకాంత్‌ని ప్రత్యేకంగా కరుణానిధి విగ్రహం ఆవిష్కరణకు పిలిచి, వేదికపై నిలబెట్టారు. గతంలో ఇదే స్టాలిన్ సూపర్‌స్టార్‌ని తిట్టిపోశారు. 'రజనీకాంత్ ద్రవిడ ఉద్యమ వినాశకుడు' అన్నారు. 'కొన్ని శక్తులు తమిళనాట ద్రవిడ పార్టీని నాశనం చేయడానికి రజనీని వాడుకోవాలని చూస్తున్నాయి. అది ఎన్నటికీ జరగని పని' అని స్టాలిన్ అప్పట్లో తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పారు.

పైకి ఎన్ని మాటలాడినా తమిళనాడులో ప్రస్తుతం రాజకీయ అగాధం ఏర్పడింది. అధికార అన్నాడీఎంకెకి, ప్రతిపక్ష డీఎంకెకి పెద్ద దిక్కంటూ ఎవరూ లేరు. జయలలిత వారసత్వంకోసం ఇప్పటికీ పన్నీరు సెల్వం -పళని స్వామి వర్గం, శశికళ వర్గం కుమ్ములాడుకుంటున్నాయి. కరుణానిధి వారసత్వంకోసం అళగిరి, స్టాలిన్, కనిమొళి మూడు ముక్కలాట ఆడుతున్నారు. వీరి మధ్యలో మారన్ సోదరులు దయానిధి, కళానిధి తచ్చాడుతున్నారు. అసెంబ్లీలో 18 మంది ఎమ్మెల్యేల్ని స్పీకర్ అనర్హులుగా ప్రకటించడంతో అవి ఖాళీలేర్పడ్డాయి. ఆ తర్వాత కరుణానిధి (తిరువారూర్), ఎ.కె.బోస్ (తిరుప్పరకుండ్రం) చనిపోవడంతో వాటికికూడా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే, ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించిన వివాదం కోర్టులో ఉండడంతో వాటి జోలికి పోకుండా కేవలం తిరువారూర్ స్థానానికి మాత్రమే ఉప ఎన్నికను ఈ నెల 28న జరపాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎవరెవరి సత్తా ఏమిటో, రాజకీయ పందెంలో ఎవరు ముందంజ వేయగలరో ఓసారి పరికిద్దాం.

జాతీయ పార్టీలు


తమిళనాడు ఓటర్లు దాదాపుగా నలభై ఏళ్ల క్రితమే జాతీయ పార్టీల్ని గెంటేశారు. కరుణానిధి, ఎంజీఆర్ ద్రవిడ ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకెళ్లి హిందీ వ్యతిరేక రాజకీయాల్లో భాగంగా జాతీయ పార్టీలనుకూడా నామమాత్రంగా మిగిల్చారు. కాంగ్రెస్ పార్టీకి జి.కె.మూపనార్ తర్వాత చెప్పుకోదగ్గ నాయకుడే లేడు. భవిష్యత్తులో మరొకరు తయారవుతారన్న నమ్మకం కూడా లేదు. బీజేపీదికూడా ఇదే పరిస్థితి. కాంగ్రెస్, బీజేపీ తప్పనిసరిగా ఏదో ఒక ద్రవిడ పార్టీతో ఫ్రంట్ కట్టక తప్పదు. బీజేపీకి ప్రస్తుతం తమిళనాడులో కన్యాకుమారి నుంచి ఒక ఎంపీ ఉన్నారు. ఆ ఒక్క స్థానాన్ని మళ్లీ దక్కించుకోగలిగితే చాలా అద్భుతం జరిగినట్లే. ఉభయ కమ్యూనిస్టులు గతంలో డీఎంకె, అన్నాడీఎంకెలతో జతకట్టి అయిదు సీట్లను దక్కించుకునేవి. తాజా పరిస్థితుల్లో కమల్‌హాసన్‌వైపు చూస్తున్నాయి. ఇప్పటికిప్పుడు జాతీయ పార్టీలలో ఏ ఒక్కదానినీ ఆదరించే స్థితిలో తమిళ ప్రజానీకం లేదనిమాత్రం స్పష్టంగా తెలుస్తోంది.

అంబుమణి రామదాసు (పిఎంకె) :



యుపిఏ హయాంలో ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన అంబుమణికి యువత ఫాలోయింగ్ బాగా ఉంది. అప్పట్లో ఆయన తీసుకున్న నిర్ణయాల ఫలితమే 108 అంబులెన్స్‌లు. ధూమపానంపై అంబుమణి కఠినంగా వ్యవహరించారు. సిగరెట్ డబ్బాలపై హెచ్చరికల ముద్రణ, రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు తదితర బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడాన్ని నిషేధించిన ఘనత డాక్టర్ అంబుమణిదే. అయితే, ప్రజాభిమానాన్ని ఓట్లుగా మలచుకునే వ్యూహ రచన ఆయనలో లేదంటారు. పార్టీ ఉద్దేశాన్ని జనంలోకి బలంగా తీసుకెళ్లగలిగితేనే అంబుమణికి భవిష్యత్తు ఉంటుంది.

రజనీకాంత్ :



రాజకీయాల్లో రాణించడానికి కావలసినవి నిలకడ, దూకుడు. ఈ రెండు భిన్న కోణాలే. వీటికి ఆమడదూరంలో ఉంటారు రజనీ. దాదాపు పదేళ్లకు పైగా సరైన హిట్‌లేని ఈ సూపర్‌స్టార్ ప్రస్తుతం సోషల్‌మీడియా హైప్‌తో నెట్టుకొస్తున్నారు. జన్మత మహారాష్ట్రియన్ అయిన రజనీకాంత్ ద్రవిడ పార్టీల మధ్య నిలదొక్కుకోవాలంటే ఫుల్‌టైమ్ పొలిటీషియన్‌గా మారక తప్పదు. అయితే, రజనీకి ఫేస్‌వాల్యూ తప్ప, పొలిటికల్ థాట్స్ అంతంత మాత్రమే.

కమల్ హాసన్ (ఎంఎన్‌ఎం) :



రజనీలాగే కమల్‌కూడా వెటరన్ యాక్టర్ల జాబితాలో చేరిపోయారు. వీళ్లిద్దరూ 'ఏమో గుర్రమెగరా వచ్చు' అనే ఆశతో రాజకీయాల్లోకి ప్రవేశించారని, రాజకీయ చర్చలను ఎదుర్కొనే సత్తా లేదని తేలిపోయింది. లెఫ్ట్ ఐడియాలజీ, నాస్తికత్వం వంటివి కమల్‌కి ప్లస్ పాయింట్లు. అయితే, ద్రవిడ ఉద్యమానికి, బడుగు బలహీనవర్గాలకు ఆయన సామాజిక వర్గమైన అయ్యంగార్లు వ్యతిరేకం అని కూడా సామాజికవేత్తలు గుర్తు చేస్తున్నారు. యువతరాన్ని ఆకట్టుకునే సినిమాలేవీ వీళ్లు ఈ మధ్యకాలంలో చేయలేదు.

స్టాలిన్(డిఎంకె) :



కరుణానిధి తాను బతికుండగానే డీఎంకె ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా స్టాలిన్‌కి బాధ్యతలు అప్పగించేశారు. యాభై ఏళ్లుగా తండ్రి నిలబెట్టుకుంటూ వచ్చిన పార్టీని నడపాల్సిన బాధ్యత స్టాలిన్‌పైనే ఉంది. ఆయన ముందున్న పెద్ద సవాల్ జనరల్ ఎలక్షన్లు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో ప్రతి చిన్న వ్యవహారంలోనూ తలదూర్చకుండా, పార్టీ పరంగా సరైన పాత్ర పోషించేలా జాగ్రత్త తీసుకుంటున్నారు. తాజాగా కరుణానిధి మరణంతో ఖాళీ అయిన తిరువారూర్ ఎమ్మెల్యే స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. ఇక్కడ పోటీ గరంగరంగా ఉండనుంది. ఇక, డీఎంకె యూత్ వింగ్‌లో స్టాలిన్ కొడుకు, సినీ నటుడు ఉదయనిధి చురుకుగా ఉన్నారు.

పళని–పన్నీర్ (అన్నాడిఎంకె) :



ఈ ఇద్దరు మిత్రులకు ఇదే ఆఖరి అవకాశంగా చెప్పుకుంటున్నారు. వీరి నాయకత్వంలో అన్నాడీఎంకె పూర్వ వైభవాన్ని సాధించడం అసాధ్యమని సమాచారం. ఎంజీఆర్, జయలలితల ఏలుబడిని, పార్టీ ఆధిపత్యాన్ని చూసిన తమిళ ప్రజానీకం... ప్రస్తుతం పళనిస్వామి ప్రభుత్వంపై పెదవి విరుస్తున్నారు. పార్టీ నిర్వహణలో పన్నీర్‌సెల్వం పాత్రపై ఇప్పటికే అసంతృప్తి ఉంది. అన్నిటికంటే ముఖ్యంగా పళని -పన్నీరు కేంద్ర సర్కారు చేతిలో కీలుబొమ్మలుగా నడుచుకుంటున్నారని జనం భావిస్తున్నారు. పార్టీలకతీతంగా ఢిల్లీ పాలిటిక్స్‌ని ఢీకొట్టడంలో తమిళ నాయకులది తిరుగులేని రికార్డు. అలాంటిది బీజేపీ అడుగులకు మడుగులొత్తుతున్నారనే ఆక్షేపణ ఉంది.

టి.టి.వి.దినకరన్ (అన్నా డీఎంకె–అమ్మ) :



శశికళ మేనల్లుడిగా దినకరన్ తమిళ రాజకీయాల్లో చక్రం తిప్పిన వ్యక్తి. జయలలిత హయాంలో 1999-2010 నడుమ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నారు. పెరియాకుళం నుంచి లోక్‌సభకు, ఆ తర్వాత రాజ్యసభకు పంపించి జయ ప్రోత్సహించారు. ఓట్ల రాజకీయాల్లో బాగా ఆరితేరారు. జయ కన్నుమూశాక జరిగిన పార్టీ కుమ్ములాటల్లో శశికళ వర్గం ఒంటరిదైనప్పటికీ దినకరన్ బలంగా నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నారు. ఆర్.కె.నగర్ ఉప ఎన్నికలో బ్రహ్మాండమైన మెజారిటీ సాధించి తానే అమ్మ (జయ) వారసుడిగా చెప్పుకునే అవకాశాన్ని దక్కించుకున్నారు.


ఏమన్నారంటే



ఖాదర్ హ్యూమనిస్టు

ఖాదర్ ఖాన్ హ్యూమరిస్టు మాత్రమే కాదు, మంచి హ్యూమనిస్టు. ఆయన మా యోగ పీఠంలో చికిత్స చేయించుకున్నారు.

– బాలకృష్ణ, పతంజలి యోగ పీఠం



కొత్తగా పాడతాం

మా ప్రభుత్వం వందేమాతర గీతం ఆలపించడాన్ని ఆపేయలేదు. సరి కొత్త పద్ధతిలో ప్రవేశపెడతాం.

– కమల్‌నాథ్, ఎంపీ ముఖ్యమంత్రి



అయ్యప్ప అందరివాడు

శబరిమలలో ఆడవాళ్లు అయ్యప్పను దర్శించుకోవడం విశేషం. వారికి హక్కు ఉంది. అయ్యప్ప అందరి దైవం.


– ఉదిత్ రాజ్, బీజేపీ ఎంపీ



ఆవుల పన్ను అన్యాయం

గోవుల సంరక్షణకోసం ఎక్సైజ్ సెస్ వేయడం అన్యాయం. గోవుల కోసం యోగి ప్రభుత్వం ఏమీ చేయలేక ఫెయిలైంది.

– అంశు, యూపీ సీసీ అధికార ప్రతినిధి



పాక్ ట్రైనింగ్ ఆగలేదు


ఇండియా మీద సముద్ర దాడి ప్రమాదం ఉంది. సముందరీ జీహద్' కోసం మిలిటెంట్లకు పాక్ ట్రైనింగ్ ఇస్తూనే ఉంది.

– హంసరాజ్ అహిర్, కేంద్ర మంత్రి

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా...

మహిళా రివల్యూషనరీ సావిత్రి

నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను కూల్చడానికి స్వేచ్ఛా, సమానత్వం, సోదరభావం, సమన్యాయం అనే విలువలే పునాదులుగా సిద్ధాంతాలు రూపొందించిన మేధావి మహాత్మ జ్యోతిరావు పూలే. తాను రాసిన 'గులాంగిరి' పుస్తకంతో ఇండియాలోని చీకటి బతుకుల్ని ప్రపంచం ముందుంచాడు. ఆయన జీవిత, విప్లవ భాగస్వామి సావిత్రిబాయి పూలే. దేశంలో తొలి మహిళా సంఘాన్ని సావిత్రిబాయి స్థాపించారు. వేల ఏళ్లపాటు చదువుకు దూరమైన బడుగు బలహీనులు, మహిళలకు విద్యను బోధించడం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టిన ధీర వనిత సావిత్రిబాయి.



ఈ దేశంలోస్త్రీ విద్య, అభ్యున్నతి గురించి మాట్లాడేటప్పుడు మొట్టమొదట తలచుకోవలసిన పేరు సావిత్రిబాయి పూలే. ఆమె 1831, జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాల తాలూకా నైగాల్ గ్రామంలో జన్మించారు. 1840లో తొమ్మిదేళ్ల వయసులోనే జోతిబా పూలేతో ఆమె వివాహం జరిగింది. విద్య ద్వారానే నిమ్నకులాలు, స్త్రీలకు విముక్తి సాధ్యపడుతుందని పూలే చెప్పిన మాటలతో సావిత్రిబాయి చదువు నేర్చుకున్నారు. అహ్మద్ నగర్‌లో టీచర్‌గా ట్రైనింగ్ పూర్తి చేసి, 1848 లో భర్తతో కలిసి నిమ్న కులాల బాలికలకోసం పుణేలో మొదటి పాఠశాల ఆరంభించారు. ఇది నచ్చని కొందరు సంప్రదాయికవాదులు ఆమె స్కూల్‌కు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు పేడనీళ్లు, మురికినీళ్లు చల్లి అవమానించేవాళ్లు. కొన్నిసార్లు రాళ్లతోనూ దాడి చేసేవాళ్లు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సావిత్రిబాయి ధైర్యంగా ముందుకెళ్లారు. అవమానాలు ఎదుర్కొంటూనే గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను విస్తరించారు. సావిత్రిబాయి-జ్యోతిరావు పూలే దంపతులు తమ జీవితకాలంలో మొత్తం 52 స్కూళ్లను ప్రారంభించారు.

సామాజిక ఉద్యమంలో భాగంగా మహిళల్ని సంఘటితం చేసే బాధ్యతను సావిత్రిబాయి తీసుకున్నారు. 1852లో 'మహిళా సేవామండల్' పేరుతో సంఘాన్ని స్థాపించారు. దేశంలోనే మొదటి మహిళా సంఘం అది. అణచివేతకు వ్యతిరేకంగా మహిళా సాధికారత కోసం పనిచేసిందా సంస్థ. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా, వితంతువు పునర్వివాహాలకు అనుకూలంగా ప్రచారం నిర్వహించారు. చిన్నతనంలోనే భర్తల్ని కోల్పోయి, ఇంట్లోవాళ్ల ఆదరణకు నోచుకోని ఎంతో మంది మహిళల్ని చేరదీశారు. 1873 సెప్టెంబరు 24న జ్యోతిరావు పూలే 'సత్యశోధక్ సమాజ్'ను స్థాపించారు. ఈ సమాజ్ మహిళా విభాగం సావిత్రిబాయి నేతృత్వంలో నడిచేది. పురోహితులు లేకుండా వివాహాలు నిర్వహించే విధానాన్ని మొదలుపెట్టింది ఈ సంస్థే.

దేశంలో కరువు కాటకాలు ఏర్పడిన ప్రతిసారి పూలే దంపతులు బాధితులకు అండగా నిలబడ్డారు. సాహిత్యం ద్వారాకూడా సావిత్రి తన సంస్కరణ భావాలను ప్రచారం చేశారు. కవితలను, వ్యాసాలను, లేఖలను 'కావ్య పూలే', 'సుబోధ్ రత్నాకర్' అనే గ్రంథాలలో ప్రచురించారు. తన రచనల ద్వారా ఆధిపత్య వర్గాల కుట్రను పటాపంచలు చేసి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించారు. 'రాయికి కుంకుమ పెట్టి, నూనెలో ముంచి, దేనినైతే దేవత అంటున్నారో, నిజానికది రాయే కదా' అంటూ... 'రాళ్ళకు మొక్కితే పిల్లలు పుడితే, మరి అకారణంగా స్త్రీ, పురుషులు పెళ్ళెందుకు చేసుకుంటారు!' అని ప్రశ్నించారు. అమ్మ గురించి రాస్తూ.. 'ఆమె ముందు సముద్రం కూడా చిన్నబోతుంది, ఆమె ముందు ఆకాశం కూడాతలదించుకుంటుంది' అని ఆత్మీయంగా రాశారు. అజ్ఞానాన్ని ఆమె దుష్ట శత్రువుగా చెప్పారు. 'శత్రువొక్కటి మనందరికి, దానిని తరిమికొడదాం. ఆ దుష్ట శత్రువు పేరు అజ్ఞానం, దాని గొంతు పిసికి జీవితం నుండి పారద్రోలుదాం' అని చైతన్య గీతికలు రాశారు. మనిషి ఎలా వ్యవహరించాలో వ్యంగ్య కవితలో చెబుతూ... 'విద్య లేదు, జ్ఞానం లేదు, చేతులు ముడుచుకొని కూర్చుంటారు, ఆలోచన లేదు, ఆచరణ లేదు, జ్యోతిష్యం, పంచాంగం చుట్టూ తిరుగుతారు. బానిసత్వం గురించి బాధపడని వారు అభివృద్ధి సంకల్పం లేని వారు, మానవత్వాన్ని అణగద్రొక్కేవారు వారిని మనుషులని ఎలా అనను' అన్నారు. సావిత్రిబాయి నవ్య మానవునికి ఉండాల్సిన లక్షణాలను తన వ్యంగ్య కవితలో వ్యక్తం చేశారు.

1890లో పూలే మరణం తర్వాత ఆయన సామాజిక చైతన్య ఆశయ సాధనకోసం పాటుపడ్డారు. 1896లో మహారాష్ట్రలో కరువు వచ్చినప్పుడు ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు జరిపించడంలో ఆమె విశేష కృషి చేశారు. విద్యా సంస్థలలో చదువుకునే పిల్లలను 'ఈ పిల్లలే ఈ దేశానికి ఆస్తి, ఈ దేశ ఆస్తులే నా ఆస్తి' అని కరువు కోరల నుండి పిల్లలను కాపాడుకున్నారు. ఆమె చూపిన బాట నేటికీ మార్గదర్శకమే!



– చింత సదానందం స్వేరో, స్వేరో సాంస్కృతిక విభాగం

ఇరాక్ నియంత సద్దాం హుస్సేన్ ఎలాగైతే 'ఇరాన్ వ్యతిరేక వైఖరి'తో అమెరికాకు దగ్గరయ్యాడో, ఇప్పుడు సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) అదే బాటలో నడుస్తున్నాడు. వీళ్లద్దరికీ చిన్న వయసులోనే అంతులేని అధికారాలు చేతికందాయి. సొంత జనంపైనే కత్తిదూసే స్వభావం అలవడింది. సౌదీలో జరుగుతున్న వరుస హత్యాకాండలు ఎంబీఎస్‌ను 'ఆధునిక సద్దాం'గా అభివర్ణించేలా చేశాయి.



నయా సద్దాం ఎంబీఎస్

పశ్చిమాసియాలో నెత్తుటి ప్రవాహం ఇప్పట్లో ఆగేలా లేదు. మిగతా ప్రపంచమంతా డెమోక్రసీ దశల్ని దాటుకుంటూ పోతుంటే, గల్ఫ్ దేశాల్లో మాత్రం రాచరిక, నియంతృత్వ వ్యవస్థలు నానాటికీ బలపడుతున్నాయి. రాజుల్ని, యువరాజుల్ని పల్లెత్తు మాటన్నా పట్టపగలే హత్యలు జరిగిపోతున్నాయి. భూగోళంపై హ్యూమన్ రైట్స్ పరిరక్షణ పేటెంట్ తమదేనని చెప్పుకునే అగ్రదేశాలు.. వీళ్ల దగ్గరికి వచ్చేసరికి మాత్రం దోస్తీ ఆఫర్ చేస్తాయి. కారణం చాలా సింపుల్... (ఆయుధాల) వ్యాపారం! అఫ్‌కోర్స్, వ్యాపార అవసరాలు తీరగానే సంక్షోభాలు, అంతర్యుద్ధాలు సృష్టించడం అమెరికా పెద్దన్నకు వెన్నతో పెట్టిన విద్యే.

జర్నలిస్ట్ జమాల్ ఖషోగీ హత్యోదంతంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ వ్యవహారశైలి తీవ్ర విమర్శల పాలైంది. ఇస్తాంబుల్ (టర్కీ)లోని సౌదీ రాయబార కార్యాలయంలో పట్టపగలు చోటుచేసుకున్న హత్య దాదాపు ప్రపంచాన్ని కుదిపేసింది. సౌదీ జాతీయుడే అయినా, అమెరికాలో ప్రవాసం గడుపుతూ వాషింగ్టన్ పోస్ట్ పత్రికలో కాలమిస్టుగా పనిచేసిన ఖషోగీ... ఎంబీఎస్ తీరుపై చాలా విమర్శతో వ్యాసాలు రాశారు. ఖషోగీ రాతలు పాశ్చాత్య దేశాల్లో తన ఇమేజ్‌ని తగ్గిస్తున్నట్లు ఎంబీఎస్ భావించాడు. ఏకంగా మనుషుల్ని పెట్టి ఖషోగీని తన ఎంబసీలోనే చంపించాడు. జర్నలిస్టు హత్యాకాండను ఖండించిన అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ ఒక దశలో సౌదీపై చర్యలు తప్పవని హెచ్చరించినా, చివరికి మెత్తబడి క్రౌన్ ప్రిన్స్‌ని వెనకేసుకొచ్చారు. అమెరికన్ కార్పొరేట్ కంపెనీలు మాత్రం 'దావోస్ ఇన్ డెజర్ట్'వాణిజ్య సదస్సును బహిష్కరించేసరికి ఎంబీఎస్‌కు గట్టి షాక్ తగిలింది. గతంలో సద్దాం హుసేన్ చేసినవి కిరాతకాలే అయినప్పటికీ వెస్ట్రన్ కంట్రీస్‌లో తన ఇమేజ్‌కు భంగం వాటిల్లకుండాప్రయత్నించేవాడు. దాంతో ఫారిన్ మీడియా ఒకప్పుడు సద్దాంను సమర్థించినట్లే, ప్రస్తుతం ఎంబీఎస్‌నూ ఆకాశానికెత్తే పనిలో బిజీగా ఉంది.

2017లో క్రౌన్ ప్రిన్స్ (కాబోయే మహారాజు)గా బాధ్యతలు చేపట్టిన తర్వాతి క్షణం నుంచే ఎంబీఎస్ దుర్మారంగా తయారయ్యాడు. దేశంలో తనకు పోటీ లేదా శత్రువులు అనుకున్న ఒక్కొక్కరినీ జైళ్లలో పడేసి టార్చర్ చేశాడు. పైకి మాత్రం తనను తాను సంస్కరణవాదిగా చెప్పుకున్నాడు. ఆ మేరకు విదేశీ మీడియా ఎంబీఎస్‌కు కావాల్సినంత ప్రచారం కల్పించింది. 1979లో ఇరాక్‌లోనూ సరిగ్గా ఇలానే జరిగింది. 1979, జూలై 16న ఇరాక్ పగ్గాలు చేపట్టిన సద్దాం హుస్సేన్... అధికారంలోకి వస్తూనే అసమ్మతిదారులపై ఉక్కుపాదం మోపాడు. ప్రతిపక్ష పార్టీల నాయకులను, వాళ్ల కుటుంబీకులను ఒక్కొక్కరిగా అంతం చేశాడు. సద్దాం పోకడల్ని ఎండగట్టిన ఇరాకీ షియా పండితుడు హదీ అల్ మొదరసీ.. తన కుటుంబంలో 17 మందిని పోగొట్టుకోవాల్సి వచ్చింది. హత్యలు చేయించడంలోనూ సద్దాం స్టయిల్‌నే ఫాలో అవుతున్నాడు సౌదీ ప్రిన్స్ ఎంబీఎస్. 2018, అక్టోబర్ 2న ఇస్తాంబుల్‌లోని సౌదీ అరేబియా కాన్సలేట్‌లో జర్నలిస్ట్ ఖషోగీ హత్యకు గురయ్యారు. ఖషోగీ చనిపోయిన నెల్లాళ్లకే అజీజ్ అల్ జషార్ అనే మరో ప్రముఖ జర్నలిస్టుకూడా హత్యకు గురయ్యాడు. ప్రపంచం దృష్టికి వచ్చాయి కాబట్టి కొన్ని వార్తలు చర్చనీయాంశమయ్యాయి. నాటి సద్దాం, నేటి ఎంబీఎస్ పాలనలో ఇలాంటి దారుణాలెన్నో గుట్టచప్పుడు కాకుండానే జరిగిపోయాయి.

ఇంత చేసినా వాళ్లిద్దరూ 'ఇరాన్ వ్యతిరేకులు' కాబట్టి వైట్‌హౌస్ దృష్టిలో ప్రియమిత్రులుగా ఉండగలిగారు. మిగతా దేశాలు వాళ్ల జోలికి రాలేవు. అమెరికా నుంచి భారీగా పోగుపడ్డ వార్ వెపన్స్ సద్దాంలో యుద్ధకాంక్షని మరింత పెంచాయి. 1990లోసద్దాం కువైట్‌పై ఆక్రమణకు దిగాడు. ఫస్ట్ గల్ఫ్ వార్‌గా పేరుపొందిన నాటి ఘటనతో అప్పటిదాకా మిత్రుడిగా ఉన్న సద్దాం ఒక్కసారే అమెరికాకు శత్రువైపోయాడు. 13 ఏళ్లపాటు ముప్పుతిప్పలు పెట్టించి చివరికి 2003లో సద్దాంని పట్టుకోగలిగింది అమెరికా. హత్యానేరాల కింద 2006లో సద్దాంకు ఉరిశిక్ష పడింది.

ఇప్పటి ఎంబీఎస్ కూడా అమెరికా అందించిన ఆయుధ సంపత్తితోనే యెమెన్‌పై దాడులు కొనసాగిస్తున్నాడు. సద్దాం, ఎంబీఎస్‌లు ఇద్దరివీ ఒకరకమైన మైండ్‌సెట్ అని, అడ్డొచ్చినవాళ్లను అంతం చేసేస్తే సమస్య పరిష్కారమవుతుందనే భ్రమతో ఉన్నారని గల్ఫ్ వ్యవహారాల నిపుణులు చెబుతున్నారు.

ఇరాన్‌కు చెక్ పెట్టడానికే చానాళ్లపాటు సద్దాంని వెనకేసుకొచ్చిన అమెరికా... ఇప్పుడు కూడా అదే కారణంతో ఎంబీఎస్‌కి మద్దతు ఇస్తోంది. సద్దాం శకం 2006తో ముగిసింది. ఎంబీఎస్ వయసు ఇంకా 33 ఏండ్లే. అంటే సుదీర్ఘ కాలంపాటు సౌదీని పరిపాలించబోయేది ఆయనే. 'మోడర్న్ సద్దాం'గా ఎంబీఎస్ సృష్టించబోయే కల్లోలం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తాయో కాలమే నిర్ణయిస్తుంది.

మిస్టర్ మజ్ను రొమాంటిక్ టచ్

"ఒకప్పుడు స్ట్రెస్ లెవల్స్ తగ్గాలంటే చాక్లెట్స్‌తో పనైపోయేది.. కానీ ఇప్పుడు హ్యూమన్ టచ్ కావాల్సిందే'' అంటూ రొమాంటిక్ డైలాగ్స్ చెపుతున్నాడు అఖిల్. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతోన్న 'మిస్టర్ మజ్ను' సినిమాలోని అఖిల్ డైలాగ్ ఇది. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 25న సినిమా విడుదల కానుండగా బుధవారం టీజర్‌ను విడుదల చేశారు. అఖిల్ తొలి రెండు చిత్రాల్లో కనిపించని కొత్త మేజిక్ ఈ సినిమాలో కనిపిస్తోంది. అది మరేదో కాదు.. అక్కినేని ఫ్యామిలీకి అచ్చొచ్చిన రొమాన్స్. ఒకప్పుడు ఏఎన్నార్, ఆ తర్వాత నాగార్జున రొమాంటిక్ ఇమేజ్‌తో మెప్పించారు. అదే ఒరవడిని కొనసాగిస్తూ టీజర్‌లో రొమాన్స్‌తో ఆకట్టుకున్నాడు అఖిల్. అయితే అఖిల్ క్యారెక్టర్‌లోని ఈ రొమాంటిక్ టచ్ నిధితో ప్రేమకథకు అడ్డుపడేలా కనిపిస్తోంది. ఈ మిస్టర్ మజ్ను లవ్ జర్నీలోని చిలిపి అల్లర్లే ఈ సినిమా కథాంశంగా కనిపిస్తోంది. మొత్తానికి టీజర్‌తో ఆకట్టుకున్న అఖిల్.. సినిమా తోనూ ఆ జోష్ కొనసాగిస్తాడేమో చూడాలి!






హిందీలోకి గీత గోవిందం

విజయ్ దేవరకొండ హిందీలో ఎంట్రీ ఇవ్వబోతున్నాడని ఇటీవల వార్తలొస్తున్నాయి. ఆ మాటెలా ఉన్నా విజయ్ నటించిన చిత్రాలు మాత్రం ఒక్కొక్కటిగా హిందీలోకి రీమేక్ అవుతున్నాయి. ఇప్పటికే 'అర్జున్‌రెడ్డి'కి రీమేక్‌గా షాహిద్ కపూర్‌తో 'కబీర్ సింగ్' రూపొందుతోంది. ఇక గత ఏడాది విజయ్‌కు భారీ విజయాన్నిచ్చిన 'గీత గోవిందం' కూడా బాలీవుడ్ రీమేక్‌కు సిద్ధమవుతోంది. ఇటీవల శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్‌తో కలసి 'దఢక్'లో నటించిన ఇషాన్ కట్టర్ రీమేక్‌లో హీరోగా నటించనున్నాడట. మొత్తానికి 'సైరాట్' రీమేక్‌తో గుర్తింపును అందుకున్న ఇషాన్.. తన తదుపరి చిత్రం కూడా రీమేక్‌నే ఎంచుకుంటున్నాడు. అయితే విజయ్ స్థాయిలో ఇషాన్ మెప్పిస్తాడో లేదో చూడాలి!

గల్లీ బోయ్ ఆయా

'టెంపర్' రీమేక్ 'సింబా'తో ఇటీవల మరో మంచి విజయాన్ని అందుకున్న రణవీర్ సింగ్.. త్వరలో 'గల్లీ బోయ్' గా రాబోతున్నాడు. 'అప్నా టైమ్ ఆయేగా' అనేది ట్యాగ్‌లైన్. జోయా అఖ్తర్ దర్శకుడు. రణవీర్, ఆలియా భట్ జంటగా నటిస్తోన్న తొలిచిత్రమిది. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌ను బుధవారం విడుదల చేశారు. ముంబయి మురికివాడకు చెందిన గల్లీ బోయ్‌గా రణవీర్, ముస్లిం యువతిగా ఆలియా కనిపిస్తున్నారు. ఇద్దరు గాయకుల నడుమ సాగే మ్యూజికల్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఫర్హాన్ అఖ్తర్, రితేశ్ సిధ్వానీ, జోయా అఖ్తర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.



జార్జ్‌తో జాక్సన్ ఎంగేజ్‌మెంట్

గ్లామర్ రోల్స్‌కు కేరాఫ్ అడ్రస్ అమీజాక్సన్. సోషల్ మీడియాలో అమీజాక్సన్ పోస్ట్ చేసే ఫోటోలు అభిమానులను ఫిదా చేస్తుంటాయి.అయితే కొత్త సంవత్సరంలో అమీ చేసిన పోస్ట్ అభిమానులకు షాక్ ఇచ్చింది. తానో ఇంటిదాన్ని కాబోతున్నానంటూ పోస్ట్ చేసింది అమీజాక్సన్. గత కొంతకాలంగా బ్రిటన్ బిజినెస్ మ్యాన్ జార్జ్ పనాయొటోతో డేటింగ్ చేస్తోన్న అమీ.. కొత్త సంవత్సర వేడుకలను అతనితో కలసి జాంబియాలో జరుపుకుంది. ఈ సెలబ్రేషన్స్ తమ జీవితంలో గుర్తుండిపోయేలా అదే రోజున ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. "ఈ జనవరి ఒకటిన జీవితంలో ఒక గొప్ప సాహసోపేతమైన ప్రయాణం మొదలుపెట్టాము. నన్నీ ప్రపంచంలో అత్యంత అదృష్టవంతురాలిని చేసినందుకు థాంక్ యు..." అంటూ ఆ ఫోటోలను ఇన్స్టాగ్రమ్‌లో పోస్ట్ చేసింది అమీ జాక్సన్.



యథార్థ సంఘటనల పలాస 1978



యథార్థ సంఘటనల ఆధారంగా తీసే సినిమాలకు ఇటీవల కాలంలో ఆదరణ బాగా పెరుగుతోంది. సక్సెస్ అవుతున్నాయి. అదే కోవలో రూపొందిస్తోన్న మరో సినిమా 'పలాస 1978'. 'లండన్ బాబులు' ఫేం రక్షిత్ హీరోగా, తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో, బిక్రమ్ కృష్ణ ఫిలింస్ పతాకంపై తెరకెక్కుతోంది. అప్పారావు బెల్లన, అట్లూరి వరప్రసాద్ లు నిర్మిస్తోన్న ఈ చిత్రం ద్వారా కరుణ కుమార్ దర్శకుడిగా, నక్షత్ర హీరోయిన్ గా పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాము. ఫిబ్రవరి 9 నుంచి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ లొకేషన్లలో చిత్రీకరించనున్నాము. బెస్ట్ టీమ్ వర్క్ చేస్తున్నారు. రియలిస్టిక్ మూవీగా ఈ చిత్ర ముంటుంది" అన్నారు.

'2.ఓ' విడుదలై ఆరు వారాలు తిరక్కముందే 'పేట' తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు రజనీకాంత్. నవాబ్, సర్కార్ వంటి చిత్రాలను విడుదల చేసిన అశోక్ వల్లభనేని ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 10న వస్తోన్న 'పేట' గురించి అశోక్ వల్లభనేని పాత్రికేయులతో ముచ్చటించారు.

రజనీకాంత్ జీవితమే నాకు స్ఫూర్తి



- మణిరత్నం సినిమా 'నవాబ్'ను సొంతంగా విడుదల చేసి విజయాన్ని అందుకున్నాను. మునుపెన్నడూ లేనట్టుగా విజయ్ సినిమా 'సర్కార్'ను అదే తేదీకే తెలుగులో విడుదల చేశాను. నా కాన్ఫిడెన్స్, ప్రమోషన్ విధానం నచ్చి సన్ నెట్‌వర్క్ వారు 'పేట' హక్కులు ఇచ్చారు. ఫ్యాన్సీ ఆఫర్స్ ఉన్నప్పటికీ కోటిన్నర వరకూ తగ్గించి నాకు ఈ సినిమా హక్కులు ఇచ్చినందుకు వారికి ధన్యవాదాలు.
- దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్.. రజనీకాంత్‌కు వీరాభిమాని. తన ఫేవరేట్ హీరోతో పక్కాగా హిట్ కొట్టాలని ఆయన్ని దృష్టిలో ఉంచుకునే ఈ కథ సిద్ధం చేశారు. వయసులో పాతికేళ్లు వెనక్కు వెళ్లినట్టు ఎనర్జిటిక్‌గా కనిపిస్తున్నారు రజనీకాంత్. ఆయన నడక, స్టైల్ సినిమాకు హైలెట్.
- అనిరుధ్ అందించిన సంగీతానికి తెలుగులోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఈనెల 6న హైదరాబాద్‌లోని జేఆర్‌సి కన్వెన్షన్ సెంటర్‌లో ప్రీ రిలీజ్ వేడుకకు సన్నాహాలు చేస్తున్నాం. రజనీకాంత్ గారితో పాటు యూనిట్ అంతా పాల్గొనబోతున్నారు.
- ఒక సాధారణ బస్ కండక్టర్‌గా జీవితం ప్రారంభించి దక్షిణాది సూపర్‌స్టార్‌గా ఎదిగిన రజనీకాంత్ జీవితం నాకు స్ఫూర్తి. ఆ స్ఫూర్తితోనే ఆయన చిత్రాన్ని విడుదల చేసే స్థాయికి ఎదగగలిగాను.
- రజనీకాంత్ గారి సేవాగుణం నన్నెంతో ఆకర్షించింది. తమిళనాట ఆయనెన్నో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. తెలుగులోనూ ఆయన చేతులమీదుగా సేవా కార్యక్రమాలు నిర్వహింపజేయాలని భావించాను. అందుకే ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో కొన్ని అనాధ ఆశ్రమాలకు ఆయన చేతుల మీదుగా ఆర్థిక సాయం చేయబోతున్నాం.
- గతంలో కొన్ని చిత్రాలు సంక్రాంతికి తక్కువ థియేటర్స్‌లో విడుదలై భారీ విజయాలను అందుకున్నాయి. ఈ సంక్రాంతికి మరో మూడు పెద్ద చిత్రాలు విడుదలవుతున్న క్రమంలో రజనీకాంత్ వంటి పెద్ద హీరో సినిమా అయ్యుండి కూడా పరిమిత థియేటర్స్‌లో విడుదల చేస్తున్నాం. సినిమా బాగుంటే ప్రేక్షకులు ఆదిరిస్తారు. తద్వారా థియేటర్స్ పెరుగుతాయనే ధైర్యంతో సంక్రాంతికి వస్తున్నాం.
- ఇప్పటికే యాభై శాతం వరకూ డిస్ట్రిబ్యూషన్ రైట్స్ అమ్ముడయ్యాయి. సినిమా మెప్పిస్తుందనే నమ్మకముంది. ఈ సంవత్సరం స్ట్రయిట్ సినిమాను ప్లాన్ చేస్తున్నాను. కంటెంట్‌కు ప్రాధాన్యత ఉన్న సినిమాలు చేయాలని అనుకుంటున్నాను.

కాన్సెప్ట్‌కి తగ్గ టైటిల్‌తో..

ఎన్.ఆర్.రెడ్డి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తోన్న చిత్రం 'ఉన్మాది'. శిరీష హీరోయిన్. ప్రవీణ క్రియేషన్స్ పతాకంపై ఎన్. కరణ్ రెడ్డి సమర్పణలో ఎన్.రామారావు నిర్మిస్తున్నారు. సంగీతం డేవిడ్. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. రాజ్ కందుకూరి ఆడియోను ఆవిష్కరించగా ట్రైలర్‌ను ఎన్.శంకర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... "ఇలాంటి సినిమాకు కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్, డైరెక్షన్ చేయడానికి చాలా ధైర్యం కావాలి. ఎన్.ఆర్.రెడ్డి పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా అద్భుతంగా నటించారు" అన్నారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ... "కాన్సెప్ట్‌కి తగ్గ టైటిల్ 'ఉన్మాది'. పాటలు బాగున్నాయి. ఆల్ ది బెస్ట్" అన్నారు. ఎన్.ఆర్.రెడ్డి మాట్లాడుతూ.. "నేను స్వర్గీయ హరికృష్ణ గారికి పెద్ద అభిమానిని, ఆయనే నాకూ స్ఫూర్తి. ఆయనలా కనిపించాలని ప్రయత్నించాను. ఒక్క ఫ్రేమ్‌లో అలా కనిపించినా నేను సక్సెస్ అయినట్లే. స్టోరీ వైవిధ్యంగా ఉంటుంది. ప్రేక్షకులకు థ్రిల్ ను కలుగజేస్తుంది" అన్నారు.





దర్శకుడిగా ఏవీఎస్ కొడుకు

దివంగత హాస్య నటుడు ఏవీఎస్ కొడుకు రాఘవేంద్ర ప్రదీప్ దర్శకుడిగా పరిచయమవుతూ రూపొందిస్తోన్న చిత్రం 'వైదేహి'. యాక్టివ్ స్టూడియోస్ బ్యానర్‌పై జానకీ ప్రదీప్ నిర్మిస్తున్నారు. మహేశ్, ప్రణతి, సందీప్, అఖిల, ప్రవీణ్, వెంకటేశ్ నటిస్తున్నారు. ఏవీఎస్ జయంతి సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ ఆవిష్కరణ జరిగింది. ఎన్.శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నటనలో ఓ ప్రత్యేకమైన శైలి ఏవీఎస్‌ది. ఆయన లేని లోటు తీర్చలేనిది. ఇప్పుడు ఆయన కొడుకు దర్శకుడిగా పరిచయమవడం ఆనందంగా ఉంది. హారర్ సినిమాకు కావాలసిన ఉత్కంఠ రేపే అంశాలు ట్రైలర్‌లో కనిపించాయి. సినిమా సక్సెస్ కావాలని ఆశిస్తున్నాను' అన్నారు. దర్శకుడు ప్రదీప్ మాట్లాడుతూ 'నాన్న గారికి ఎలాంటి కష్టమొచ్చినా ఎన్.శంకర్ గారికే మొదట ఫోన్ చేసేవారు. అలాంటి వ్యక్తి నా సినిమా ట్రైలర్ విడుదల చేయడంతో నాన్నగారే చేశారన్నట్టుగా ఉంది. ఈ కథతో చాలామందిని కలిసినా ఫలితం లేకపోవడంతో నేనే సినిమా ప్రారంభించాను. నటీనటులు, టెక్నీషియన్స్ రాత్రింబవళ్లు ఎంతో కష్టపడ్డారు. సినిమాటోగ్రాఫర్‌కు వీలయినంత స్వేచ్ఛ ఇస్తే ఇలాంటి హారర్ చిత్రాలు అద్భుతంగా వస్తాయి. ప్రేక్షకులు ఆదరిస్తారని భావిస్తున్నాను' అన్నారు.

హారర్ థ్రిల్లర్‌గా...

చంద్రశేఖరా మూవీస్ పతాకంపై, ఇంటర్నేషనల్ మోడల్స్ సమీర్ ఖాన్, శైలజలను హీరో హీరోయిన్లుగా పరిచయం చేస్తూ నిర్మిస్తోన్న చిత్రం 'కెఎస్100'. వెంకట్ రెడ్డి నిర్మాత. షేర్ దర్శకుడు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిన సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. "టైటిల్ కి తగ్గట్టుగానే వైవిధ్యమైన కంటెంట్ తో తెరకెక్కుతోన్న చిత్రమిది. హారర్, సస్పెన్స్ థ్రిల్లర్,రొమాంటిక్ జానర్స్ లో యూత్, లేడీస్ ను ఇన్స్పైర్ చేసేలా తీశాము. గోవా, హైదరాబాద్, మహారాష్ట్రలోని హిరంబుల్ లో షూటింగ్ చేశాము. చాలామంది మోడల్స్ ను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాము. టైటిల్ లోగోను విడుదల చేశాము. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాము" అన్నారు.





లక్ష్యమున్న ఫన్నీ దొంగ

'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' కాంబినేషన్ రిపీట్ చేస్తూ సప్తగిరి హీరోగా అరుణ్ పవార్ దర్శకత్వంలో మరో సినిమా రూపొందుతోంది. వైభవీ జోషీ హీరోయిన్. శివ శివమ్ ఫిలింస్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డిలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'వజ్ర కవచధర గోవింద' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. "ఇందులో సప్తగిరి పాత్ర పేరు గోవిందు. ఫన్నీ దొంగ. కానీ అతనికో లక్ష్యం ఉంటుంది. దానికోసం అతనేం చేశాడన్నదే సినిమా. కడుపుబ్బా నవ్వించే కామెడీతో పాటు, యాక్షన్, ఎమోషన్ వంటి అన్ని కమర్షియల్ హంగులూ ఉంటాయి" అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ.. "ఇదొక హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఇప్పటి వరకూ 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తున్నాం" అన్నారు. అర్చనా వేద, టెంపర్ వంశీ, అప్పారావు, అవినాష్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా ప్రవీణ్ వనమాలి, సంగీతం: విజయ్ బుల్గానిన్.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.439	రూ.5.00
వరంగల్	రూ.441	రూ.5.00

మార్కెట్

సెన్సెక్స్ 363 ↓ 35,891.52

నిఫ్టీ 118 ↓ 10,792.50

జెట్ ఎయిర్‌వేస్ డిఫాల్ట్

న్యూఢిల్లీ: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న జెట్ ఎయిర్‌వేస్.. బ్యాంకుల కన్సార్టియానికి అప్పుల వాయిదాలు చెల్లించడంలో విఫలమైంది. తాత్కాలికంగా నగదు నిల్వల్లో వచ్చిన తేడాలతో ఈ సమస్య ఏర్పడ్డట్లు తెలిపింది. 2018 డిసెంబరు 31 నాటికి డబ్బు చెల్లించాల్సి ఉండగా తాము ఇంకా కట్టలేదని స్పష్టంచేసింది. దీనిపై బ్యాంకులతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. దీంతో కంపెనీ షేర్ ధర బుధవారం ఐదుశాతం తగ్గి రూ.267 వద్ద ముగిసింది. ఇదిలా ఉంటే, రూ.1,500 కోట్ల స్వల్పకాలిక రుణం కోసం జెట్ ఎయిర్‌వేస్ ఎస్‌బీఐతో చర్చలు జరుపుతున్నట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి.



ఏఐపీబీఏ వైస్ ప్రెసిడెంట్‌గా చిట్టూరి సురేశ్

హైదరాబాద్, వెలుగు: ఆల్ ఇండియా పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ (ఏఐపీబీఏ) వైస్ ప్రెసిడెంట్ గా శ్రీనివాస ఫామ్స్ వైస్ చైర్మన్ సురేశ్ చిట్టూరి ఎన్నికయ్యారు. సురేష్ ప్రస్తుతం ఇంటర్నేషనల్ ఎగ్ కమీషన్ (ఐఈసీ) యుకే కు వైస్ చైర్మన్ గా సేవలందిస్తున్నారు. ఏఐపీబీఏ జాతీయ స్థాయిలో పౌల్ట్రీ పరిశ్రమకు అత్యంత ప్రముఖమైనది. ఇండియాలోని అన్ని ప్రముఖ పౌల్ట్రీ బ్రీడర్లు ఈ అసోసియేషన్ లో ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కొనసాగుతున్నారు. పౌల్ట్రీ పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో చర్చిస్తూ దేశీయ పౌల్ట్రీ పరిశ్రమను పటిష్టపరచడంలో ఏఐపిబిఏ ముఖ్యపాత్ర పోషిస్తోంది.

ఎన్‌సీసీ చేతికి రూ.2,890 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్, వెలుగు: నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సీసీ) భారీ ఆర్డర్లను సొంతం చేసుకుంది. డిసెంబర్ లో రూ.2,890.7 కోట్ల విలువైన నాలుగు ఆర్డర్లను దక్కించుకున్నట్లు మంగళవారం వెల్లడించింది. దీన్లో రూ.680.3 కోట్లు వాటర్ , ఎన్విరాన్ మెంట్ విభాగానికి సంబంధించిన పనులకోసం కాగా, రూ.2,126.8 కోట్ల విలువైన మరో రెండు ఆర్డర్లు రోడ్స్ డివిజన్ పనులకు చెందినవి. ఇక మరో రూ.83.7 కోట్ల ఆర్డర్ బిల్డింగ్ పనులకు సంబంధించినవవి. ఈ నాలుగు ఆర్డర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీల నుండి దక్కినట్లు కంపెనీ వెల్లడించింది.



ఎల్‌ఐసీ చైర్మన్‌గా హేమంత్ భార్గవ

హైదరాబాద్, వెలుగు: ఎల్ఐసీ ఇండియా చైర్మన్ గా హేమంత్ భార్గవ అదనపు బాధ్యతలను స్వీకరించారు. వి.కే.శర్మ పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం ఎల్ఐసి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతున్న హేమంత్ భార్గవ చైర్మన్ గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. 2017 ఫిబ్రవరి లో ఎల్ఐసి మేనేజింగ్ డైరెక్టర్ గా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. బ్యాంకింగ్ పరిశ్రమ సహకారంతో ఎల్ఐసి కార్డ్స్ సర్వీస్ లిమిటెడ్ జాయింట్ వెంచర్ ద్వారా ఎల్ఐసి కార్డ్ ను ప్రారంభించారు. హేమంత్ భార్గవ ఈ యేడాది జులైలో రిటైర్ అవుతారు.



ఈపీఎఫ్ రేటు పెరిగే చాన్స్

కోట్లమంది ఉద్యోగులకు ప్రయోజనం

- వచ్చే నెల కొత్త రేట్ల ప్రకటన
- ఎన్నికల ఏడాది కాబట్టి రేట్ల పెంపునకు అవకాశం

న్యూఢిల్లీ: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) నుంచి ఉద్యోగులు త్వరలో శుభవార్తను వినే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగుల పొదుపు మొత్తాలపై ప్రస్తుతం ఉన్న వార్షిక వడ్డీరేటు 8.55 శాతాన్ని మరింత పెంచబోతున్నట్టు సమాచారం. ఫలితంగా కోట్ల మందికి ప్రయోజనం కలుగుతుంది. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఈపీఎఫ్ఓ చందాదారులను ఆకర్షించే నిర్ణయాలు ప్రకటించవచ్చని ఉద్యోగ సంఘాల నాయకులు అంటున్నారు. ఇప్పటికే రైతు రుణాలను మాఫీ చేశారు. పలు వస్తువులపై జీఎస్టీ రేట్లు తగ్గించారు. అయితే, ఈపీఎఫ్ఓ వడ్డీరేట్లపై వార్షిక సమీక్ష ఇంకా జరగనప్పటికీ, ఈసారి రేట్లను పెంచే ప్రతిపాదనకు ఆమోదం దక్కవచ్చని సంబంధిత అధికారులు కొందరు చెప్పారు. ద్రవ్యోల్బణం కొద్దిగా తగ్గింది కాబట్టి కనీసం ప్రస్తుత రేటును యథాతథంగా కొనసాగిస్తారని మరో అధికారి అన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ఓ వార్షిక వడ్డీరేటును 8.55 శాతంగా నిర్ధారించారు. ఇది ఐదేళ్ల కనిష్టం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యథావిధిగా ఉంచినప్పటికీ, ఉద్యోగులు దీనిని అత్యంత ఆకర్షణీయ పొదుపు సాధనంగా పరిగణిస్తున్నారు. ఎందుకంటే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ) వడ్డీరేట్లు 7.7 శాతాన్ని మించడం లేదు. సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసే అల్ట్రా షార్ట్ టెర్మ్ డెట్ ఫండ్స్‌ల వడ్డీరేట్లు కూడా 7.78 శాతాన్ని దాటడం లేదు. "గత ఏడాది డెట్ ఇన్వెస్ట్‌మెంట్లు తక్కువ రాబడులను ఇచ్చాయి. ఈపీఎఫ్ఓ ఈసారి కూడా వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు లేవు. ప్రభుత్వానికి ఇది చాలా కీలక సంవత్సరం. ఈ నెలాఖరులో కొత్త వడ్డీరేట్లను ప్రకటిస్తాం" అని ఈపీఎఫ్ఓ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యుడు ప్రభాకర్ బన్సురే మాట్లాడుతూ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు లేవని, చందాదారులకు మరింత మేలు చేయడానికే ప్రయత్నిస్తామని వెల్లడించారు. "ఇప్పుడున్న 8.55 శాతం వడ్డీరేటును పెంచగలమా అనే కోణంలోనూ ఆలోచిస్తున్నాం. తుది లెక్కలు, ఆడిట్లు జరుగుతున్నాయి" అని ఆయన వివరించారు.

ఈపీఎఫ్ఓకు దాదాపు ఆరు కోట్లకు మందికిపైగా చందాదారులు ఉన్నారు. దీని దగ్గర ఉన్న పొదుపు మొత్తాల విలువ రూ.11 లక్షల కోట్ల వరకు ఉంటుంది. నిజానికి ప్రతి ఏటా డిసెంబరులోనే ఈపీఎఫ్ఓ రేట్లను ప్రకటిస్తారు. ఈసారి ఆడిటింగ్ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఒక నెల ఆలస్యమవుతోంది. వచ్చే నెల ఒకటో తేదీనే కొత్త రేట్లను ప్రకటించే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. గత ఏడాది ఈపీఎఫ్ఓ వద్ద రూ.600 కోట్ల మిగులు నిధులు ఉండటంతో 8.55 శాతం వడ్డీరేటు ప్రకటించింది. ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్లు 12 శాతం రాబడులను ఇవ్వడంతో ఇది సాధ్యమైంది. ప్రస్తుతం ఈ సంస్థ రూ.50 వేల కోట్లను ఎక్స్‌ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్) ద్వారా స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టింది. చందాదారులు తమ పెట్టుబడిలో మరింత మొత్తాన్ని స్టాక్ మార్కెట్ లో ఇన్వెస్ట్ చేయడానికి ఆప్షన్ ఇచ్చే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది. ప్రస్తుత విధానంలో ఈటీఎఫ్ పొదుపు వివరాలు చందాదారుడి ఖాతాపుస్తకంలో కనిపించవు. ఇక నుంచి ఈటీఎఫ్‌లో ఎంత ఉంది..సాధారణ పొదుపు ఖాతాలో ఎంత ఉంది అనేది చందాదారుడు తెలుసుకోవడానికి ఈపీఎఫ్ఓ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ తయారు చేస్తోంది. "ఇటీవల ప్రభుత్వ అంగన్‌వాడీల ప్రోత్సాహకాలను 50 శాతం పెంచింది. నేషనల్ పెన్షన్ స్కీం విత్‌డ్రాయల్స్‌పై పన్నును తొలగించింది. ఈపీఎఫ్ వడ్డీరేట్లను సైతం ఇలాగే పెంచే అవకాశాలు ఉన్నాయి" అని సంస్థ అధికార వర్గాలు తెలిపాయి

సెన్సెక్స్ నేలచూపులు



- గ్లోబల్ మార్కెట్ల ఎఫెక్ట్
- 363 పాయింట్లు డౌన్

ముంబై: గ్లోబల్ మార్కెట్ దెబ్బకు దేశీయ స్టాక్ మార్కెట్ భారీగా పతనమైంది. చైనా ఎకనామిక్ డేటా నిరాశ పరచడం, ఆటో సేల్స్ బలహీనంగా ఉండటంతో, బుధవారం మార్కెట్ లో భారీగా అమ్మకాలు వెల్లువెత్తాయి. ఆటో, మెటల్ స్టాక్స్ తీవ్రంగా నష్టపోయాయి. దీంతో సెన్సెక్స్ 363 పాయింట్ల మేర పతనమైంది. సాంకేతికంగా కీలకమైన 36,000 పాయింట్ల మార్క్ కింద 35,891.52 వద్దకు చేరింది. నిఫ్టీ సైతం 117.60 పాయింట్లు క్షీణించి 10,792.50 వద్ద నమోదైంది. న్యూ ఇయర్ హాలిడే తర్వాత ప్రారంభమైన ప్రపంచ మార్కెట్లు, చైనా మందగమన పరిస్థితులతో తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. అమెరికన్ ఇన్వెస్టర్లు డోజోన్స్ ఫ్యూచర్స్‌లో అమ్మకాలకు ఎగబడ్డారు. మరోవైపు అమెరికా చైనా మధ్య వాణిజ్య వివాదాలు ప్రపంచ ఆర్థిక మందగమనానికి దారిచూపనున్న అంచనాలు ఇటీవల ప్రపంచ స్టాక్ మార్కెట్లను దెబ్బతీస్తున్నాయి. ఈ పరిణామాలన్ని దేశీయ స్టాక్ మార్కెట్ పై ప్రభావం చూపాయి. సెన్సెక్స్‌లో భారీగా నష్టపోయిన షేర్లలో వేదాంత, టాటా స్టీల్, ఎం అండ్ ఎం, టాటా మోటార్స్, మారుతి, హీరో మోటోకార్ప్, పవర్ గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, కోల్ ఇండియాలు ఉన్నాయి. సన్‌ఫార్మా, టీసీఎస్, ఏసియన్ పేయింట్స్, ఇన్ఫోసిస్, యస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ బుధవారం లాభాల్లో కొనసాగాయి. సెక్టార్ పరంగా ఆటో, మెటల్ స్టాక్స్ 3 శాతానికి పైగా నష్టపోయాయి. దేశీయంగా ప్యాసెంజర్ వెహికిల్ సేల్స్ నిరాశాజనకంగా ఉండటంతో, ఆటో స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి.

వృద్ధిరేటు పెరుగుతది

ఆర్థికశాఖ ప్రకటన

న్యూఢిల్లీ: మనదేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, ప్రస్తుత, రాబోయే సంవత్సరంలోనూ 'అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ'గా నిలుస్తుందని కేంద్ర ఆర్థికశాఖ బుధవారం ప్రకటించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకుల్లో ఇండియా ర్యాంకు మెరుగుపడినట్టు ప్రపంచబ్యాంకు అధ్యయనం తెలిపిందని పేర్కొంది. 2014 నుంచి 2018 మధ్య సగటు వృద్ధి 7.3 శాతం వృద్ధి నమోదు చేశామని, ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఇదే అత్యధికమని ఆర్థికశాఖ వార్షిక సమీక్ష తెలిపింది. గత ఏడాది తొలి అర్ధభాగంలో 7.6 శాతం వృద్ధి సాధించినట్టు తెలిపింది. "ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో అత్యధిక వృద్ధిరేటు సాధించడానికి మనదేశం సిద్ధంగా ఉంది. ఇందుకోసం పలు చర్యలు తీసుకున్నాం. ఆర్థిక వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాం. ఉత్పత్తి రంగానికి ఊతం ఇచ్చాం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానాన్ని సమగ్రంగా సంస్కరించాం. టెక్స్‌టైల్ రంగానికి ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చాం. చౌకగృహ నిర్మాణరంగానికి పరిశ్రమల హోదా ఇచ్చి వసతుల రంగాన్ని మెరుగుపర్చాం. తీర ప్రాంతాల మధ్య రవాణాకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చాం. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది. వినియోగదారుడి ధర సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 3.3 శాతం మాత్రమే నమోదయింది. ఇది ఆరేళ్ల కనిష్టం" అని ఆర్థికశాఖ తెలిపింది. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి ఇండియా విధానాలను ప్రశంసించాయని పేర్కొంది.

ఇన్సూరెన్స్ పాలసీ వాట్సాప్‌తో చేయొచ్చు

హైదరాబాద్, వెలుగు: భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్ తమ కస్టమర్లకు పాలసీలను వాట్సాప్ ద్వారా అందిస్తోంది. దీంతో పాటు రిన్యూవల్ ప్రీమియం రిసిప్ట్ లను కూడా వాట్సాప్ ద్వారా కస్టమర్లకు అందిస్తున్నట్లు తెలిపింది. క్లెయిమ్ ఇంటిమేషన్ ను వాట్సాప్ ద్వారా పంపించే సేవలను ఇప్పటికే మొదలుపెట్టింది. పాలసీ కాంట్రాక్ట్, రిన్యూవల్ ప్రీమియం రిసిప్ట్స్, క్లెయిమ్ ఇంటిమేషన్ వంటి సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్న అతి కొద్ది ఇన్సూరెన్స్ కంపెనీల్లో భారతీ ఆక్సా లైఫ్ ఇన్స్యూరెన్స్ ఒకటని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ & ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వికాస్ సేథ్ తెలిపారు. తమ పాలసీదారులకు ఇది అదనపు కస్టమర్ సర్వీస్ ఆప్షన్ అని, పాలసీ కాంట్రాక్ట్, రిన్యూవల్ ప్రీమియం రిసిప్ట్ లను డౌన్ లోడ్ చేసుకోవచ్చని అన్నారు. టెక్నాలజీతో కూడిన కమ్యూనికేషన్ వేగంగా వ్యాప్తి చెందుతోందని, దీంతో కస్టమర్లకు మరింత మెరుగైన సేవలను అందించడానికి ఇది మరింత దోహదపడుతుందని భావిస్తున్నామన్నారు.

అదే దారిలో ఐసిఐసిఐ లైఫ్ ఇన్సూరెన్స్

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కూడా తమ పాలసీదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు వాట్సాప్‌ను వాడుతామని ప్రకటించింది. వాట్సాప్ లో వెరిఫైడ్ బిజినెస్ అకౌంట్ ద్వారా పాలసీదారులకు సంబంధించిన వెల్ కం కిట్స్, పాలసీ సర్టిఫికేట్స్, ప్రీమియం రిసిప్ట్స్ వంటి వాటితో పాటు ఇతర సేవలు అందించనున్నట్లు కంపెనీ డిప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ పునీత్ నంద తెలిపారు. పాలసీ కి సంబంధించిన సమాచారాన్ని సులువుగా కస్టమర్లకు అందించాలనే లక్ష్యంతో ఈ సేవలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కస్టమర్ కు అందించే సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచేందుకు ఉన్నత స్థాయి టెక్నాలజీని ఉపయోగించినట్లు తెలిపారు.

bharti AXA life insurance

One Smallcap Company where Bharti AXA Life Insurance Company has bought stake

యూపీఐ ట్రాన్సాక్షన్స్ లక్ష కోట్లు దాటాయ్



ట్విటర్‌లో వెల్లడించిన ఎన్‌పీసీఐ

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) లావాదేవీలు బాగా పెరుగుతున్నాయి. గత నెలలో యూపీఐ లావాదేవీలు 18 శాతం పెరిగి 62 కోట్లుగా రికార్డయినట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అధికారిక ట్విటర్‌లో వెల్లడించింది. వీటి విలువ రూ.1,02,594.82 కోట్లు. నవంబర్ నెలలో ఈ లావాదేవీలు 52.49 కోట్లుగా ఉన్నాయి. వాటి విలువ రూ.82,232.21 కోట్లు. మొత్తంగా 2018లో యూపీఐ లావాదేవీలు 300 కోట్లుగా రికార్డయినట్టు ఎన్‌పీసీఐ ప్రకటించింది. 2016 ఏప్రిల్‌లో యూపీఐ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత లావాదేవీల విలువ లక్ష కోట్ల మార్క్‌ను దాటడం ఇదే మొదటిసారి. గతేడాది యూపీఐ లావాదేవీలు భారీ మొత్తంలో వృద్ధి చెందినట్టు తెలిసింది. 2018 డిసెంబర్‌లో యూపీఐ లావాదేవీలు సంఖ్యాపరంగా నాలిగింతలు, విలువ పరంగా ఏడింతలు వృద్ధి చెందాయి. ఈ వృద్ధి రేటుతో యూపీఐ త్వరలోనే ఐఎంపీఎస్‌ను(ఇమిడియేట్ పేమెంట్ సర్వీసు) క్రాస్ చేయబోతుంది. యూపీఐతో పాటు, ఇన్‌స్టాంట్ రియల్ టైమ్ ఇంటర్‌బ్యాంక్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ ఐఎంపీఎస్‌ను ఎన్‌పీసీఐ నిర్వహిస్తోంది. ఐఎంపీఎస్ డిసెంబర్ నెలలో రూ.1,46,898.58 కోట్ల విలువైన లావాదేవీలను నమోదు చేసింది. యూపీఐ లావాదేవీలు కార్డు పేమెంట్లను కూడా క్రాస్ చేయబోతున్నట్టు తెలిసింది. ఆర్‌బీఐ డేటా ప్రకారం గతేడాది అక్టోబర్ నెలలో కార్డు లావాదేవీలు 9 శాతం పెరిగి 1.4 లక్షల కోట్లకు ఎగిశాయి. విలువ పరంగా 12 శాతం ఎగిసి రూ.4 లక్షల కోట్లపైన రికార్డయ్యాయి.

వ్యవసాయానికి 'టెక్' సాయం



- ఆధునిక సాగు వైపు అడుగులేస్తోన్న రైతులు
- టెక్నాలజీతో వ్యవసాయ రంగంలోనూ సవాళ్లు

న్యూఢిల్లీ: ఇండియా అంటేనే వ్యవసాయాధారిత దేశం. అది అందరికీ తెలిసిందే. దేశీయ ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రధాన ఆదాయ వనరు. కానీ మెరుగవుతున్న జీవన పరిస్థితులు, పెరుగుతున్న టెక్నాలజీ.. అన్ని రంగాలతో పాటు, వ్యవసాయ రంగ స్థితిగతులను మార్చేస్తున్నాయి. ప్రధానంగా టెక్నాలజీ పాత్ర వ్యవసాయ రంగంలో విపరీతంగా పెరగడం మొదలైంది. అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరే మనదేశంలోనూ వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతోంది. రైతులు కూడా సంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి పలికి ఆధునిక సాగువైపు అడుగులు వేస్తున్నారు. అన్ని రంగాల మాదిరే పెరుగుతోన్న టెక్నాలజీతో దేశీయ వ్యవసాయ రంగం కూడా కొన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది.

రైతు వయసు కీలకం..

ఉపాధి కోసం చాలా మంది గ్రామీణులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుండటంతో, రైతులకు లేబర్ దొరకడం కష్టంగా మారింది. దానికి తోడు ఎడ్యుకేషన్ పెరిగింది. యువత ఎక్కువగా తమ పట్టణాలలో, గ్రామాలలో కంటే, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం కోసం వెతుకులాడుతున్నారు. మొబైల్, ఇంటర్నెట్ కూడా వారి పరిజ్ఞానాన్ని పెంచుతోంది. దీంతో వ్యవసాయ రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు దారితీస్తున్నాయి. రైతులు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను ఆధారం చేసుకుని వ్యవసాయంలో కొత్త టెక్నాలజీలను కంపెనీలు ప్రవేశపెడుతున్నాయి. ఆ ప్రొడక్ట్ కచ్చితంగా రైతుల అవసరాలను, సమస్యలను తీర్చగలిగేదై ఉండి, రైతులకు లబ్ది చేకూర్చాలి. అయితే కొత్త ఎక్విప్‌మెంట్‌ను ప్రవేశపెట్టేటప్పుడు లేదా రైతులకు టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చేటప్పుడు వారి వయసును కూడా కంపెనీలు దృష్టిలో పెట్టుకోవాలి. ఆ ప్రొడక్ట్ కంపెనీకి సక్సెస్‌ను అందించాలంటే, రైతుల వయసే ముందుగా కంపెనీలు పరిగణలోకి తీసుకోవాల్సిన విషయం. ప్రతి పంటా ఒక ప్రత్యేకమైన ప్రొడక్షన్ విధానంతో, భారీ మార్కెట్‌లో విస్తృతమై ఉంటోంది. ఎవరైతే దీన్ని కరెక్ట్‌గా అంచనా వేయగలుగుతారో, వారు పవర్‌ఫుల్ బిజినెస్ లైన్‌ను అందుకున్నట్టే. తక్కువ లేబర్‌తో రెండు ఎకరాల కంటే ఎక్కువ భూమిలో వ్యవసాయం చేయాలనుకుంటే, ప్రస్తుతం రైతులు ట్రాక్టర్లను, ఇతర టెక్నాలజీలను వాడుతున్నారు. వ్యవసాయంలో సమయం, ఉత్పత్తి చాలా ముఖ్యమైనవి. సరియైన సమయానికి పంటను ఉత్పత్తి చేసి, స్టోర్లకు డెలివరీ చేయాలి. అధునాతన వ్యవసాయ టెక్నాలజీతో తక్కువ లేబర్‌తో, ఎక్కువ మొత్తంలో పంటను అత్యంత తక్కువ సమయంలో రైతులు పండించగలుగుతున్నారు. అధునాతన ట్రాన్స్‌పోర్ట్ టెక్నాలజీ కూడా రైతులు తేలికగా పంటను రవాణా చేయడానికి ఉపయోగపడుతున్నాయి.

డివైజ్‌ల వాడకానికి శిక్షణ ఇవ్వడం తప్పనిసరి

సరికొత్త వ్యవసాయ ఎక్విప్‌మెంట్‌తో పాటు, పూర్తిగా టెక్నాలజీపై ఆధారపడే పలు ప్రొడక్ట్‌లను, సర్వీసులను కంపెనీలు తీసుకువస్తున్నాయి. ప్రతి పంటలో లెక్కలేనన్ని అవకాశాలున్నాయి. కానీ ఇంటర్నెట్, డివైజ్‌ల బట్టి దానిలో ఏ మేరకు వాడాలన్నది ఆధారపడి ఉంటోంది. కొన్నిచోట్ల ఇంటర్నెట్ స్పీడ్ చాలా తక్కువగా ఉంటోంది. పేదలకు **స్మార్ట్‌ఫోన్లు** ఉండవు. దీంతో చాలా వరకు టెక్నాలజీ వాడకం లిమిటెడ్‌గా ఉంటోంది. ప్రత్యేకంగా వ్యవసాయం కోసమే డిజైన్ చేసే ప్రొడక్ట్ లేదా సర్వీసును చాలా జాగ్రత్తగా రూపొందించాలి. దాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించేలా చేయడం గ్రేట్ ఛాలెంజ్. వాతావరణాన్ని ముందుగా అంచనా వేయడం, పురుగుమందులను కొలవడం, డేటా కలెక్షన్, అనాలసిస్, వంటి వాటి కోసం సాధారణంగా పలు ప్రొడక్ట్‌లను, సర్వీసులను తీసుకొస్తూ ఉంటారు. అయితే ఈ సర్వీసుల్లో ఎండ్ యూజర్‌కు అంటే రైతులకు వీటి వాడకం గురించి పూర్తి శిక్షణ, అవగాహన కల్పించాలి.

అపార్ట్‌మెంట్లపై జీఎస్టీ తగ్గే చాన్స్

న్యూఢిల్లీ: నిర్మాణంలో ఉన్న ఫ్లాట్లపై జీఎస్టీని ఐదుశాతానికి తగ్గించాలన్న ప్రతిపాదనపై ఈ నెల 10న జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో చర్చిస్తారని సమాచారం. రూ.20 లక్షల వరకు వార్షిక టర్నోవర్ ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈలు)లను జీఎస్టీ నుంచి మినహాయించాలనే ప్రతిపాదన కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత నెల 22న జరిగిన సమావేశంలో 23 వస్తువులను, సేవలను 28 శాతం శ్లాబ్ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ సమావేశం అనంతరం జీఎస్టీ మండలి చైర్మన్, కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ విలేకరులతో మాట్లాడుతూ నివాస ఆస్తులపై జీఎస్టీ తగ్గింపు, ఎంఎస్ఎంఈలకు మినహాయింపుపై జనవరి 10న జరిగే సమావేశంలో చర్చిస్తామని ప్రకటించారు. చిన్న సరఫరాదారుల కోసం కాంపోజిషన్ పథకాన్ని తేవడం, విపత్తుల సెస్ విధింపు వంటి అంశాలూ చర్చకు రావొచ్చని తెలిపారు. నిర్మాణంలోని ఫ్లాట్లతోపాటు గృహాల కొనుగోలుపైనా జీఎస్టీని 12 శాతం నుంచి ఐదుశాతానికి తగ్గించే అవకాశం ఉందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

అచ్రేకర్ సార్ ఇకలేరు..



- సచిన్ గురువు కన్నుమూత
- మాస్టర్ సహా పలువురిని తీర్చిదిద్దిన లెజెండరీ కోచ్
- రమాకాంత్ మరణం పట్ల బీసీసీఐ, క్రికెటర్ల దిగ్భ్రాంతి

ముంబై: ఇండియన్ గ్రేట్ సచిన్ టెండూల్కర్‌కు క్రికెట్ పాఠాలు నేర్పిన గురువు రమాకాంత్ అచ్రేకర్(87) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమాకాంత్ ముంబైలోని తన నివాసంలో బుధవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. క్రికెటర్‌గా సచిన్ ఎదుగుదల వెనుక రమాకాంత్ పాత్ర కీలకం. గురువు అచ్రేకర్‌తో తనకున్న అనుబంధాన్ని సచిన్ పలు సందర్భాల్లో వెల్లడించారు. ముంబై, దాదర్‌లోని శివాజీ పార్క్‌లో కామత్ మెమోరియల్ క్రికెట్ క్లబ్‌ను స్థాపించిన రమాకాంత్ అచ్రేకర్ టీమిండియాకు ఎంతో మంది క్రికెటర్లను అందించారు. వీరిలో సచిన్‌తోపాటు వినోద్ కాంబ్లీ, అజిత్ అగార్కర్, సమీర్ డిగే, ప్రవీణ్ ఆమ్రే, బల్వీందర్ సింగ్ సంధు ఉన్నారు. క్రికెటర్‌గా విశ్వఖ్యాతి సాధించినప్పటికీ అచ్రేకర్‌ను సచిన్ గౌరవిస్తూనే ఉండేవాడు. అవకాశం దొరికిన ప్రతిసారి టీచర్స్ డే రోజున సచిన్, తన కోచ్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకునేవాడు. కాగా.. క్రీడలకు ఆయన చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం అచ్రేకర్‌కు 1990లో ద్రోణాచార్య అవార్డు ఇచ్చింది. 2010లో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మశ్రీ' వరించింది. 1932లో జన్మించిన రమాకాంత్ అచ్రేకర్ 1943లో క్రికెటర్‌గా కెరీర్‌ను ప్రారంభించారు. 1945లో న్యూ హిందూ స్పోర్ట్స్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించారు. యంగ్ మహారాష్ట్ర లెవెన్, గుల్ మొహర్ మిల్స్, ముంబై పోర్టు జట్లుకు ఆడారు. 1963లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున మొయినుద్దౌలా టోర్నీలో హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో బరిలోకి దిగారు. క్రికెటర్‌గా అచ్రేకర్ ఆడిన ఏకైక ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఇదే. రమాకాంత్ జీవిత చరిత్రకు కునాల్ పురంధరే అనే జర్నలిస్టు 2016లో పుస్తక రూపం ఇచ్చారు. 'రమాకాంత్, మాస్టర్ బ్లాస్టర్స్ మాస్టర్' పేరిట ఈ పుస్తకం మార్కెట్‌లోకి వచ్చింది. రమాకాంత్ స్థాపించిన క్రికెట్ క్లబ్‌ను ప్రస్తుతం అతని కుమార్తె కల్పన ముర్కర్ నిర్వహిస్తున్నారు. కాగా, రమాకాంత్ మరణం పట్ల బీసీసీఐ సంతాపం తెలియజేసింది.



ఆయన వేసిన పునాది వల్లే ఈ స్థాయికి - సచిన్

అచ్రేకర్ మరణం పట్ల సచిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. 'ఎందరో విద్యార్థుల్లాగా నేను ఆయన దగ్గర క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకున్నా. ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే అది ఆయన వేసిన పునాది వల్లే. గత నెలలోనే ఆయన్ను కలిశాను. పాత జ్ఞాపకాలను పంచుకున్నా. ఆయన నేర్పిన పాఠాలు మైదానంలోనే కాకుండా జీవితంలో కూడా ఉపయోగపడ్డాయి. చాలా బాగా ఆడారు సర్, మీరు ఎక్కడ ఉన్నా కోచ్‌గానే ఉండాలి' అని పేర్కొన్నాడు.

ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమాకాంత్ అచ్రేకర్ మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నాం
- బీసీసీఐ

అచ్రేకర్ సర్ గొప్ప క్రికెటర్లను తీర్చిదిద్దడమే కాకుండా వారిని అద్భుతమైన మనుషులుగా తయారు చేశారు. ఆయన మరణ వార్త వినడం చాలా బాధాకరం
- ఆర్పీ సింగ్

ఇండియా, ముంబై క్రికెట్‌కి ఇది విషాదకరమైన రోజు. చాలామంది క్రికెటర్లు, కోచ్‌లను తీర్చిదిద్దిన లెజెండ్ అచ్రేకర్
- లాల్‌చంద్ రాజ్‌పుత్

'ఇండియా క్రికెట్‌కు ఓ అభరణం (సచిన్‌ను) అందించిన అచ్రేకర్ సర్ మరణం పట్ల శ్రద్ధాంజలి ఘటిస్తున్నా.
- వీవీఎస్ లక్ష్మణ్

ఒక్క అడుగు.. ఒకే ఒక్క అడుగు..

ఆస్ట్రేలియా గడ్డపై ఏడు దశాబ్దాలుగా ఊరిస్తున్న టెస్ట్ సిరీస్‌ను కైవసం చేసుకునేందుకు..
కొత్త చరిత్రకు నాంది పలికేందుకు.. టీమిండియా వేయాల్సింది ఇంకొక్క అడుగే!
మహామహులు బరిలో నిలిచినా... కంగారూలపై ఎన్నిసార్లు దండెత్తినా.. తెల్ల ముఖం వేసుకొని ఇంటికొచ్చే
మన జట్టు ఈ సారి నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలో నిలిచింది..! ఇది చాలా అరుదైన సందర్భం..!
స్వదేశంలోనే పులులు అనే ముద్రను చెరిపేసేందుకు.. ఉపఖండం అవతల కూడా విజయం సాధిస్తామని
నిరూపించేందుకు.. టీమిండియాకు ఇంతకంటే గొప్ప అవకాశం మరొక్కసారి రాబోదు..!
సిడ్నీలో విజయం సాధించినా.. కనీసం డ్రా చేసుకున్న చాలు.. చారిత్రక విజయం సొంతం అవుతుంది..!
మరి, ఇండియా చరిత్ర సృష్టిస్తుందా..! గాయాల ఇబ్బందిని దాటి చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకుంటుందా?

అదిగో చరిత్ర..
తిరగరాస్తారా!



సిడ్నీ: నువ్వానేనా అన్నట్టుగా సాగుతున్న ఆస్ట్రేలియా-టీమిండియా టెస్ట్ సమరం చివరి అంకానికి చేరుకుంది. మెల్‌బోర్న్‌లో అదిరిపోయే విక్టరీ కొట్టి బోర్డర్-గావస్కర్ ట్రోఫీని నిలబెట్టుకున్న కోహ్లీసేన అదే జోరుతో గురువారం మొదలయ్యే చివరి, నాలుగో టెస్ట్‌లోనూ నెగ్గి తొలిసారి సిరీస్‌ను కైవసం చేసుకోవాలన్న దృఢ సంకల్పంతో ఉంది. గత మ్యాచ్‌లో ఓటమితో డీలా పడ్డా వెంటనే పుంజుకొని సిరీస్‌ను పంచుకోవాలని ఆసీస్ భావిస్తోంది. గాయాలు, ఫామ్ సమస్యల నేపథ్యంలో ఈ మ్యాచ్‌లో ఇరు జట్లలో మార్పులు ఖాయంగా ఉన్నాయి. అయితే, సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో ఉండడం.. డ్రా చేసుకున్నా ట్రోఫీని సొంతం చేసుకోనున్న కోహ్లీ సేన ఫేవరెట్‌గా బరిలోకి దిగి.. స్వేచ్ఛగా ఆడనుంది. దాంతో, ఒత్తిడంతా హోమ్‌టీమ్‌పైనే ఉండనుంది. ఇక 2018లో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ టూర్లలో లభించిన అవకాశాలను వృథా చేసుకున్న టీమిండియా.. ఈ సారి మాత్రం చాన్స్‌ను మిస్ చేసుకోకూడదన్న కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే జట్టును ముందుండి నడిపిస్తూ విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్న కోహ్లీ.. సిరీస్‌ను ఖాతాలో వేసుకుంటే కెప్టెన్‌గా మరో లెవెల్‌కు చేరుకుంటాడు. కోహ్లీతో పాటు చటేశ్వర్ పుజారా సూపర్ ఫామ్‌లో ఉండడం, మయాంక్ రాకతో ఓపెనింగ్ సమస్య తీరడం.. మిడిలార్డర్‌లో రహానె, విహారి, రిషభ్ భరోసాతో ఇండియా బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. బుమ్రా, షమితో పేస్ విభాగం కూడా పదునుగా ఉంది. ముఖ్యంగా యువ పేసర్ బుమ్రా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు సింహస్వప్నం అయ్యాడు. మెల్‌బోర్న్ మాదిరిగా అందరూ తలో చేయి వేస్తే ఇండియాకు సిరీస్ విజయం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు.

కోహ్లీసేనకు గాయాల బెడద

గతంలో ఏ కెప్టెన్‌కూ సాధ్యంకాని విధంగా ఆధిక్యంతో ఆసీస్ గడ్డపై చివరి టెస్ట్ బరిలో నిలిచిన కోహ్లీకి తుది జట్టు ఎంపిక తలనొప్పిగా మారింది. అంతా సవ్యంగా ఉందనుకున్న సమయంలో ఇషాంత్ శర్మ గాయంతో సిడ్నీ మ్యాచ్‌కు దూరమయ్యాడు. అశ్విన్ గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. ఫైనల్-13లో ఉన్న అశ్విన్‌పై టాస్‌కు ముందు నిర్ణయం తీసుకుంటామని మేనేజ్‌మెంట్ చెబుతున్నా.. అతడు ఆడేది కష్టమే అని ప్రి-మ్యాచ్ కాన్ఫరెన్స్‌లో కోహ్లీ హింట్ ఇచ్చాడు. స్పిన్‌కు అనుకూలించే సిడ్నీలో అశ్విన్ ఆడకుంటే ఇండియాకు లోటే. ఈ నేపథ్యంలో రవీంద్ర జడేజా తుది జట్టులో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ ఇద్దరు స్పిన్నర్లతో ఆడాలనుకుంటే చైనామన్ కుల్దీప్ యాదవ్ ఉన్నాడు. ఇషాంత్ స్థానంలో ఉమేష్ యాదవ్‌ను ఎంపిక చేయగా.. రోహిత్ శర్మ గైర్హాజరీలో కేఎల్ రాహుల్ మళ్లీ ఇన్నింగ్స్ ఆరంభించే చాన్స్ ఉంది. తెలుగు క్రికెటర్ హనుమ విహారి తన ఆరో నెంబర్‌కు మారనున్నాడు. ఇక, అశ్విన్ ఉన్నా.. లేకపోయినా ఈ మ్యాచ్‌లో ఇండియా నలుగురు బౌలర్లతో బరిలోకి దిగాలని చూస్తోంది. అయితే, ఇద్దర్లు పేసర్లు.. ఇద్దరు స్పిన్నర్లా లేక ముగ్గురు పేసర్లు-ఒక స్పిన్నరా అనేది ఆసక్తికరం.

- సిరీస్‌పై టీమిండియా గురి
- సమం చేయాలని ఆసీస్ ఆరాటం
- నేటి నుంచి చివరి టెస్ట్
- ఉ. 5 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో



పైన్

ఆసీస్ టీమ్‌లోనూ మార్పులు..!

బ్యాటింగ్ వైఫల్యంతో గత టెస్టును చేజార్చుకున్న ఆస్ట్రేలియా.. సిరీస్ ఓటమి ముంగిట నిలిచింది. ఇండియాను గాయాలు ఇబ్బంది పెడితే ఆసీస్‌ను ఆటగాళ్ల ఫామ్ కలవరపెడుతోంది. ఆ జట్టు టాపార్డర్ పేలవంగా ఆడుతోంది. వరుసగా విఫలమవుతున్న ఓపెనర్ ఆరోన్ ఫించ్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందకి దింపడం లేదా తప్పించే అవకాశం కనిపిస్తోంది. అప్పుడు హారిస్‌తో ఖవాజా ఇన్నింగ్స్ ఆరంభించే చాన్సుంది. ఇక, ఆల్‌రౌండర్ మార్నస్ లాబుషేన్‌ను తిరిగి జట్టులోకి తీసుకున్నారు. సిడ్నీలో తన స్పిన్ కూడా ఉపకరించగలదని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. గత నాలుగు ఇన్నింగ్స్‌లో చెత్త షాట్లతో వికెట్ పారేసుకున్న ట్రావిస్ హెడ్ బ్యాటింగ్‌పై కూడా జట్టు అసహనంతో ఉంది. లోయర్ ఆర్డర్ అద్భుతంగా రాణించడం వారికి సానుకూలాంశం. బౌలర్లు స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్, లైయన్ బ్యాట్‌తోనూ పోరాడుతున్నారు. ఈ ఏడాదిని విజయంతో ఫ్రెష్‌గా ప్రారంభించాలని ఆసీస్ భావిస్తోంది.

పిచ్/ వాతావరణం

సిడ్నీ పిచ్‌ను అందరికీ అనుకూలించేలా రూపొందించామని క్యూరేటర్ జస్టిన్ గ్రోవ్స్ అంటున్నాడు. తొలిరోజు స్వింగ్‌తోపాటు ఓపికగా బ్యాటింగ్ చేస్తే బ్యాట్స్‌మెన్‌కు అనుకూలిస్తుందని, తర్వాత స్పిన్‌కు ఉపకరిస్తుందని తెలిపాడు. మ్యాచ్ రోజుల్లో వాతావరణం వేడిగా ఉంటుంది. అలాగే నాలుగు, ఐదు రోజుల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది.

జట్లు (అంచనా)

ఇండియా: మయాంక్, రాహుల్, పుజారా, కోహ్లీ (కెప్టెన్), రహానె, విహారి, పంత్ (వికెట్ కీపర్), జడేజా, షమి, ఉమేశ్, బుమ్రా.
ఆస్ట్రేలియా: హారిస్, ఖవాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కాంబ్/ఫించ్, హెడ్, లాబుషేన్, పైన్ (కెప్టెన్), కమిన్స్, స్టార్క్, లైయన్, హేజిల్‌వుడ్.

మేం చరిత్ర గురించి ఆలోచించడం లేదు. కానీ, ఇక్కడ సిరీస్ గెలిస్తే అది మాకు చాలా పెద్ద ఘనత అవుతుంది. 2014లో ధోనీ టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించినప్పుడు మా టీమ్ సంధికాలాన్ని ఇక్కడే ప్రారంభించింది. ఇప్పుడు వరల్డ్ నెంబర్ వన్‌గా మళ్లీ ఇక్కడకు వచ్చాం. ఈ లెగసీని కొనసాగిస్తాం. **- విరాట్ కోహ్లీ**

4 గతేడాది టెస్టుల్లో ఆసీస్ బ్యాట్సమెన్ చేసిన సెంచరీలు. 1996 తర్వాత ఒక ఏడాది చేసిన అతి తక్కువ సెంచరీలు. అయితే ఈ నాలుగు సెంచరీలలో మూడు ఇంగ్లండ్‌తో జరిగిన సిడ్నీ టెస్టులో వచ్చాయి.

25 ఆస్ట్రేలియా గడ్డపై ఒక టెస్ట్ సిరీస్‌లో ఇండియా ఫాస్ట్ బౌలర్ పడగొట్టిన అత్యధిక వికెట్లు. 1991–92లో ఐదు మ్యాచ్‌ల సిరీస్ కపిల్ దేవ్ ఈ రికార్డు నమోదు చేశాడు. ఈ సిరీస్‌లో బుమ్రా 20 వికెట్లు తీశాడు.

మేం స్వదేశంలో ఇండియాకు తొలిసారి సిరీస్‌ను కోల్పోయే ప్రమాదం ముంగిట నిలిచాం. అయితే, దాని గురించి ఆందోళన చెందకుండా ఈ మ్యాచ్‌లో ఎలా ఆడాలన్నదానిపైనే దృష్టి సారించాం. వీలైనంత బాగా ఆడేందుకు ప్రయత్నిస్తాం. సిడ్నీలో ఇండియాకు గట్టి పోటీ ఇస్తామన్న నమ్మకం ఉంది. **- టిమ్ పైన్**

క్వార్టర్స్‌లో నిఖత్ జరీన్

హైదరాబాద్, వెలుగు: జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ నిఖత్ జరీన్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. 51 కేజీల విభాగంలో బుధవారం జరిగిన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో నిఖత్ 5-0తో లిఖిత బత్తిని (ఆంధ్రప్రదేశ్)పై విజయం సాధించింది. ఇదే టోర్నీలో అగ్రశ్రేణి ప్లేయర్ సోనియా లేథర్, సిమ్రన్‌జిత్ కౌర్ కూడా క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. 57 కేజీల ఫెథర్ వెయిట్ విభాగం ప్రిక్వార్టర్స్‌లో సోనియా 5-0తో సలోని షాపై గెలుపొందింది. మరోవైపు 64 కేజీల విభాగంలో సిమ్రన్‌జిత్ 5-0తో సంధ్యపై, 54 కేజీల విభాగంలో మనీషా మౌన్ 5-0తో రియా టోకాస్‌పై విజయం సాధించారు. ఇక 51 కేజీల విభాగంలో పింకీ జంగ్రా కూడా ముందంజ వేసింది.

బెంగళూరుకు రెండో విజయం

ఢిల్లీ డాషర్స్‌కు వరుసగా నాలుగో ఓటమి

అహ్మదాబాద్: కిడాంబి శ్రీకాంత్, తై ట్రాంగ్ పోరాడడంతో ఢిల్లీ డాషర్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు రాప్టర్స్ 2-1 తేడాతో విజయం సాధించింది. శ్రీకాంత్ నేతృత్వంలోని బెంగళూరు రాప్టర్స్‌కు ఈ సీజన్‌లో ఇది రెండో విజయం కాగా, హెచ్‌ఎస్ ప్రణయ్ నాయకత్వంలోని డాషర్స్‌కు ఇది వరుసగా నాలుగో ఓటమి. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ టైలో తొలుత జరిగిన పురుషుల సింగిల్స్‌లో బెంగళూరు ఆటగాడు సాయి ప్రణీత్ 2-1 తేడాతో డాషర్స్ ప్లేయర్ హెచ్ ఎస్ ప్రణయ్‌పై గెలిచాడు. మూడు గేములు పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ప్రణీత్ 15-12, 14-15, 15-13తో గెలిచాడు. డాషర్స్‌కు ఇది ట్రంప్ మ్యాచ్ కావడంతో ఖాతాలో ఓ మైనస్ పాయింట్ చేరింది. రెండోదిగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో డాషర్స్‌కు చెందిన జాంగ్‌జిత్- కొసెత్స్కయా జోడి బెంగళూరుకు చెందిన ఎల్లీస్- స్మిత్ జోడిపై 15-13, 15-9తో వరుస గేముల్లో గెలిచింది. బెంగళూరుకు ఇది ట్రంప్ మ్యాచ్ కావడంతో ఓ మైనస్ పాయింట్ ఖాతాలో చేరింది. దీంతో తొలి రెండు మ్యాచులు ముగిసే సరికి రెండు జట్లు 0-0తో టై లో సమానంగా నిలిచాయి. తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్‌లో బెంగళూరు కెప్టెన్ కిడాంబి శ్రీకాంత్ 15-6, 12-15, 15-10తో డాషర్స్ ప్లేయర్ సుగియార్తోపై గెలిచాడు. ఈ మ్యాచ్ చివరి వరకు హోరాహోరీగా సాగింది. ఈ విజయంతో బెంగళూరు 1-0తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాత జరిగిన మహిళల సింగిల్స్‌లో బెంగళూరు ప్లేయర్ తై ట్రాంగ్ వు 15-6, 12-15, 15-10తో డాషర్స్ ప్లేయర్ హ్సాన్ లీపై పోరాడి గెలిచి, జట్టును 2-0 ఆధిక్యంలో నిలపడమే కాకుండా విజయాన్ని ఖరారు చేసింది. చివరగా జరిగిన పురుషుల డబుల్స్‌లో డాషర్స్‌కు చెందిన చై బెయో- జాంగ్‌జిత్ జోడి 15-7, 11-15, 15-14 బెంగళూరుకు చెందిన మహ్మద్ హసన్- హెండ్రా సెతియావన్ జోడిపై గెలిచింది.



శ్రీకాంత్

నేటి మ్యాచ్

పుణె 7 ఏసెస్ x చెన్నై స్మాషర్స్ రా. 7

జట్టులోకి రాకుండా అఫ్రీది అడ్డుకున్నాడు

పాక్ మాజీ కెప్టెన్ భట్ ఆరోపణ

కరాచీ: మ్యాచ్ ఫిక్సింగ్ కేసులో ఐదేళ్ల నిషేధం ఎదుర్కొన్న తర్వాత పాకిస్తాన్ జట్టులో తన రీ ఎంట్రీకి మాజీ స్టార్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రీది అడ్డుతగిలాడని ఆ దేశ మాజీ కెప్టెన్ సల్మాన్ భట్ ఆరోపించాడు. నిషేధం తర్వాత దేశవాళీ క్రికెట్‌లో ఆడిన తాను ఇండియాలో జరిగిన 2016 వరల్డ్ టీ20లో పాల్గొన్న పాక్ టీమ్‌లో చోటు దక్కించుకునేందుకు చాలా దగ్గరగా వచ్చానని చెప్పాడు. కానీ, అప్పుడు కెప్టెన్‌గా ఉన్న అఫ్రీది.. తాను టీమ్‌లోకి రాకుండా కుట్ర చేశాడన్నాడు. 'వరల్డ్‌కప్‌నకు ముందు టీమ్ హెడ్ కోచ్ వకార్ యూనిస్, బ్యాటింగ్ కోచ్ గ్రాంట్ ఫ్లవర్ నన్ను ఎన్‌సీఏకు పిలిచారు. నెట్స్‌లో నా బ్యాటింగ్‌తో పాటు ఫిట్‌నెస్‌ను పరీక్షించారు. పాక్ టీమ్‌లో మళ్లీ బరిలోకి దిగేందుకు మానసికంగా సిద్ధంగా ఉన్నావా? అని వకార్ నన్ను అడిగితే రెడీ అని చెప్పా. అలా నా రీ ఎంట్రీకి అన్నీ మార్గాలు తెరుచుకున్నాయి. కానీ అఫ్రీది నాకు అడ్డుపడ్డాడు. అఫ్రీది అలా ఎందుకు చేశాడో నాకు తెలియద'ని భట్ తెలిపాడు.

నేను మేనేజ్ చేస్తా.. అశ్వినే శ్రద్ధ పెట్టాలి!

గాయాలపై విరాట్ కోహ్లీ

సిడ్నీ: కొన్నేళ్ల నుంచి తాను వెన్నునొప్పితో బాధపడుతున్నా దాని గురించి పెద్దగా ఆందోళన చెందడం లేదని కెప్టెన్ విరాట్ కోహ్లీ స్పష్టం చేశాడు. ఇలాంటివి తనకు కొత్తేం కాదని చెప్పాడు. గాయాలవకుండా జాగ్రత్త పడడం, నొప్పి నివారణ గురించి తనకు స్పష్టమైన అవగాహన ఉందని తెలిపాడు. అయితే, వరుసగా రెండో టూర్‌లోనూ ఒకే రకమైన గాయంతో ఇబ్బంది పడుతున్న స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మాత్రం ఇంజురి మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నాడు. '2011 నుంచి నాకు ఈ సమస్య ఉంది. ఇదేమీ కొత్తది కాదు. ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెట్టి దాని నుంచి ఇబ్బంది రాకుండా చూసుకుంటున్నాన'ని విరాట్ అన్నాడు. ఇక, అశ్విన్.. పొత్తికడుపు నొప్పి కారణంగా గత రెండు మ్యాచ్‌లకు దూరం అయ్యాడు. 'ఇంగ్లండ్‌తో పాటు ఈ టూర్‌లో కూడా అశ్విన్ ఒకే రకమైన సమస్యతో బాధపడడం దురదృష్టకరం. ఇలా తరచూ గాయాలపాలవకుండా అతను మా అందరికంటే ఎక్కువ శ్రద్ధ తీసుకోవాల్సిందే. టెస్ట్ టీమ్‌లో అశ్విన్ చాలా ముఖ్యమైన వ్యక్తి. మున్ముందు వంద శాతం ఫిట్‌నెస్‌తో ఉండాలని మేమంతా కోరుకుంటున్నామ'ని విరాట్ చెప్పాడు.



గుజరాత్ x యూపీ యోధ

నేడు క్వాలిఫయర్-2

ముంబై: గత మూడు నెలలుగా జరుగుతున్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఆరో సీజన్ తుది అంకానికి చేరుకుంది. ఫైనల్లో చోటు కోసం గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్, యూపీ యోధ గురువారం క్వాలిఫయర్-2లో తలపడనున్నాయి. గతంలో ఇంటర్‌జోనల్ చాలెంజ్ వీక్‌లో భాగంగా జరిగిన పోరులో యూపీ యోధపై గుజరాత్ గెలుపొందింది. నేటి మ్యాచ్‌లో కూడా అదే ఆటతీరు కొనసాగించాలని గుజరాత్ భావిస్తోంది. గురువారం జరిగే ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు శనివారం జరిగే ఫైనల్లో బెంగళూరు బుల్స్‌తో పోటీపడనుంది.

అరుదైన పసుపు బొమ్మలు

రంగులంటే ఇప్పుడున్నాయి. అందరికీ రంగుల ప్రపంచం కనిపిస్తోంది. రంగుల సినిమా వచ్చి కూడా ఓ నాలుగైదు దశాబ్దాలు అవుతోందేమో. కానీ, కొన్ని వేల ఏళ్ల క్రితమే ఆది మానవుడు రంగులను చాలా బాగా వాడుకున్నాడు. రాళ్లపై రంగురంగుల పెయింటింగ్స్ వేశాడు. మామూలుగా అయితే వాళ్లు కామన్‌గా వాడిన రంగులు ఎరుపు, తెలుపు అని చెబుతుంటారు. కానీ, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగులూ వాడారట. ఆ రంగుల రాతి బొమ్మలు కనిపించడం దేశంలోనే చాలా అరుదట. ఆ అరుదైన బొమ్మలు తెలంగాణలో కనిపించి నాటి ఆదిమానవుడి ఆనవాళ్లను మన దగ్గరా చాటుతున్నాయి.

మెదక్/హైదరాబాద్, వెలుగు:

దేశంలోనే అరుదైన రాతి చిత్రాలను మెదక్ జిల్లా హవేలి ఘనపురం మండలంలోని జక్కన్నపేట గుహల్లో కనుగొన్నారు. బొగ్గుల శంకర్‌రెడ్డి, శ్రీరామోజు హరగోపాల్, వేముగంటి మురళి తదితరులతో కూడిన తెలంగాణ జాగృతి బృందం కొంతకాలంగా జిల్లాలో పరిశోధన చేస్తోంది. ఆ రాతి చిత్రాలు మధ్యరాతియుగం, కొత్తరాతి యుగం నాటివి అయి ఉంటాయని శంకర్‌రెడ్డి చెబుతున్నారు. అంతేగాకుండా రాతి పనిముట్లు, వాటిని తయారు చేసేందుకు వాడే రాతి సామగ్రిని అక్కడ గుర్తించారు.



- మెదక్ జిల్లా జక్కన్నపేటలో రాతియుగం నాటి రాతి చిత్రాలు
- దేశంలోనే అరుదైన చిత్రాలు అని చెబుతున్న చరిత్రకారులు

పసుపు పెయింటింగ్స్.. చాలా అరుదు

గుహల గోడలపై పసుపు, ఎరుపు రంగులతో పెయింటింగ్స్ వేశారు నాటి మానవులు. ఈ ఎల్లో పెయింటింగ్స్ తెలంగాణలోనే కాకుండా భారత దేశంలోనే అరుదైనవని చరిత్రకారులు అంటున్నారు. ఇంతకుముందు కూడా తెలంగాణలోనే ఈ ఎల్లో పెయింటింగ్స్ బయటపడ్డాయని, మంచిర్యాల్ జిల్లాలో వాటిని గుర్తించామని తెలంగాణ జాగృతి చరిత్రకారుడు శ్రీరామోజు హరగోపాల్ చెప్పారు. "జక్కన్నపేటలో బయటపడిన ఈ రాతి చిత్రాలు క్రీస్తు పూర్వం 8,500-3,000 మధ్య కాలం నాటివి అయి ఉండొచ్చు. మా టీంలోని శంకర్ రెడ్డి వాటిని తొలిసారి కనిపెట్టారు. సన్నని, మందపాటి లైన్లతో నాటి మనిషి బొమ్మలు గీశాడు. అవి కొత్త రాతి యుగం నాటివి అయి ఉంటాయని మేం భావిస్తున్నాం'' అని చెప్పారు. ఆది మానవుడి రాతి పెయింటింగ్స్‌లో ఎరుపు, తెలుపు రంగులు చాలా కామన్ అని, పసుపు, ఆకుపచ్చ, నీలి రంగులే చాలా అరుదని ఆయన అన్నారు.



దేశంలో కొన్ని చోట్లలోనే...

పసుపు రంగులో రాతి బొమ్మలున్న ప్రాంతాలు దేశంలో చాలా తక్కువ. తెలంగాణలోని 70 సైట్లలో పరిశోధనలు చేస్తే కొన్నాళ్ల క్రితం మంచిర్యాల్‌లో ఈ పసుపు రంగు రాతి చిత్రాలు వెలుగులోకి వచ్చాయని హరగోపాల్ తెలిపారు. అవి కొత్త రాతియుగం నాటివి అయి ఉండొచ్చన్నారు. వర్గల్ రాక్ ఆర్ట్ సైట్‌లోని శాంపిళ్లను తీసుకుని రామన్ స్పెక్ట్రోస్కోపీ టెస్టులు చేస్తే ఆ రంగులను హెమటైట్ అనే ఖనిజం నుంచి తయారు చేసినట్టు తేలిందన్నారు. జేగురు (ఐరన్ ఆక్సైడ్) నుంచి ఎరుపు, సున్నపు రాయి నుంచి తెలుపు, హరిత స్ఫటికం నుంచి ఆకుపచ్చ రంగు తయారు చేసి ఉండవచ్చని శంకర్‌రెడ్డి చెప్పారు. కొందరు నిపుణులు ఆయా రంగులను రంగు రాళ్లు లేదంటే మొక్కల నుంచి తయారు చేసి ఉంటారని చెబుతున్నారు. రాయిపై ఆ రంగును వేస్తే వెంటనే రసాయనిక చర్య జరిగి శాశ్వతంగా ఆ రాయిపై అలా ఉండిపోతుందని అంటున్నారు.

ఎరుపువి రాతియుగానివి...

పసుపు రంగు లైన్లతో పాటున్న ఎరుపు రంగు బొమ్మలు మాత్రం రాతి యుగానికి చెందినవని రాతి పెయింటింగ్ నిపుణుడు బండి మురళీధర్ రెడ్డి చెప్పారు. ఈ ఎల్లో లైన్స్ ఏ కాలానివో చెప్పాలంటే మాత్రం సైట్‌కు వెళ్లాల్సిందేనని, తాను సైట్ దగ్గరకు ఇప్పటిదాకా వెళ్లలేదని తెలిపారు. తెలంగాణ జాగృతి వాళ్లు పంపించిన ఫొటోలనే తాము విశ్లేషించామన్నారు. ఎల్లో పెయింటింగ్స్ మెరిసిపోతున్నాయని, ఆ మెరుపు దానికి స్వతహాగా ఉందా లేదంటే ఫొటోల్లో అలా కనిపిస్తుందా అనేది నిర్ధారించాల్సి ఉందన్నారు.

ఏమేం బొమ్మలు కనిపించాయి?

ఎద్దు, నెమలి వంటి జంతువులు సహా చెట్ల బొమ్మలు అక్కడ వెలుగులోకి వచ్చాయి. మనుషులు, మనుషుల తలలను బొమ్మలుగా గీశారు. మరో చోట పాముల బొమ్మలు వేశారు. అక్కడక్కడ పక్షులనూ గీశారు. ఓ గుహ ద్వారం ప్రారంభంలో తెలుపు రంగు గీతలతో హనుమంతుడి బొమ్మనూ నాటి మానవులు గీసినట్టు చరిత్రకారులు చెబుతున్నారు.

ఇంతకుముందూ

మెదక్ మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని పడిగెరాయిపై స్త్రీ, వేటగాడి రూపాలతోపాటు పలు బొమ్మలను గుర్తించారు. రాయిన్‌పల్లి శివారులోని రాయిపై రాజు, రాణి చిత్రాలు, వెల్దుర్తి మండలం బస్వాపూర్ శివార్లలోని మల్లన్నగుట్ట వద్ద సూర్యుడు, చేప, స్వస్తిక్, సర్కిల్, డ్యాన్సు చేస్తున్న మహిళ చిత్రాలను కనుగొన్నారు. మెదక్ పట్టణ శివారులోని బారాకమాన్ సమీపంలో ఉన్న నెమళ్లకుచ్చ వద్ద, మంబోజిపల్లి సమీపంలోని పెద్ద బండరాయి మీద, రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్ తదితర ప్రాంతాల్లో ఆదిమానవుల ఆనవాళ్లు బయటపడ్డాయి. నిజానికి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో మాత్రమే ఈ రాతి పెయింటింగ్స్ వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ ఓఆర్ఆర్‌కు సమీపంలోని కోకాపేట్‌లోనూ ఆ ఆనవాళ్లు కనిపించాయి.





రాతి పనిముట్లు లభ్యం

రాతి చిత్రాలతో పాటు, ఆయా కాలాల్లో వారు వివిధ అవసరాలకు వినియోగించిన రాతి పనిముట్లు లభ్యమైనట్లు శంకర్‌రెడ్డి చెప్పారు. జంతువుల చర్మం చీల్చేందుకు ఉపయోగించిన 'ఎవిథిస్ట్ స్టోన్', మాంసం కోయడానికి వాడిన 'ఎగెట్', షేవింగ్ బ్లేడ్ మాదిరిగా ఉపయోగించిన 'జాస్టర్ స్టోన్'లను గుర్తించినట్టు తెలిపారు. రాతి చిత్రాలు, ఆ పనిముట్లు ఆనవాళ్లు సుమారు 60 వేల సంవత్సరాల క్రితానికి చెందినవిగా భావిస్తున్నామని చెప్పారు.




ఒక్క బుక్కకూ సరిపోదేమో...

నోటికి సగం కూడా లేదు. మింగేస్తే ఒక్క బుక్కకూ సరిపోదేమో. ఇలాంటి పెద్దపెద్ద తిమింగలాలతో మనల్ని పోల్చుకున్నప్పుడు వాటికి మనం చీమల్లాంటోళ్లమే కదా. దీన్ని స్పెర్మ్ వేల్ అంటారు. దాదాపు 40 అడుగుల దాకా పెరుగుతాయి. 59 వేల కిలోల బరువు తూగుతాయి. అయితే, పాపం అంత పెద్ద ఆ తిమింగలాలకు కడుపు నిండా తిండి దొరకట్లేదట. ఆ భారీ శరీరానికి తగినట్టు తిండిని దొరికించుకోవడం వాటికి రోజూ ఓ పెద్ద సవాలేనట. అందుకే అవి అంతకుమించి పెరగట్లేవట. ఇటీవలే సైంటిస్టులు వీటి గురించి చెప్పిన మాటలివి.

చంద్ర సమేత గురు, శుక్ర!

రోజూ చంద్రుడిని చూస్తారు కదా? హా.. చూస్తాం.. అందులో వింతేముంది అని ఎదురు ప్రశ్నిస్తారా? చంద్రుడొక్కడిని చూస్తే వింతేం లేదుగానీ, ఆ చంద్రుడితో పాటు గురుడు, శుక్రుడిని చూసేస్తే వింతే కదా. అవును, మామూలుగా అయితే గురుడు, శుక్రుడు మనకు ఆకాశంలో కనిపించవు కదా. కానీ, ఇప్పుడు చంద్రుడి సమేతంగా ఆ రెండు గ్రహాలూ మనకు కనువిందు చేస్తున్నాయి. పొయ్యేదేముంది ఓ లుక్కేద్దాం అని రాత్రి కాగానే ఆకాశంవైపు కళ్లప్పగించేయొద్దు మరి. దానికంటూ ఓ టైం ఉంది. ఆ మూడింటినీ చూడాలంటే పొద్దున్నే లేవాలి మరి. ఉదయం 6 గంటలకు తెలతెల్లవారేటప్పుడే కనిపిస్తాయట. ఇప్పుడు మీరు చూస్తున్న ఫొటో అదే మరి. హైదరాబాద్‌లో తీశారు. కొత్త సంవత్సరాన (జనవరి 1) కొత్తకొత్తగా ఇలా చంద్ర సమేత గురు, శుక్ర గ్రహాలు అతిథిలా వచ్చాయన్నమాట. జనవరి 22 వరకూ ఈ ఖగోళ అద్భుతం కనువిందు చేస్తుందట. చంద్రుడి కింద ఓ చుక్కలా కనిపిస్తోంది కదా.. అది శుక్రుడు. ఆ శుక్రుడికి చాలా దూరంలో చెట్ల కొమ్మలకు దగ్గరగా మరింత చిన్నగా ఇంకో చుక్క కనిపిస్తోంది కదా.. అదేమో గురుడు. గురుడి కక్ష్యలోకి శుక్రుడు వచ్చే ఖగోళ పరిణామం వల్లే ఆకాశంలో ఈ అద్భుతం కనిపిస్తుందని ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఫౌండర్ సెక్రటరీ ఎన్ రఘునందన్ తెలిపారు. ఏ అద్దాలూ పెట్టుకోకుండానే, టెలిస్కోపుల అవసరం లేకుండానే మామూలుగానే వాటిని చూసేందుకు అవకాశం ఉంటుందని ఆయన చెబుతున్నారు.



ఇట్లయితే అమెరికాలో ఇండియన్లే ఎక్కువైతరు

వాషింగ్టన్:

గ్రీన్‌కార్డు (లీగల్ పర్మనెంట్ రెసిడెన్సీ) ఉంటే అమెరికాలో శాశ్వతంగా ఉండొచ్చు, పని చేసుకోవచ్చని అందరూ బాగా ఆశపడతారు. బాగా చదువుకున్న, ప్రత్యేక విభాగంలో మంచి నైపుణ్యమున్న విదేశీయులు హెచ్1బీ వీసాపై యూఎస్ వెళ్లి పని చేస్తుంటారు. పరిమిత కాలం తర్వాత గ్రీన్‌కార్డు కోసం అప్లై చేసుకుంటారు. ఈ గ్రీన్‌కార్డులకు సంబంధించి అమెరికా ఎప్పటి నుంచో ఓ నిబంధన అమలు చేస్తోంది. అమెరికాకు ఉద్యోగం కోసం వలస వచ్చే వారికి దేశం వారీగా ఏటా 7 శాతం కోటా కేటాయిస్తోంది. కోటా మించితే మిగిలిన వాళ్లు మరో ఏడాది వరకు ఎదురు చూడక తప్పదు. తాజాగా ఆ కోటా తీసేయాలని యూఎస్ కాంగ్రెస్ ఆలోచిస్తోంది. గురువారం నుంచి జరిగే కాంగ్రెస్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలనుకుంటోంది. ఆ కోటాగానీ తీసేస్తే మిగతా దేశాలతో ఇండియన్ల పోటీ భారీగా పెరిగే అవకాశాలుంటాయి. దాని ప్రభావంపై డిసెంబర్ 21న 'పర్మనెంట్ ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్ ఇమిగ్రేషన్ అండ్ పర్ కంట్రీ సీలింగ్' పేరుతో ది బై పార్టిసాన్ కాంగ్రెషనల్ రీసర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) రిపోర్టు విడుదల చేసింది. బిల్లు తెస్తే ఇండియన్లు, చైనీయుల వలస ఎక్కువగా ఉంటుందని వెల్లడించింది. వివిధ సమస్యలు, అంశాలపై చట్టసభలు శాసనాలు చేసేందుకు కావాల్సిన రిపోర్టులను సీఆర్ఎస్ రూపొందిస్తుంది.

కొత్త వాళ్లు తగ్గొచ్చు

గ్రీన్‌కార్డులకు సంబంధించి దేశం వారీగా ఉన్న కోటా తీసేస్తే కార్డుల కోసం వేచి చూసే సమయం తగ్గుతుందని సీఆర్ఎస్ చెప్పింది. దీని వల్ల కార్డుల కోసం ఇప్పటికే ఎక్కువగా పోటీ పడుతున్న ఇండియన్లు, చైనీయుల నుంచి ఎక్కువ దరఖాస్తులొస్తాయని వెల్లడించింది. 'ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్' ప్రకారం ఫ్యామిలీ స్పాన్సర్‌షిప్ నిబంధనల ద్వారా కుటుంబ సభ్యులకు ఎల్‌పీఆర్ స్పాన్సర్ చేయొచ్చని, పరిమితి తొలగిస్తే ఈ విధంగా కూడా వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందంది. ఐదు రకాల ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్ ఎల్‌పీఆర్ కేటగిరీల్లో 1,40,000 వరకు వీసాలను ఐఎన్‌ఏకు 2017లో కేటాయించారని, అప్పుడు వచ్చిన ఎల్‌పీఆర్‌లలో (11 లక్షలు) ఇది 12 శాతమని వివరించింది. గ్రీన్‌కార్డులపై పరిమితి లేకుంటే ఐఎన్‌ఏ వల్ల కూడా కొత్త వాళ్లు, మంచి నైపుణ్యం ఉన్న వారి సంఖ్య తగ్గుతుందని తేల్చింది. అయితే ఆయా దేశాల నుంచి ఉద్యోగులను తీసుకునే కంపెనీలకు ఇది చాలా ఉపయోగపడుతుందని కూడా సీఆర్ఎస్ చెప్పింది. ముఖ్యంగా యూఎస్ లేబర్ మార్కెట్‌లో ప్రస్తుతమున్న వివక్ష తగ్గుతుందని, కంపెనీలు నచ్చిన వారిని ఎంపిక చేసుకోవచ్చని వివరించింది.



- గ్రీన్‌కార్డుల్లో దేశం వారీ కోటా తొలగిస్తే వాళ్లే పెరుగుతారు
- యూఎస్ బై పార్టిసాన్ కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ వెల్లడి
- ప్రస్తుతం ప్రతి దేశానికి 7 శాతం పరిమితి
- కోటా తొలగింపుపై త్వరలో యూఎస్ కాంగ్రెస్‌లో బిల్లు

దేశ ఆర్థిక వృద్ధికి అవసరం

కోటా పరిమితి తీసేస్తూ చట్టం తీసుకొస్తే భవిష్యత్‌లో ఉద్యోగ వలసలు పెరుగుతాయని, ప్రతి దేశస్తునికి సమాన అవకాశాలు లభిస్తాయని ప్రతిపాదకులు భావిస్తున్నారు. దేశ ఆర్థిక వృద్ధికి ఇది అవసరమని కూడా వాదిస్తున్నారు. అయితే దీన్ని వ్యతిరేకిస్తున్న వారు మాత్రం ఇలాంటి నిర్ణయాల వల్ల అమెరికా ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుందని.. అమెరికన్ల జీతాలు, ఉద్యోగాలకు ఎసరొస్తుందంటున్నారు. "గ్రీన్‌కార్డులపై ఉన్న పరిమితి తొలగిస్తే అమెరికాకు వచ్చే హై స్కిల్డ్ విదేశీయుల సంఖ్య పెరుగుతుంది. ముఖ్యంగా యూఎస్ టెక్నాలజీ రంగానికే వలసలు పెరుగుతాయి. వీరిలో ఇండియా, చైనా, ఫిలిప్పైన్స్ లాంటి దేశాల వాళ్లే ఎక్కువుంటారు'' అంటున్నారు.

తొమ్మిదిన్నరేళ్లు వెయిటింగే

ఉద్యోగ ఆధారిత వలసదారులుగా యూఎస్ ఆమోదం పొందినా ఎల్‌పీఆర్‌లపై పరిమితి వల్ల తమ వంతు కోసం ఎదురు చూస్తున్న విదేశీయుల సంఖ్య 2018 నాటికి 9 లక్షలకు చేరుకుంది. వీరిలో ఎక్కువగా ఇండియా, చైనా, ఫిలిప్పీన్స్ దేశాల ప్రజలే ఉన్నారు. 2018 ఏప్రిల్ నాటికి గ్రీన్ కార్డుల కోసం 3,95,025 మంది విదేశీయులు (ఒకే కేటగిరీలో) ఎదురు చూస్తున్నారు. వారిలో 3,06,601 మంది ఇండియన్లే ఉన్నారు. అంటే 78 శాతం. వీళ్లలోనూ ఐటీ ఉద్యోగులే ఎక్కువ. వీళ్లంతా ఉద్యోగ కోటాలోనే గ్రీన్‌కార్డుల కోసం అప్లై చేశారని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ వెల్లడించింది. ఇండియా తర్వాత 67,031 మందితో చైనా రెండో స్థానంలో ఉందంది. ప్రస్తుత పరిమితి వల్ల వెయిటింగ్ లిస్టులో ఉన్న ఇండియన్లు గ్రీన్‌కార్డుల కోసం తొమ్మిదిన్నరేళ్లు వేచి చూడాల్సి వస్తోందని చెప్పింది.



ఆటకు అనుకోని అతిథి

అది కాలేజీ ఫుట్‌బాల్ మ్యాచ్. రెండు టీంల మధ్య హోరాహోరీగా ఆట సాగుతోంది. రెండు టీంల అభిమానులు, మద్దతుదారులు తమతమ టీంలకు చీర్స్ చెబుతూ జోరుమీదున్నారు. ఇంతలోనే ఆ ఆటకు ఓ అనుకోని అతిథి వచ్చింది. ఆ అతిథి పే..ద్ద డేగ. ఏమనుకుందో ఏమోగానీ సరాసరి ఆకాశం నుంచి స్టేడియంలోకి వచ్చేసిందా డేగ. వచ్చీరాగానే ఓ వ్యక్తి భుజాలపై వాలిపోయింది. అంతపెద్ద డేగ ఒక్కసారిగా వచ్చి వాలడంతో ఆ వ్యక్తి కాస్త కంగారు పడినా ఆ తర్వాత చాలా ఆనంద పడ్డాడు. ఇక, పక్కనున్నోళ్లు ఫొటోలు తీశారు. ఫొటోలకూ ఆ డేగ భలే పోజులిచ్చింది. ఆ తర్వాత అది అక్కడి నుంచి ఎగిరిపోయింది. ఇప్పుడు ఆ ఫొటోలు, వీడియో నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ఘటన అమెరికా టెక్సాస్‌లోని ఆర్లింగ్టన్‌లోగల ఏటీ అండ్ టీ స్టేడియంలో జరిగింది. నోటర్ డేమ్ ఫైటింగ్ ఐరిష్, క్లెమ్సన్ టైగర్స్ మధ్య మ్యాచ్ సందర్భంగా ఈ అతిథి ప్రత్యక్షమైంది. ఇక, ఆ డేగ వాలిన అదృష్టవంతుడి పేరు ఆల్బర్ట్ అర్మస్. ఇప్పుడతడు ఆ డేగ పుణ్యమాని బాగా ఫేమస్ అయిపోయాడు. అతడి తర్వాత ఆ పక్కనే కూర్చున్న టుయెన్ ఎంగుయెన్ అనే వ్యక్తిపైనా వాలింది.



- టైప్ 2 డయాబెటిస్ కోసం వాడుతున్న సల్ఫోనిలురియాస్, బేసల్ ఇన్సులిన్ మందుల వల్ల మున్ముందు గుండె జబ్బులు వస్తాయట. బేసల్ ఇన్సులిన్ వాడుతున్న ప్రతి 37 మందిలో ఒకరు, సల్ఫోనిలురియాస్ వాడుతున్న ప్రతి 103 మందిలో ఒకరికి గుండెపోటు ముప్పు ఉందని కాలిఫోర్నియాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ సర్వేలో తేలింది.

బౌలింగ్ పిన్‌లా అల్టిమా థూలే

- ఫొటోలు తీసి పంపిన నాసా న్యూహొరైజాన్స్

వాషింగ్టన్:

అమెరికాకు చెందిన న్యూహొరైజాన్స్ అంతరిక్ష నౌక కొత్త ఏడాది కొత్త చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు ఏ అంతరిక్ష నౌక చేరని దూరాన్ని ఛేదించింది. మనిషి పంపిన స్పేస్‌క్రాఫ్ట్‌లలో ప్లూటో వరకు వెళ్లడమే గొప్ప అనుకుంటే దానికి కూడా 160 కోట్ల కిలోమీటర్ల దూరంలో క్యూపర్ బెల్ట్‌లో ఉన్న అల్టిమా థూలే దగ్గరకు వెళ్లి కొత్త రికార్డు నెలకొల్పింది. సుమారు 640 కోట్ల కిలోమీటర్ల దూరాన్ని విజయవంతగా ప్రయాణించింది. అల్టిమాకు సంబంధించిన ఫొటోలను కొత్త ఏడాది కానుకగా తీసి పంపింది. థూలే ఫొటోలు పంపిన 10 గంటలకు భూమిని చేరాయని, స్పేస్ క్రాఫ్ట్ చాలా దూరముంది కాబట్టి అమాత్రం సమయం పడుతుందని నాసా చెప్పింది. హొరైజాన్స్ పంపిన ఫొటోలను బట్టి అది 'బౌలింగ్ పిన్ (బౌలింగ్ గేమ్‌లోని టార్గెట్ వస్తువు)'లా ఉందని సైంటిస్టులు భావిస్తున్నారు. అయితే దాని ఆకారాన్ని బట్టి రెండు వస్తువులు ఒకదాని చుట్టూ మరొకటి తిరుగుతూ ఉండొచ్చని కూడా అంచనా వేస్తున్నారు. ఆ ఖగోళ వస్తువు 32 కిలోమీటర్ల వెడల్పు, 16 కిలోమీటర్ల పొడవు ఉండొచ్చనుకుంటున్నారు. ప్రస్తుతం స్పేస్ క్రాఫ్ట్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, చక్కగా పని చేస్తోందని అంతరిక్ష నౌకను కంట్రోల్ చేస్తున్న మేరీలాండ్‌లోని జాన్స్ హాప్‌కిన్స్ ఐప్లైడ్ ఫిజిక్స్ లేబొరేటరీ వెల్లడించింది. హొరైజాన్స్ మరో 20 నెలల పాటు అల్టిమాకు సంబంధించిన ఫొటోలు పంపిస్తుందని పేర్కొంది. అల్టిమా సౌర కుటుంబం మొదట్లో ఏర్పడిన వస్తువని, దాన్ని అధ్యయనం చేస్తే మిగతా గ్రహాల స్థితిగతులు తెలుసుకోవచ్చని సైంటిస్టులు అభిప్రాయపడుతున్నారు.



Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.